సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 329

బుధవారం 19-2-2020

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'



### సచిన్‌ను సగర్వంగా భుజాలపై..

ప్రతిష్టాత్మక 'లారియస్ బెస్ట్ స్పోర్టింగ్ మూమెంట్' అవార్డు సొంతం చేసుకున్న భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్. అత్యుత్తమ క్షణంగా 'క్యారీడ్ ఆన్ ద షోల్డర్స్ ఆఫ్ ఎ నేషన్'. 2011 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ తర్వాతి సంబరాలకు పురస్కారం. 'లారియస్' అవార్డు పొందిన తొలి భారతీయ క్రీడాకారుడిగా సచిన్ గుర్తింపు. **- స్పోర్ట్స్‌లో**

# ఇప్పుడు మీ అలర్జీ పరీక్షను చేయించుకోండి

## సగం కంటే తక్కువ ధరలలో

## ఒక రక్త పరీక్ష అలర్జీకి గల కారణాన్ని నిర్ధారిస్తుంది

### కోదాడ, భువనగిరి, సూర్యాపేట, భద్రాచలం, ఖమ్మం, మిర్యాలగూడ, కొత్తగూడెం, నల్గొండ వద్ద

### 21, 22, 23 మరియు 24 ఫిబ్రవరి 2020

### రక్త పరీక్షల ద్వారా అలర్జీలను పరీక్షించవచ్చును, దీని వలన సకాలంలో అలర్జీలకు చికిత్స చేయడానికి అది తోడ్పడుతుంది.

అంజన్ పాత్ ల్యాబ్స్ మరియు అలర్జీ టెస్టింగ్ సెంటర్ యొక్క కలెక్షన్ సెంటర్లు **కోదాడ, భువనగిరి, సూర్యాపేట, భద్రాచలం, ఖమ్మం, మిర్యాలగూడ, కొత్తగూడెం, నల్గొండ**లో 50% కంటే అధికంగా డిస్కౌంట్‌తో రాయితీ ధరలలో అన్ని రకాల అలర్జీ (Allergy) (ఆహారం, చర్మం, ఇన్‌హలంట్, కాంప్రెహెన్సివ్-1, కాంప్రెహెన్సివ్-2)ల కోసం అలర్జీ టెస్ట్ నిర్వహిస్తున్నాయి. (అందులో 80-115 అలర్జెన్స్ ఉంటాయి). సదరు పరీక్షలు **ఫిబ్రవరి 21, 22, 23 మరియు 24న ఉ. 9 గం.ల నుంచి సా.5 గం.ల వరకు** నిర్వహించబడతాయి. ఈ టెస్ట్‌లు నాలుగు రోజులకు సగంకంటే తక్కువ ధర కలిగి ఉంటాయి. అలర్జీలు ఒక రకమైన వ్యాధి, త్వరితగతిన నిర్ధారిస్తే మాత్రమే స్పెషలైజ్డ్ డాక్టర్‌చే దానికి చికిత్స చేయబడును.

ఇంతకుముందు స్కిన్ ప్రిక్ టెస్ట్ చేయబడేది. రోగి ఏ రకమైన అలర్జీ (Allergy) నుంచి బాధపడుతున్నారో, ఏ అలర్జెన్ దానికి కారణమవుతోందో తెలుసుకోడానికి చేతిపై 98 చోట్ల చిన్న రంధ్రాలు చేయబడేవి. అయితే ఇప్పుడు ఒక రక్తపరీక్ష శాంపిల్ ద్వారా దానిని సులభంగా పరీక్షించవచ్చును. ఈ పరీక్ష ఫాడియా 250, యురోబ్లాట్‌వన్ వంటి ప్రత్యేకమైన యంత్రాల ద్వారా నిర్వహించబడుతోంది. అవి మా ల్యాబ్‌లో అందుబాటులో

**డా॥ టి. వాసుదేవ్ -** (Allergy) ఒక రుగ్మత, అయితే దానిని ప్రజలు రుగ్మతగా పరిగణించడంలేదు. ఒక వ్యక్తికి ఒకసారి అది సోకితే అది ఇబ్బందులకు కారణం కాగలదు. ఒక వ్యక్తికి కొన్ని సువాసనలు పడకపోతే, అతనికి పువ్వులంటే అలర్జీ అని భావించవచ్చును. ప్రజలు తమ పెంపుడు జంతువుల వలన కూడా అలర్జీకి గురి అవుతారు. ఒకసారి ఈ అలర్జీలను గుర్తించడం జరిగితే, అది ప్రభావవంతమైన చికిత్సకు దారితీయగలదు. వీటికి చికిత్స చేయవచ్చును, ముందు జాగ్రత్తలు కూడా తీసుకోవచ్చును.

**అలర్జీ చికిత్స కోసం రోగ నిర్ధారణ ఒకటే మార్గం.**

**డా॥ నాగుబండి అరవింద్ -** అలర్జీలు రాకుండా చూసుకోవాలి ఎందుకంటే ఒక వ్యక్తి దైనందిన జీవితంలో అనేక సమస్యలకు కారణం కాగలవు. అలర్జీలు సీజనల్. ఒక వ్యక్తి నిర్దిష్టమైన ఒక సీజనల్ అలర్జీ (Allergy) నుంచి బాధపడుతుంటే, అది బాధపెడుతుంది కనుక వెంటనే అతను / ఆమె డాక్టరును సంప్రదించవలెను. అలర్జీ వలన కలిగే వ్యాధులను వెంటనే నిర్ధారించుకోవాలి. అలా చేయడంవలన వాటికి చికిత్స చేసి, ముందు జాగ్రత్తలు తీసుకోవచ్చును. అలర్జీని నిర్ధారిస్తే రోగికి మంచి చికిత్స అందించడానికి డాక్టరుకు సులభతరం అవుతుంది.

### అలర్జీల చికిత్స

ఒకసారి నిర్ధారించిన అలర్జీలను నిర్దిష్ట ఆహార పదార్థాల నివారణ ద్వారా గాని లేదా మందుల సహాయంతో గాని చికిత్స చేయవచ్చును. ఔషధ ప్రయోగాలు యాంటీ-అలర్జెన్స్ కావచ్చును లేదా నిపుణులైన వైద్యులచే ఏర్పాటు చేసిన ఇమ్యునోథెరపీగా పిలువబడే ప్రత్యేక చికిత్స కావచ్చును. అవి అలర్జీలు పూర్తిగా నయమవటానికి సహాయం చేస్తాయి.

తెలంగాణ స్పెసిఫిక్ అలర్జీ ప్యానెల్ లభిస్తుంది

తెలంగాణ కాంప్రెహెన్సివ్ అలెర్జన్ ప్యానెల్.

తెలంగాణ కోసం అలెర్జన్ స్పెసిఫిక్స్ (ప్రచురించబడిన అధ్యయనాలు మరియు యధార్థ ఉదంతాల అనుభవాల ఆధారంగా)

### అలర్జీ అంటే ఏమిటి? మనం తెలుసుకుందాం

పురుషుడు లేదా స్త్రీకి, ప్రతీ వ్యక్తికి ఇతర పదార్థాల ద్వారా కలిగే ప్రేరణలను భరించేందుకు కొంత శక్తి ఉంటుంది. అయితే కొన్ని పదార్థాలు ఒక వ్యక్తి రోగ నిరోధకశక్తిపై అసాధారణ ప్రతిచర్యకు కారణం అవుతాయి. అవి అలర్జీ (Allergy)కి కారణం అవుతాయి.



**ఇంతకుముందు, స్కిన్ ప్రిక్ టెస్ట్ నిర్వహించబడేది అందులో రోగి ఏరకమైన అలర్జీ (Allergy) నుంచి బాధపడుతున్నారో ఏ అలర్జెన్లు అయితే దానికి కారణం అవుతున్నాయో తెలుసుకోడానికి చేతిపై 98 చోట్ల చిన్న రంధ్రాలు చేయబడేవి. అయితే ఇప్పుడు ఒక రక్తం నమూనా ద్వారా దానిని సులభంగా పరీక్షించవచ్చును.**

### టెస్టిమోనియల్స్



**పీటర్ జాన్ -** నేను గత ఎనిమిది సంవత్సరాలుగా **• ఊపిరి ఆడకపోవడం • ఊపిరి తగ్గిపోవడం • పిల్లికూతలు • విపరీతంగా దగ్గు రావడం • ముక్కు కారడం మరియు తుమ్మడం** వలన బాధపడుతున్నాను. నేను ప్రజలకు సిఫారసు చేసిన వివిధ చికిత్సలను ప్రయత్నించాను. అనేక మంది డాక్టర్లను సందర్శించాను. అయితే తాత్కాలికంగాను ఉపశమనం కలిగింది. అప్పుడు నా స్నేహితులలో ఒకరు మీ ల్యాబ్ గురించి మరియు మీరు చేసే అలర్జీ పరీక్ష గురించి నాకు తెలిపారు. అది నా జీవితాన్ని మార్చివేసింది. నా ఆరోగ్యాన్ని వాస్తవంగా మెరుగుపరిచిన సమాచారాన్నంతటినీ నాకు కల్పించిన మీకు నేను ధన్యవాదాలు తెలుపుతున్నాను.

పరీక్షలో పాజిటివ్‌గా కనబడిన ఆహార పదార్థాలను వినియోగించడం నేను మానివేశాను మరియు నాకు అలర్జీకి సంబంధించిన రియాక్షన్స్ వస్తాయని గతంలో నేను భావించిన కొన్ని ఆహార పదార్థాలను తిరిగి చేర్చుకున్నాను. ఈ రోజు నాకు ఎంతో ఆరోగ్యంగా ఉన్నట్లుగా భావిస్తున్నాను. మీ పరీక్షా విధానాన్ని నా స్నేహితులందరికీ, కుటుంబానికి మరియు తెలిసినవారందరికీ సిఫారసు చేస్తున్నాను. మీకు ధన్యవాదములు!



**రామకృష్ణ :** నేను అంజన్ ల్యాబ్స్ గురించి ఎంతో విన్నాను, అందువలన వారినుంచి నేను అలర్జీ పరీక్ష చేయించుకున్నాను. నాకు **• దురద • వాపు • చర్మంపై ముదురురంగు మచ్చలు • రసి కారడం • ఫిస్సర్స్ • ఎర్రబారడం • దద్దుర్లు** వంటి అలర్జీ సమస్యలు ఉన్నాయి. అయితే వాటి నుంచి పరీక్ష చేయించుకున్న తరువాత నాకు వేటి నుంచీ అలర్జీ వస్తోందో తెలుసుకున్నాను. ఇప్పుడు వాటిని తీసుకోవడం ఆపి వేశాను. ఇప్పుడు నాకెంతో బాగుంది. ఈ ప్రకటనల నుంచి నేను అలర్జీ పరీక్ష గురించి తెలుసుకున్నాను. అనేక సంవత్సరాలుగా అలర్జీ నుండి ఇప్పటికే బాధపడుతున్న అటువంటి రోగులకు ఇది ఒక మాధ్యమం.

అంజన్ పాత్ ల్యాబ్స్‌కు శుభాకాంక్షలు.

## సగం కంటే తక్కువ ధరలకు అలర్జీ పరీక్ష ఫిబ్రవరి 21 నుండి 24 మధ్య మాత్రమే లభిస్తుంది

### అలర్జీ లక్షణాలు (Symptoms of Allergy)

- Redness of skin (చర్మం ఎర్రబారడం)
- Rashes/Irritation of skin (చర్మంపై దద్దుర్లు/దురద)
- Acne on skin (చర్మంపైన మొటిమలు)
- Swelling of the face, lips (ముఖం, పెదవులు వాపు)
- Stomach ache (కడుపు నొప్పి)
- Diarrhoea (డయేరియా)
- Sour throat, coughing (గొంతు వాపు, దగ్గు)
- Eczema (ఎగ్జిమా)
- Difficulty in breathing (శ్వాసపీల్చుటలో ఇబ్బంది)
- Urticaria (ఉబ్బిన దద్దుర్లు)
- Allergic rhinitis (Sneezing) (అలర్జిక్ రైనైటిస్ (తుమ్ములు))



### అలర్జీ కొరకు మీ అంతట మీరు చికిత్స చేయించుకోండి మరియు

## ఉచిత విటమిన్ 'బి12' మరియు విటమిన్ 'డి' టెస్ట్ పొందండి

**జెరత్ పాత్ ల్యాబ్స్ & అలర్జీ టెస్టింగ్ సెంటర్, భారతదేశంలో అలర్జీ టెస్టింగ్ కోసం మొదట NABL గుర్తింపుపొందిన ల్యాబ్‌లలో ఒకటి. జెరత్ పాత్ ల్యాబ్స్‌లలో అంజన్ పాత్ ల్యాబ్ ఒక సహ-కంపెనీ. ఉత్తర మరియు పశ్చిమ భారతదేశంలోని 14 రాష్ట్రాలలో JPL ఉంది మరియు APL ద్వారా దక్షిణ భారతదేశ ప్రాంతాలు అనగా తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో ఇది ప్రవేశించింది.**

**ECHS/ESI/CGHS కార్డు హోల్డర్లకు అదనపు డిస్కౌంట్**

### అలర్జీ (Allergy)కి గల కారణాలు

మన నిత్యజీవితంలో మనచుట్టుప్రక్కల ఉన్న అనేక అంశాలు అలర్జీలకు కారణమవుతాయి.

**వాయుజనిత అలర్జీలు,** పుప్పొడి, జంతువుల ధూళి తవుటి పురుగుల దుమ్ము మరియు బూజు వంటివి.

**కొన్ని రకాల ఆహారాలు,** ముఖ్యంగా బఠాణీలు, చెట్లగింజలు, గోధుమ, సాయ్, చేప, షెల్ ఫిష్, గుడ్లు మరియు పాలు

తేనెటీగ లేదా కందిరీగ వంటి **కీటకాలు కుట్టడం**

**మీరు తాకేటువంటి లేటెక్స్ లేదా ఇతర పదార్థాలు** అలర్జిక్ చర్మ ప్రతి చర్యలకు కారణం అవుతాయి.

**ఒక రక్త నమూనా వలన ఎటువంటి అలర్జీని అయినా కనుగొనవచ్చును. దానిని కొన్ని రోగనిరోధక-బూస్టర్స్, యాంటీ-అలర్జిక్ మందులతో మరియు ఇమ్యునో-థెరపీ ద్వారా కూడా చికిత్స చేయవచ్చును.**

ఆస్తమా రోగ చరిత్రగల, శ్వాస పీల్చుకొనుట, దగ్గు మరియు పిల్లికూతల (Wheezing) దగ్గుతో బాధపడుతున్న 12 ఏళ్ళ బాలికను ఒక ఉదాహరణగా తీసుకుందాం. ఆమె శ్వాసక్రియ రోగ లక్షణాలకు స్పష్టమైన కారణం లేదని రిపోర్టుల ద్వారా తెలిసింది. ఆమె ఆస్తమా చికిత్సకోసం ఒక ఫిజీషియన్‌ను సంప్రదించింది. మంచి మందులు ఇచ్చినప్పటికీ ఆమెకు స్వస్థత చేకూరలేదని ఆమె వైద్య చరిత్ర వలన తెలుస్తోంది. బఠాణీలు, శెనగగింజలు, కాయధాన్యాలు తినడంవలన శ్వాసలో ఇబ్బంది, దురద వంటి అనారోగ్యాలకు గురి అయ్యే చరిత్ర ఉంది. గతంలో ఆమెకు వచ్చే పిల్లికూతల దగ్గు సీజనల్‌గా వచ్చేది. అది పుప్పొడి, గడ్డికి సంబంధమైనదిగా ఉండేది. ఆమెకు బ్లడ్ అలర్జీ టెస్ట్ ఉపయోగిస్తూ రోగ నిర్ధారణ జరిగింది. ఇమ్యునో-థెరపీ ద్వారా, కొన్ని యాంటి-అలర్జిక్ మందులద్వారా చికిత్స చేయబడింది. ఆ తర్వాత ఆమెకు స్వస్థత చేకూరింది. ఎవరికైనా శ్వాసపీల్చుకోవడం వలన సమస్యలు ఎదురైతే అప్పుడు అతనికి/ఆమెకు అలర్జీ టెస్ట్ చేయించాలి. ఒకసారి అలర్జీ (Allergy) ఉందని గుర్తించబడితే సగం సమస్య పరిష్కారమైనట్లే. ప్రత్యేక నిపుణుల డాక్టర్ల ప్యానల్ సహకారంతో సరైన చర్య తీసుకోడానికి, తగిన మందులతో అలర్జీకి చికిత్సచేయడానికి ఇది తోడ్పడుతుంది. **యూరోబ్లాట్ అండ్ ఫాడియా ఉపయోగిస్తూ అటువంటి అలర్జీల నిర్ధారణకుగాను మా ప్రఖ్యాత డాక్టర్ల ప్యానల్‌కు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వబడింది.**

EUROBlotOne



PHADIA 250





**ప్రపంచ ప్రఖ్యాత మోడర్న్ మెషీన్స్ ద్వారా పరీక్షించబడినది.**

పరీక్ష కోసం మమ్మల్ని సంప్రదించండి

**Aanjan Path Labs** & ALLERGY TESTING CENTRE

CORPORATE OFFICE : Plot No. - 29A ARK Colony (Anantha Ramakrishna Iyyer Colony) Eldams road, Teynampet Chennai.

| KODADA | BHUVANAGIRI | SURYAPET | NALGONDA |
|---|---|---|---|
| 8008005442<br>DEVI DIAGNOSTIC AND SCAN CENTER, Beside Ranga Theatre, Huzur Nagar Road | 9666450510, 9666447086<br>Royal Diagnostic Centre, #3-4-25/3, #3-4-25/3, Thota Laxmi, Narayana Complex Near Area Hospital, BHONGIR, YADIDIRI | 9989233032, 9949432616<br>Vijaya Diagnostic Centre, M.G. Road | 7799221618, 9441695389, 08682230089<br>Pravalika Multi Speciality Hospital, #4-10-175, BESIDE MORE MARKET, DVK,ROAD |

| BHADRACHALAM | KHAMMAM | MIRYALAGUDA | KOTHAGUDEM |
|---|---|---|---|
| 8886779988<br>Sri Adithya Diagnostic Centre, Opp. Opp. Area Hospital, Bhadrachalam,BHADHADRI | 8742224570, 8309452812, 9963095895, 8367226695, 9951669899<br>SRI DIVYA DIAGNOSTIC CENTRE, 8-1-162, Near Bus Stand, Municipal Office Road | 9603183198<br>Teja Diagnostic Centre, Opp. Bus Stand Lane, New Doravari Complex | 8744246338, 8008723058<br>Medicare Diagnostics, M.G. Road, |

**HELPLINE : 63838-73278, 63838-48063, 95000-53404**

Member of Advertising Standards Council of India (Responsible Advertising)

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
19-2-2020

*ఏప్రిల్ 2, 2011... భారత క్రికెట్ అభిమానులందరి గుండె ఆనందంతో ఉప్పొంగిన రోజు... 28 ఏళ్ల తర్వాత టీమిండియా వన్డే ప్రపంచ కప్‌ను గెలుచుకొని చరిత్ర సృష్టించింది. నాడు విజేతగా నిలిచిన ఆ జట్టులో ఒక వ్యక్తి మాత్రం నిస్సందేహంగా అందరికంటే ఎక్కువగా భావోద్వేగానికి లోనయ్యాడు. వరుసగా ఐదు ప్రపంచకప్‌లలో పాల్గొన్నా విజయం అందని ద్రాక్షగా మారిపోయిన వేళ ఆరో ప్రయత్నంలో జగజ్జేత జట్టులో భాగమైన ఆ వ్యక్తి సచిన్ టెండూల్కర్. తమకు పెద్దన్నయ్యలాంటి సచిన్‌ను భారత జట్టు సభ్యులందరూ తమ భుజాలపై మోసి మైదానంలో కలియతిరిగారు. ఇప్పుడు అదే ఘట్టానికి ప్రతిష్టాత్మక 'లారియస్' పురస్కారం దక్కింది.*

# సచిన్‌ను సగర్వంగా భుజాలపై...

- 'లారియస్ బెస్ట్ స్పోర్టింగ్ మూమెంట్' అవార్డు సొంతం
- అత్యుత్తమ క్షణంగా 'క్యారీడ్ ఆన్ ద షోల్డర్స్ ఆఫ్ ఎ నేషన్'
- 2011 ప్రపంచ కప్ ఫైనల్ తర్వాతి సంబరాలకు పురస్కారం
- స్వయంగా అవార్డు అందుకున్న సచిన్ టెండూల్కర్



**బెర్లిన్:** 'సచిన్ టెండూల్కర్ ఇరవై ఏళ్ల పాటు భారత క్రికెట్‌ను తన భుజాలపై మోశాడు. ఇప్పుడు అతడిని మా భుజాలపై మోయడానికి మాకు ఇదే సరైన సమయం'... 2011 వరల్డ్ కప్ ఫైనల్లో విజయం అనంతరం విరాట్ కోహ్లి చేసిన వ్యాఖ్య ఇది. నాడు వాంఖడే స్టేడియంలో ఉన్న ప్రేక్షకులే కాదు భారత జాతి మొత్తం ఆ క్షణాన్ని సగర్వంగా ఆస్వాదించింది. ఇప్పుడు అదే సంబరాలకు ప్రఖ్యాత క్రీడా పురస్కారం లభించింది. 'లారియస్' అవార్డుల్లో గత 20 ఏళ్లలో అత్యుత్తమ క్రీడా ఘట్టంగా 'స్పోర్టింగ్ మూమెంట్' అవార్డు లభించింది. భారత కాలమానం ప్రకారం సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ వా, మాజీ టెన్నిస్ స్టార్ బోరిస్ బెకర్ చేతుల మీదుగా స్వయంగా సచిన్ టెండూల్కర్ ఈ అవార్డును అందుకున్నాడు. రెండు దశాబ్దాల 'లారియస్ క్రీడా పురస్కారాల చరిత్ర'లో భారత్ లేదా భారత క్రీడాకారుడు ఒక అవార్డును గెలుచుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం.

## ప్రపంచ వ్యాప్తంగా ఓటింగ్‌తో...

గత ఇరవై ఏళ్లలో (2000–2020) ఇరవై అత్యుత్తమ క్రీడా ఘట్టాలను 'లారియస్' ముందుగా ఎంపిక చేసింది. మూడు రౌండ్ల ద్వారా విజేతను తేల్చారు. జనవరి 10 నుంచి ఫిబ్రవరి 16 మధ్య ప్రపంచ వ్యాప్తంగా అభిమానులకు దీనికి ఓటింగ్ చేసే అవకాశం కల్పించగా... జాబితాను ముందుగా టాప్–10కు, ఆ తర్వాత టాప్–5కు కుదించి చివరకు అత్యుత్తమ క్షణాన్ని ప్రకటించారు. ఫైనల్ రౌండ్‌లో మిగిలిన నాలుగు నామినేషన్లను వెనక్కి నెట్టిన 'క్యారీడ్ ఆన్ ద షోల్డర్స్ ఆఫ్ ఎ నేషన్'కు అవార్డు దక్కింది. ఈ అవార్డుకు సాధారణ మ్యాచ్‌ల ఫలితాలు, స్కోర్లు తదితర అంశాలతో సంబంధం లేకుండా ఎక్కువగా భావోద్వేగాలకు సంబంధించిన ఘట్టాలనే ఎంపిక చేసి నామినేట్ చేశారు.


సచిన్‌కు అవార్డు అందజేస్తున్న స్టీవ్ వా

## లారియస్ ఇతర అవార్డుల విజేతల వివరాలు

- **స్పోర్ట్స్‌మన్ ఆఫ్ ద ఇయర్:** లూయిస్ హామిల్టన్ (ఫార్ములావన్–బ్రిటన్), లయోనల్ మెస్సీ (ఫుట్‌బాల్–అర్జెంటీనా)
- **స్పోర్ట్స్ ఉమన్ ఆఫ్ ద ఇయర్:** సిమోన్ బైల్స్ (జిమ్నాస్టిక్స్–అమెరికా)
- **వరల్డ్ టీమ్ ఆఫ్ ద ఇయర్:** దక్షిణాఫ్రికా రగ్బీ జట్టు
- **వరల్డ్ బ్రేక్ త్రూ ఆఫ్ ద ఇయర్:** ఎగాన్ బెర్నాల్ (సైక్లింగ్–కొలంబియా)
- **వరల్డ్ కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్:** సోఫియా ఫ్లోర్‌ష్ (రేసింగ్–జర్మనీ)
- **స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ విత్ డిస్‌ఎబిలిటీ:** ఒక్సానా మాస్టర్స్ (పారా రోయింగ్–అమెరికా)
- **యాక్షన్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ద ఇయర్:** కోయి కిమ్ (స్నో బోర్డింగ్–అమెరికా)
- **స్పోర్ట్ ఫర్ గుడ్:** సౌత్ బ్రాంక్స్ యునైటెడ్ **లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్:** డర్క్ నొవిట్జీ (బాస్కెట్‌బాల్–జర్మనీ)
- **అకాడమీ ఎక్సెప్షనల్ అచీవ్‌మెంట్:** స్పానిష్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్



> *ప్రపంచ కప్ గెలిచిన అనుభూతి అద్భుతం. దానిని మాటల్లో వర్ణించలేను. రెండో మాటకు తావు లేకుండా అందరూ ఒక తరహా భావనతో ఉండే ఘట్టాలు చాలా అరుదు. దేశం మొత్తం ఒకేసారి సంబరాలు చేసుకోవడం అలాంటిదే. క్రీడలు ఎంత గొప్పవో, అవి మన జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేస్తాయో ఇది చూపిస్తుంది. ఇప్పుడు కూడా ఆ క్షణాలను చూస్తూ నేను తన్మయత్వానికి లోనవుతాను. 1983లో భారత జట్టు తొలిసారి ప్రపంచకప్ గెలిచినప్పుడు పదేళ్ల వయసులో నా క్రికెట్ ప్రస్థానం మొదలైంది. ఆ గెలుపు ప్రత్యేకత ఏమిటో నాకు అప్పుడు తెలీదు. అందరూ సంబరాలు చేసుకుంటున్నారు కాబట్టి నేనూ భాగమయ్యాను. అయితే దీనికి ఏదో విశేషం ఉందని, నేను కూడా అలాంటి అనుభూతిని పొందాలని మాత్రం అనిపించింది. 22 ఏళ్లు వేచి చూసిన తర్వాత ట్రోఫీని అందుకోవడం నేనెప్పటికీ గర్వపడే క్షణం. నా దేశ ప్రజల తరఫున ఆ ట్రోఫీని పట్టుకున్నట్లు భావించాను. నాపై నెల్సన్ మండేలా ప్రభావం ఉంది. ఆయన పడిన కష్టాలు నాయకుడిగా ఎదగడంలో అడ్డు రాలేదు. మండేలా చెప్పిన ఎన్నో గొప్ప మాటల్లో క్రీడలకు ప్రతీ ఒక్కరినీ కలిపే శక్తి ఉందని చెప్పిన మాట నాకు ఎంతో ఇష్టం. ఈ రోజు ఎంతో మంది గొప్ప అథ్లెట్లతో కలిసి కూర్చున్నాను. ఎన్ని సమస్యలు ఉన్నా అన్నీ అధిగమించి విజయాలు సాధించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచినవారందరికీ నా కృతజ్ఞతలు. ఈ ట్రోఫీ నా ఒక్కడిదే కాదు, మన అందరిదీ కూడా.*
>
> *–పురస్కారం స్వీకరించిన అనంతరం సచిన్ ప్రసంగం*

## అవార్డు గెలుచుకోకపోయినా 'సచిన్ క్షణం'తో పోటీ పడిన మిగిలిన నాలుగు నామినేషన్లను చూస్తే...



**ద**క్షిణాఫ్రికాకు చెందిన స్విమ్మర్ నటాలీ డు టొయిట్ 14 ఏళ్ల వయసులో కామన్వెల్త్ గేమ్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించింది. 2001లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె ఒక కాలు పోగొట్టుకుంది. అయితే పట్టుదలగా పోరాడిన నటాలీ 2008 బీజింగ్ ఒలింపిక్స్‌కు ఓపెన్ విభాగంలో (వికలాంగుల పారాలింపిక్స్‌లో కాకుండా) అర్హత పొందింది. ఈ ఘనత సాధించిన తొలి మహిళా క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది.



**ఏ**డుసార్లు ఫార్ములావన్ చాంపియన్‌గా నిలిచిన విఖ్యాత రేసర్ మైకేల్ షుమాకర్ బాటలోనే అతని కొడుకు మిక్ కూడా రేసింగ్‌లోకి అడుగు పెట్టాడు. 2004లో జర్మన్ గ్రాండ్‌ప్రిలో షుమాకర్ విజేతగా నిలబడిన హాకెన్‌హీమ్ వేదిక వద్దే 15 ఏళ్ల తర్వాత నాటి కారులోనే మిక్ రేసింగ్ చేయడం ఎఫ్1 అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది.



2016 కోపా సుడ్ అమెరికానా ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్స్‌లో పాల్గొనేందుకు వెళుతున్న సమయంలో 'కాపికోన్స్' టీమ్ ప్రయాణిస్తున్న విమానం కుప్పకూలింది. 77 మందిలో 71 మంది చనిపోగా... మిగిలిన ఆరుగురిలో ముగ్గురు ఆ జట్టు ఆటగాళ్లు ఉన్నారు. ఆ తర్వాత 50 వేల మంది పాల్గొన్న స్మారక సభలో ప్రత్యర్థి జట్టు అట్లెటికో నకోనియల్ టైటిల్‌ను 'కాపికోన్స్'కు అందజేస్తున్నట్లు ప్రకటించింది. కొన్నాళ్లకు జరిగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఆ ముగ్గురు ఆటగాళ్లు ఫాల్‌మన్, రషెల్, నెటో కన్నీళ్లపర్యంతమవుతూ పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ ప్రేమికులను ఆ ఘటన కలచివేసింది.



**చై**నాకు చెందిన జియా బోయు 1975లో తొలిసారి ఎవరెస్ట్ శిఖరం ఎక్కే క్రమంలో విఫలమయ్యాడు. 20 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రయత్నించాలని భావిస్తే క్యాన్సర్ కారణంగా అతని రెండు కాళ్లు తొలగించాల్సి వచ్చింది. ఆ తర్వాత మరిన్ని సార్లు ప్రయత్నించినా అది సాధ్యం కాలేదు. అయితే 2018లో ఎట్టకేలకు 69 ఏళ్ల వయసులో బోయు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాడు. రెండు కాళ్లు కోల్పోయిన తర్వాత కూడా ఎవరెస్ట్‌ను ఎక్కిన రెండో వ్యక్తిగా గుర్తింపు పొందాడు.



చాంపియన్ హంపికి విన్నర్స్ ట్రోఫీ, 45 వేల డాలర్ల చెక్ అందజేస్తున్న నిర్వాహకులు

# హంపికి సీఎం జగన్ అభినందనలు

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ప్రతిష్టాత్మక కెయిన్స్ కప్ టైటిల్ గెల్చుకున్నందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం అభినందనలు తెలిపారు. అమెరికాలోని సెయింట్ లూసియాలో జరిగిన ఈ టోర్నీలో ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతో చివరి గేమ్‌ను 'డ్రా' చేసుకొని హంపి టైటిల్‌ను ఖాయం చేసుకుంది. కొత్త ఏడాదిని గొప్ప విజయంతో మొదలుపెట్టిన కోనేరు హంపి రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

# సానియా-గార్సియా జోడీ శుభారంభం



**దుబాయ్:** కాలి పిక్క గాయం నుంచి తేరుకున్న భారత మహిళా టెన్నిస్ స్టార్ సానియా మీర్జా దుబాయ్ ఓపెన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా మీర్జా (భారత్)–కరోలినా గార్సియా (ఫ్రాన్స్) ద్వయం 6–4, 4–6, 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో అలా కుద్రయెత్సెవా (రష్యా)–కాటరీనా స్రెబోత్నిక్ (స్లొవేనియా) జంటను ఓడించింది. 78 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా జంట ఐదు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాయ్‌సాయ్ జెంగ్ (చైనా)–బార్బరా క్రెజిసికోవా (చెక్ రిపబ్లిక్) జోడీతో సానియా–గార్సియా జంట ఆడుతుంది.

# సునీల్ 'పసిడి' పట్టు

- ఆసియా రెజ్లింగ్ గ్రీకో రోమన్ విభాగంలో స్వర్ణం
- 27 ఏళ్ల తర్వాత ఈ ఘనత సాధించిన భారత రెజ్లర్


సునీల్


అర్జున్

**న్యూఢిల్లీ:** సుదీర్ఘ విరామానికి తెరపడింది. 27 ఏళ్ల తర్వాత ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ గ్రీకో రోమన్ శైలిలో భారత్‌కు మళ్లీ స్వర్ణం లభించింది. మంగళవారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో తొలి రోజు గ్రీకో రోమన్ శైలిలో భారత్‌కు ఒక స్వర్ణం, ఒక కాంస్యం లభించాయి. పురుషుల 87 కేజీల విభాగంలో సునీల్ కుమార్ పసిడి పతకం నెగ్గగా... 55 కేజీల విభాగంలో అర్జున్ హలకుర్కి కాంస్యం సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో సునీల్ 5–0తో అజత్ సలిదినోవ్ (కిర్గిస్తాన్)పై గెలిచాడు. తద్వారా పప్పూ యాదవ్ (1993లో; 48 కేజీలు) తర్వాత ఆసియా రెజ్లింగ్ పోటీల్లో గ్రీకో రోమన్ శైలిలో భారత్‌కు స్వర్ణాన్ని అందించిన రెజ్లర్‌గా సునీల్ గుర్తింపు పొందాడు. సెమీఫైనల్లో సునీల్ 12–8తో అజామత్ కుస్తుబయేవ్ (కజకిస్తాన్)పై, క్వార్టర్ ఫైనల్లో 8–2తో తకహిరో సురుడా (జపాన్)పై నెగ్గాడు. మరోవైపు 55 కేజీల విభాగం కాంస్య పతక పోరులో కర్ణాటక రెజ్లర్ అర్జున్ 7–4తో డాంగ్‌హైక్ వన్ (దక్షిణ కొరియా)పై నెగ్గాడు. ఇతర విభాగాల్లో సచిన్ రాణా (63 కేజీలు), సజన్ భన్వాల్ (77 కేజీలు) విఫలమయ్యారు. 130 కేజీల విభాగం కాంస్య పతక పోరులో మెహర్ సింగ్ (భారత్) 2–3తో రోమన్ కిమ్ (కిర్గిస్తాన్) చేతిలో ఓడిపోయాడు.

# ప్రణవ్–కృష్ణ ప్రసాద్ జంట పరాజయం


ప్రణవ్ చోప్రా

**బార్సిలోనా (స్పెయిన్):** బార్సిలోనా స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల డబుల్స్ విభాగంలో ప్రణవ్ చోప్రా–గారగ కృష్ణ ప్రసాద్ (భారత్) జంట తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూసింది. మంగళవారం జరిగిన మొదటి రౌండ్ మ్యాచ్‌లో ప్రణవ్–కృష్ణ ప్రసాద్ ద్వయం 21–19, 16–21, 7–21తో బెన్ లేన్–సీన్ వెండీ (ఇంగ్లండ్) జోడీ చేతిలో పరాజయం పాలైంది. నేడు జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో డారెన్ లియు (మలేసియా)తో హెచ్‌ఎస్ ప్రణయ్; వైగోర్ కోల్హో (బ్రెజిల్)తో పారుపల్లి కశ్యప్; క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్)తో అజయ్ జయరామ్; శుభాంకర్ డేతో కిడాంబి శ్రీకాంత్; లుకాస్ క్లియర్‌బౌట్ (ఫ్రాన్స్)తో సమీర్ వర్మ తలపడతారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వైవోని లీ (జర్మనీ)తో సైనా నెహ్వాల్ ఆడుతుంది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో మథియాస్ క్రిస్టియాన్సెన్–అలెగ్జాండ్రా బోయె (డెన్మార్క్) జోడీని సిక్కి రెడ్డి–ప్రణవ్ చోప్రా జంట 'ఢీ'కొంటుంది.

# భారత్‌ను గెలిపించిన పూనమ్

**ప్రాక్టీస్ పోరులో 2 పరుగులతో విండీస్‌పై విజయం**



**బ్రిస్బేన్:** టి20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 2 పరుగుల తేడాతో మాజీ చాంపియన్ వెస్టిండీస్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. శిఖా పాండే (16 బంతుల్లో 24 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా, దీప్తి శర్మ (21) మోస్తరు స్కోరు సాధించింది. అనంతరం విండీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 105 పరుగులే చేయగలిగింది. లీ ఆన్ కిర్బీ (41 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), హేలీ మాథ్యూస్ (25) రాణించారు. పూనమ్ యాదవ్ 20 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టింది. మ్యాచ్ చివరి ఓవర్లోనే పూనమ్ 2 వికెట్లు తీసి భారత్‌ను గెలిపించింది.

# కోహ్లి వికెట్ తీస్తేనే మజా: బౌల్ట్



**వెల్లింగ్టన్:** న్యూజిలాండ్ పేసర్ ట్రెంట్ బౌల్ట్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకోవాలని చూస్తున్నాడు. ఈనెల 21న మొదలయ్యే తొలి టెస్టులో నంబర్‌వన్ బ్యాట్స్‌మన్ విరాట్ కోహ్లి వికెట్ తీస్తేనే అసలైన మజా ఉంటుందని చెప్పాడు. ఆస్ట్రేలియాతో జరిగిన 'బాక్సింగ్ డే' టెస్టులో బౌల్ట్ కుడి చేతికి గాయమైంది. దీంతో అతను ఆరు వారాల పాటు ఆటకు దూరమయ్యాడు. భారత్‌తో జరిగిన పరిమిత ఓవర్ల సిరీస్‌లలో పాల్గొనలేకపోయాడు. ఇప్పుడు సంప్రదాయ క్రికెట్‌తో మళ్లీ తాజాగా బరిలోకి దిగబోతున్న బౌల్ట్ మీడియాతో మాట్లాడుతూ... 'కోహ్లి అసాధారణ బ్యాట్స్‌మన్. తన గురించి కొత్తగా చెప్పడానికి ఏమీ లేదు. అతనెంతటి గొప్ప ఆటగాడో అందరికీ తెలుసు. అలాంటి మేటి బ్యాట్స్‌మన్‌ని అవుట్ చేయడం ద్వారా నా సత్తాను నేనే పరీక్షించుకుంటాను. అందుకే మ్యాచ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాను' అని అన్నాడు. ఐదు రోజుల ఆట కోసం బాగా సన్నద్ధమయ్యానని చెప్పాడు. వెల్లింగ్టన్‌లో ఆడటం తనకెంతో ఇష్టమని అన్నాడు. భారత్ చేతిలో సొంతగడ్డపై టి20ల్లో క్లీన్ స్వీప్ (0–5) కావడం బాధించిందని... అయితే తమ జట్టు వన్డే సిరీస్‌ను వైట్‌వాష్ చేయడం ద్వారా ప్రతీకారం తీర్చుకుందని చెప్పాడు. 65 టెస్టులాడిన ఈ లెఫ్టార్మ్ పేసర్ 256 వికెట్లు తీశాడు.



సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+12 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 329
బుధవారం 19-2-2020
SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'




## మళ్లీ పేలనున్న సెల్ బాంబ్!

- ఏడాదిలో మొబైల్ బిల్లు డబుల్!
- రూ.300కు చేరనున్న ఏఆర్‌పీయూ.. అప్పుడే కంపెనీలకు దండిగా లాభాలు
- బకాయిలు కట్టేందుకు తప్పని చార్జీల పెంపు

-బిజినెస్‌లో

● 80% పక్షి జాతుల తగ్గుదల

### పిట్ట 'కొంచెమే'!

ఏడాదికి వివిధ రకాల సాధారణ పక్షుల్లో 80 శాతం వరకు తగ్గిపోతున్నాయని, గత 25 ఏళ్లలో దేశంలోని ఐదో వంతుకుపైగా పక్షి జాతుల సంఖ్య తగ్గిపోయిందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్–2020 పేరిట వివిధ సంస్థలు రూపొందించిన నివేదికలో ఈ ఆందోళనకర అంశాలు వెల్లడయ్యాయి.



- 12లో

● చైనాలో తగ్గని వైరస్...

### కోవిడ్‌కు వైద్యుడు బలి

కోవిడ్ తీవ్రత ఎక్కువగా ఉన్న వుహాన్ నగరంలో మరో వైద్యుడు చనిపోయారు. వుహాన్ వుచాంగ్ ఆస్పత్రి హెడ్, న్యూరో సర్జన్ డాక్టర్ లియు ఝిమింగ్ ఈ వైరస్ కారణంగానే మృతి చెందారని అధికార మీడియా ధ్రువీకరించింది. మంగళవారం నాటికి ఈ వైరస్‌తో మృతి చెందిన వారి సంఖ్య 1,868కు చేరింది.



- 9లో

● మహిళా సాధికారత..

### రెడీ టు కమాండ్

మగపిల్లల్ని గొప్ప యోధులుగా తీర్చిదిద్దిన తల్లులే కాదు, గొప్ప యోధులై.. దేశమాతను కాపాడుకున్న ఆడబిడ్డలూ మన దేశ చరిత్రలో ఎందరో ఉన్నారు. రాణీ లక్ష్మీబాయి, రాణీ పద్మిని, రజియా సుల్తానా వంటివారు ఎన్ని యుగాలకైనా ధ్వని తీవ్రత క్షీణించని శంఖారావాలు.



- ఫ్యామిలీలో

● రికార్డుల మోత

### కంబళలో మరో బోల్ట్

బురద మడిలో దున్నపోతులను పరిగెత్తించే కర్ణాటక తీరప్రాంత సంప్రదాయ కంబళ పోటీల్లో సరికొత్త పరుగుల వీరులు వెలుగుచూస్తున్నారు. ఇటీవల ఉసేన్ బోల్ట్ కంటే వేగంగా పరిగెత్తాడని పేరు పొందిన శ్రీనివాస గౌడ రికార్డు మరిచిపోకముందే నిశాంత్ శెట్టి ఆ రికార్డును బద్దలు కొట్టాడు.



- 9లో

## పీఆర్సీ గడువు పొడిగింపు

- డిసెంబర్ 31 వరకు పొడిగించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ.. వేతన సవరణకు మరో ఏడాది ఆగాల్సిందే
- ముందే చెప్పిన 'సాక్షి'

**సాక్షి, హైదరాబాద్:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు ఎదురుచూస్తున్న పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) గడువును ప్రభుత్వం పొడిగించింది. డిసెంబర్ 31 వరకు పీఆర్సీ గడువు పొడిగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు (447) జారీ చేశారు. ఆర్థిక శాఖ సమ్మతితో ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. దీంతో రాష్ట్రంలోని 2.62 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు, 2.67 లక్షల మంది పెన్షనర్లు పీఆర్సీ అమలు కోసం వచ్చే ఏడాది వరకు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగుల వేతన సవరణే కాకుండా రాష్ట్ర కార్యాలయాలు, జిల్లా కార్యాలయాల్లో వర్క్‌లోడ్, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు, అవసరమైన స్టాఫ్ ప్యాటర్న్, ఉద్యోగులకు సంబంధించిన సర్వీసు రూల్స్ తదితర అంశాలను తేల్చే బాధ్యతలను ప్రభుత్వం పీఆర్సీకి అప్పగించిన సంగతి తెలిసిందే. వాటిని పూర్తి చేసేందుకు మరింతగా సమయం అవసరం కావడంతో గడువును పొడిగించాలని పీఆర్సీ గత నెల 28న

మిగతా 2వ పేజీలో ▶



## పట్టణ ప్రగతి దళితవాడల నుంచే

### ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ సదస్సులో ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టీకరణ
- 24 నుంచి మార్చి 4 వరకు పట్టణ ప్రగతికి ఆదేశం
- 3 నెలల్లో పట్టణాలు, నగరాల్లో టాయిలెట్లు నిర్మించాలి
- 8 నెలల్లోగా విద్యుత్ సంబంధ సమస్యలు తీర్చాలి
- లేదంటే ఎమ్మెల్యేలు, మేయర్లు, చైర్‌పర్సన్లు, కమిషనర్లు పదవుల నుంచి తప్పుకోవాలి
- పట్టణాలకు ప్రతి నెలా రూ. 148 కోట్ల నిధులు
- ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

> ఐదు కోట్ల మందిలో 140 మందికే మేయర్లు, చైర్‌పర్సన్లు అయ్యే అవకాశం వచ్చింది. దీన్ని ఒక ముందడుగుగా స్వీకరించి సానుకూలంగా మార్చుకోగలిగితే ప్రజాజీవితంలో ఎంత ముందుకైనా పోవచ్చు. ప్రజలు నన్ను రెండు సార్లు సీఎంను చేశారు. నా వరకైతే గెలిచేంత వరకే రాజకీయం. ఆ తర్వాత కాదు. ప్రభుత్వ పథకాల అమలు తీరు చూస్తే అది అర్థం అవుతుంది. ఒక్కసారి నాయకుడి మీద విశ్వాసం కలిగితే ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తారు. సంకల్పం గట్టిగా ఉంటే 100శాతం విజయం సాధిస్తారు.

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 24 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు 'పట్టణ ప్రగతి'కార్యక్రమాన్ని.. 'పల్లె ప్రగతి'పునాదిగా పేదలు ఎక్కువగా నివసించే దళితవాడల నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. మూడు నెలల్లో అన్ని పట్టణాలు, నగరాల్లో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం, ఎనిమిది నెలల్లో విద్యుత్ సమస్యలకు పరిష్కారం చూపని ఎమ్మెల్యేలు, మేయర్లు, చైర్‌పర్సన్లు, కమిషనర్లు బాధ్యత వహించి పదవుల నుంచి తప్పుకోవాల్సి ఉంటుందని తేల్చిచెప్పారు. పట్టణ ప్రగతి నిర్వహణపై ప్రగతి భవన్‌లో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ సదస్సులో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. శాసనసభ్యులు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పట్టణ ప్రగతిని నిర్వహించాల్సిన తీరుపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీలు, మైనారిటీలు ఎక్కువగా ఉండే నివాస ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతోపాటు వార్డులవారీగా పట్టణ ప్రగతి ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. నిధుల వినియోగంలో క్రమశిక్షణ పాటించి ప్రణాళికకు అనుగుణంగా ఖర్చు చేయాలన్నారు. పల్లె ప్రగతి సమీక్షలో భాగంగా గ్రామ పర్యటనలపై మండల పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు తమ

మిగతా 2వ పేజీలో ▶

## కణాధారిత చికిత్సలదే భవిష్యత్తు!



- రోగ నిరోధక వ్యవస్థతోనే చికిత్స.. కేన్సర్‌కు విరుగుడుగా టి–కణాలు
- కరోనా వైరస్‌కూ చెక్!
- జినోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డు గ్రహీత డా.కార్ల్ జూన్ వెల్లడి
- బయో ఆసియా సదస్సులో 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూ

**సాక్షి, హైదరాబాద్:** మనిషికి వచ్చే అనేక రకాల వ్యాధులను మందులతో కాకుండా.. శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ సాయంతోనే చికిత్స చేసే కాలం దగ్గర్లోనే ఉందంటున్నారు డాక్టర్ కార్ల్ జూన్. అత్యాధునిక కేన్సర్ చికిత్స ఇమ్యూనో థెరపీకి ఆద్యుడు.. రోగ నిరోధక వ్యవస్థలోని టి–కణాలను కేన్సర్‌పై పోరాటానికి సిద్ధం చేసిన వ్యక్తి కార్ల్ జూన్.. హైదరాబాద్‌లో జరుగుతున్న బ యో ఆసియా సదస్సుకు హాజరయ్యారు. బయో ఆసియా అందించే జినోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డును అందుకున్న ఆయనను 'సాక్షి'మంగళవారం పలకరించింది. కార్–టి కణచికిత్స ఆలోచనకు దారి తీసిన పరిస్థితులు, పురోగతి.. తాజా పరిశోధనలపై ఆయనతో జరిగిన సంభాషణ ఇలా ఉంది.

**ప్రశ్న: రోగ నిరోధక వ్యవస్థ కణాలనే కేన్సర్‌కు వ్యతిరేకంగా వాడొచ్చన్న ఆలోచనెలా వచ్చింది?**

**జవాబు:** రోగ నిరోధక వ్యవస్థలోని టి–కణాలను కేన్సర్‌కు వ్యతిరేకంగా వాడటమే తొలి కణాధారిత చికిత్స కాదు. అంతకంటే ముందు ఎముక మజ్జను మార్పిడి చేయడం కూడా ఆ కోవకు చెందిన చికిత్సే. 1980లలో నేను ఈ రంగంలో పనిచేసేవాడిని. రోగికి సంబంధం లేని వ్యక్తి ఎముక మజ్జను ఉపయోగించినప్పుడు మెరుగైన ఫలితాలు వస్తున్నట్లు గుర్తించాం. దీనికి కారణమేంటన్నది అన్వేషించినప్పుడు టి–కణాల గురించి తెలిసింది. ఆ పరిశోధనల ఆధారంగా కార్–టి సెల్ థెరపీకి సంబంధించిన ఆలోచన వచ్చింది. టి–కణాల్లో మార్పులు

మిగతా 2వ పేజీలో ▶







### ఇదండీ సంగతి



మనల్ని ఖాళీ చేయించడం కోసం అమెరికా అధ్యక్షుడిని పిలిపించడం ఎందుకో అర్థం కావడం లేదు!

- కొత్తగా ఆరు టెర్మినళ్లు, 9 లిఫ్టులు, 6 ఎస్కలేటర్లు
- రోజూ లక్ష మంది ప్రయాణించేలా ఏర్పాట్లు
- ఈ ఏడాది వచ్చే ప్రైవేట్ రైళ్లన్నీ ఇక్కడి నుంచే...
- ఎర్రగుంట్ల–నంద్యాల విద్యుదీకరణకు శంకుస్థాపన
- గుంతకల్–కల్లూరు 2వ మార్గం, విద్యుదీకరణ జాతికి అంకితం



సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రిమోట్ లింక్ ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న గోయల్, కిషన్‌రెడ్డి, తలసాని, లక్ష్మణ్. చిత్రంలో వైసీపీ ఎంపీ రఘురామకృష్ణంరాజు తదితరులు

## చర్లపల్లిలో చుక్ చుక్

### రైల్వే టెర్మినల్ విస్తరణ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రి పీయూష్ శంకుస్థాపన

సాక్షి, హైదరాబాద్

చర్లపల్లి రైల్వే టెర్మినల్ విస్తరణ ప్రాజెక్టుకు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ మంగళవారం శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలను రిమోట్ కంట్రోల్ లింక్ ద్వారా ప్రారంభించారు. ఈ మేరకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎర్రగుంట్ల–నంద్యాల సెక్షన్‌లో విద్యుదీకరణకు శంకుస్థాపన చేశారు. గుంతకల్లు–కల్లూరు మధ్య పూర్తయిన రెండవ లైన్ మార్గం, విద్యుదీకరణను జాతికి అంకితం చేశారు. రూ.221 కోట్ల అంచనాలతో చేపట్టిన చర్లపల్లి టెర్మినల్ విస్తరణ వల్ల ప్రతి రోజూ సుమారు లక్ష మంది ప్రయాణికులకు రవాణా సదుపాయం లభించనుంది. అలాగే రోజుకు 50 నుంచి 60 రైళ్లు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించేందుకు అవకాశం ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించనున్న ప్రైవేట్ రైళ్ల రాకపోకలకు సైతం చర్లపల్లి కేంద్రం కానుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం ఉన్న 3 ప్లాట్‌ఫామ్‌లను 6 ప్లాట్‌ఫామ్‌ల వరకు విస్తరించనున్నారు. హైలెవల్ ఐలాండ్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేస్తారు. అలాగే రైల్వేస్టేషన్ కొత్త భవనాన్ని నిర్మిస్తారు. స్టేషన్‌కు అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు స్టేషన్ లోపల 9 లిఫ్టులను, 6 ఎస్కలేటర్లను ఏర్పాటు చేయనున్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ

మిగతా 2వ పేజీలో ▶

## యువతి దారుణ హత్య

- ఇంట్లో ఎవరూ లేని సమయంలో దాడి
- పదునైన ఆయుధంతో గొంతు కోయడంతో మృతి
- గజ్వేల్‌లో బ్యాంకు ఉద్యోగిపై ఘాతుకం.. వారం రోజుల్లో ఆమెకు వివాహం
- ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై తల్లిదండ్రుల ఫిర్యాదు



దివ్య (ఫైల్)

**గజ్వేల్ (సిద్దిపేట జిల్లా):** వారం రోజుల్లో ఆమెకు పెళ్లి జరగాల్సి ఉంది. తల్లిదండ్రులు ఆ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఈలోగా ఘోరం జరిగిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దారుణ హత్యకు గురైంది. తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో లోపలకు ప్రవేశించిన దుండగుడు పదునైన ఆయుధంతో ఆమె గొంతు కోసి చంపేశాడు. మంగళవారం రాత్రి గజ్వేల్‌లో ఈ ఘటన జరిగింది. ప్రేమ పేరుతో

మిగతా 2వ పేజీలో ▶

## ఫ్లైఓవర్ పైనుంచి కారు బోల్తా

### ఒకరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు

### హైదరాబాద్ భరత్‌నగర్ ఫ్లై ఓవర్‌పై ప్రమాదం

**హైదరాబాద్:** మితిమీరిన వేగం మరో ప్రాణాన్ని బలితీసుకుంది. హైదరాబాద్‌లో బయోడైవర్సిటీ ఫ్లైఓవర్ నుంచి కారు కింద పడిన ఘటన మరచిపోకముందే అలాంటిదే మరో ప్రమాదం చోటుచేసుకుంది. నగరంలోని భరత్‌నగర్ ఫ్లైఓవర్‌పైకి వేగంగా దూసుకొచ్చిన ఓ కారు.. అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న ఓ వ్యక్తి మృతిచెందగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఫ్లైఓవర్ కింద భరత్‌నగర్ మార్కెట్‌కు వచ్చిన కూరగాయల వ్యాపారులు, విద్యుత్ కేబుల్ కార్మికులు ఉన్నారు. అదృష్టవశాత్తు కారు వారికి కాస్త దూరంగా పడటంతో పెద్ద ప్రమాదం తప్పినట్టయింది.

**30 అడుగుల ఎత్తు నుంచి...**

బోరబండ పండిట్ నెహ్రూనగర్, స్వరాజ్ నగర్‌లకు చెందిన స్నేహితులు మహ్మద్ సోహెల్ (27), మెహిజ్ (19), గౌస్ (20), ఇర్ఫాన్ (18), అశ్వక్ (18) సోమవారం రాత్రి భోజనం చేయడానికి హైటెక్‌సిటీ ప్రాంతానికి వెళ్లారు. సోహెల్ మామయ్యకు చెందిన కారు (ఏపీ 11ఆర్ 9189)ను సునీల్ (22) నడుపుతున్నాడు. భోజనం తర్వాత అర్ధరాత్రి మూసాపేట నుంచి ఎర్రగడ్డ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో భరత్‌నగర్ ఫ్లైఓవర్‌పైకి వేగంగా వెళ్లిన కారు.. అదుపు తప్పింది. అడుగున్నర ఎత్తున్న ఫుట్‌పాత్ ఎక్కి, రెయిలింగ్‌ను ఢీకొట్టి 30 అడుగుల ఎత్తు నుంచి కిందకు పడిపోయింది. ఆ సమయంలో అక్కడున్న కూరగాయల వ్యాపారులు, విద్యుత్ కేబుల్ కార్మికులు పరుగులు తీశారు. అనంతరం తేరుకుని కారు వద్దకు చేరుకున్నారు. జేసీబీ సాయంతో కారు రేకులు తొలగించి అందులో ఉన్న ఆరుగురిని బయటకు తీశారు. ఈ ఘటనలో డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న సోహెల్ అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన ఐదుగురు గాయపడ్డారు. సోహెల్ తండ్రి షఫీ చాయ్ హోటల్ నడుపుతున్నారు. గాయపడిన అశ్వక్, ఇర్ఫాన్, మొహిజ్‌లు స్వరాజ్‌నగర్‌లో ఏసీ రిపేరింగ్ పనులు చేస్తుంటారు. గౌస్ అల్మారా పనులు చేస్తుండగా.. కారు నడిపిన సునీల్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు. (ఇన్‌సెట్లో) కూలిన ఫ్లైఓవర్ రెయిలింగ్, మృతుడు సోహెల్



## డీఎస్సీ-2003 టీచర్లకు గుడ్ న్యూస్!

**సాక్షి, హైదరాబాద్:** డీఎస్సీ–2003 టీచర్లకు శుభవార్త. కొత్త పెన్షన్ స్కీంలో కొనసాగుతున్న వారంతా పాత పెన్షన్ స్కీం పరిధిలోకి వచ్చేలా కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పెన్షన్ శాఖ ఉత్తర్వులను (మెమోరాండం 57/04/2019 అండ్ పీ అండ్ పీడబ్ల్యూ(బీ)) జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ పథకం 2004 జనవరి 1 నుంచి అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఉద్యోగ ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన పరీక్ష/ పరీక్ష ఫలితాలు 2004 జనవరి కంటే ముందు ప్రకటించి ఉంటే (నియామకాలు జరగకపోయినా సరే) వారంతా పాత పెన్షన్ స్కీం పరిధిలోకి వస్తారని పేర్కొంది. దీని ప్రకారం రాష్ట్రంలో డీఎస్సీ–2003 ఫలితాలు అదే సంవత్సరం విడుదలయ్యాయని, నియామకాలు మాత్రం 2004లో జరిగాయని ఉపాధ్యాయ సంఘం నేత ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం తాజా నిబంధనల ప్రకారం ఫలితాలు 2003లోనే వెలువడినందున, ఆ డీఎస్సీలో ఎంపికై న వారంతా పాత పెన్షన్ స్కీం పరిధిలోకి వచ్చేందుకు ఆస్కారం లభించిందని ఆయన వెల్లడించారు. ఇదే నిబంధన ఉద్యోగులకు కూడా వర్తిస్తుందని వివరించారు. దీంతో సదరు ఉద్యోగ ఉపాధ్యాయులు మే 31లోగా పాత పెన్షన్ స్కీంలోకి మారేందుకు ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

## పీఆర్సీ గడువు పొడిగింపు

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వానికి లేఖ రాసింది. మరోవైపు ఈనెల 12న ఆర్థికశాఖ కూడా అందుకు సమ్మతించడంతో పీఆర్సీ గడువును డిసెంబర్ 31 వరకు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటికితోడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇప్పట్లో పీఆర్సీ అమలు చేయడం కష్ట సాధ్యం కానుంది. పైగా ఉద్యోగులు కోరుతున్నట్లుగా మధ్యంతర భృతి (ఐఆర్) 27% ఇచ్చినా ప్రభుత్వంపై ఆర్థిక భారం రూ.6,075 కోట్లు పడనుంది. ఈ పరిస్థితుల్లో పీఆర్సీ గడువు పెంపువైపే ప్రభుత్వం మొగ్గు చూపింది. దీంతో 2021–22 ఆర్థిక సంవత్సరంలో పీఆర్సీ అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది. కాగా, ప్రస్తుత పరిస్థితుల్లో పీఆర్సీ అమలు ఆలస్యం కానుందని సాక్షి ముందే (ఈనెల 14న) వెల్లడించింది. పీఆర్సీ గడువు పొడిగించడంతో ఉద్యోగులు నిరాశలో పడ్డారు. ఉద్యోగ సంఘాల నేతలపై మండి పడుతున్నారు.



మంగళవారం ప్రగతిభవన్‌లో పట్టణప్రగతి నిర్వహణపై జరిగిన రాష్ట్ర స్థాయి మున్సిపల్ సదస్సులో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. సదస్సుకు హాజరైన ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఉన్నతాధికారులు

# ... దళితవాడల నుంచే

▶ మొదటి పేజీ తరువాయి

పరిధిలోని గ్రామాల్లో రాత్రి బస, పాదయాత్ర ద్వారా పల్లె ప్రగతి లక్ష్యాలను సాధించాలన్నారు.

**ప్రతి పట్టణానికి వార్షిక, పంచవర్ష ప్రణాళిక...**

స్థానిక కౌన్సిలర్లు, కార్పొరేటర్ల భాగస్వామ్యంతో వార్డులు, పట్టణాలవారీగా వార్షిక, పంచవర్ష ప్రణాళికలు తయారు చేయాలని, వార్డులవారీగా నియమించే ప్రజాసంఘాల అభిప్రాయం కూడా తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. ప్రతి వార్డుకు శాశ్వత ప్రాతిపదికన స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి స్థానిక అవసరాలపై అంచనాకు రావాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, గుంతలు లేని రహదారులు, పచ్చదనం, డంప్ యార్డులు, క్రీడా ప్రాంగణాలు, ఓపెన్ జిమ్, శ్మశానవాటికలు, పరిశుభ్రమైన కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం మార్కెట్లు తదితరాలను ఆదర్శ పట్టణాలు, నగరాలకు ఉండే ప్రధాన లక్షణాలని సీఎం పేర్కొన్నారు. పట్టణాల్లో కనీస పౌర సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను వినియోగించే అధికారాన్ని కలెక్టర్లకు కల్పిస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. పట్టణ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అనువైన స్థలాల ఎంపికతోపాటు అవసరమైన టాయిలెట్ల నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలని గడువు విధించారు.

**వీధి వ్యాపారుల కోసం స్ట్రీట్ వెండింగ్ జోన్లు...**

వీధి వ్యాపారుల కోసం పట్టణాల్లో స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించే వరకు వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆటోలు, ట్యాక్సీలు, ఇతర ప్రజారవాణా, సరుకు రవాణా వాహనాలకు నిర్దిష్ట ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం కోసం అవసరమైతే ప్రభుత్వ స్థలాలను వినియోగించే అధికారాన్ని కలెక్టర్లకు ఇస్తున్నామన్నారు. ప్రమాదాలకు తావులేకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఒరిగిన, తుప్పు పట్టిన, రోడ్ల మధ్యలో ఉండే స్తంభాలు, ఫుట్‌పాత్‌లపై ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌లను మార్చాలన్నారు. ఇళ్లపై వేలాడే వైర్లను సరిచేయడంతోపాటు పొట్టి స్తంభాలను తొలగించి పెద్ద స్తంభాలు వేసేందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయిస్తామన్నారు. స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లను విద్యుత్ అధికారులు ముందుగానే సమకూర్చి ఆయా పట్టణాలకు పంపించాలన్నారు. గ్రామాల తరహాలో పట్టణాల్లోనూ మొక్కల పెంపు బాధ్యతను కౌన్సిలర్లు, కార్పొరేటర్లుతీసుకోవాలని, పట్టణ అవసరాల కోసం నర్సరీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి నుంచి చెత్త సేకరణకు రాష్ట్రవ్యాప్తంగా 3,100 వాహనాలకుగాను ఇప్పటికే 600 వాహనాలు కొనుగోలు చేసినట్లు సీఎం కేసీఆర్ వెల్లడించారు. డ్రైనేజీలు శుభ్రం చేసేందుకు అందుబాటులోకి వచ్చిన యంత్రాలను కొనుగోలు చేయాలన్నారు.

**పట్టణాలకు ప్రతినెలా నిధులు...**

ఇతర ఖర్చులను తగ్గించుకొని పట్టణాలకు ప్రతి నెలా రూ. 148 కోట్ల ఆర్థిక సంఘం నిధులు ఇస్తామని, వాటిని ఖర్చు చేసేందుకు ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని సీఎం కేసీఆర్ అధికారులకు సూచించారు. మున్సిపాలిటీల అప్పులకు సంబంధించిన కిస్తీ చెల్లింపు, ఉద్యోగుల జీతభత్యాలు, కరెంటు బిల్లులు, మంచినీటి బిల్లులను ప్రతి నెలా కచ్చితంగా చెల్లించే బాధ్యత కమిషనర్లు తీసుకోవడంతోపాటు పచ్చదనం కోసం 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభివృద్ధి నిధులను కూడా పట్టణ ప్రగతికి వినియోగించాలన్నారు. కొత్త మున్సిపల్ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలపై నమ్మకాన్ని పెడుతూ ఇళ్ల నిర్మాణం, లే అవుట్‌ల విషయంలో సులభతర అనుమతుల విధానం తెచ్చామన్నారు. అక్రమ నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చేస్తామని ప్రజలకు స్పష్టంగా చెప్పాలన్నారు. జీవో నంబర్ 58, 59 ద్వారా గతంలో పట్టణాల్లోని ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లను క్రమబద్ధీకరించినట్లే అన్ని మున్సిపాలిటీల్లో మరో అవకాశం ఇచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని సీఎం వెల్లడించారు. సంపూర్ణ అక్షరాస్యత కోసం కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కూడా బాధ్యత తీసుకోవాలని సీఎం ఆదేశించారు. సదస్సులో భాగంగా మేయర్లు, చైర్‌పర్సన్లతో ముఖాముఖి నిర్వహించిన సీఎం కేసీఆర్.. వారి సందేహాలను నివృత్తి చేశారు.

**బల్దియా.. ఖాయా పీయా చల్దియా**

'మున్సిపాలిటీలు మురికి, చెత్త, అవి నీతికి పర్యాయపదాలుగా మారాయి. బల్దియా.. ఖాయా.. పీయా.. చల్దియా అనే సామెతలు వచ్చాయి. పారదర్శక విధానాల తోనే చెడ్డపేరు పోతుంది. ప్రజాప్రతినిధులు డంబాచారాలు పలకొద్దు. అన్ని పనులు ఓవర్ నైట్‌లో చేసేస్తాం అని మాట్లాడొద్దు. ఫొటోలకు పోజులివ్వడం తగ్గించి పనులు చేయించడంపై దృష్టి పెట్టాలి. ప్రణాళికా బద్ధంగా 6 నెలలు కష్ట పడితే పట్టణాలు అభివృద్ధి సాధిస్తాయి. ఇతర దేశాల విజయగాథలు వినడమే కాదు... మనమూ విజయం సాధించాలి'అని కేసీఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, పట్టణ పరిపాలన కమిషనర్ సత్యనారాయణ సైతం పాల్గొన్నారు.

### పట్టణ ప్రగతి సమావేశానికి కాంగ్రెస్ 'డుమ్మా'

**సాక్షి, హైదరాబాద్:** పట్టణ ప్రగతిపై మంగళవారం ప్రగతి భవన్‌లో ప్రభుత్వం నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా తమ పార్టీ ఎమ్మెల్యేలకు ఆయా జిల్లాల కలెక్టర్ల ద్వారా సమాచారం వచ్చిందని, అయితే మున్సిపల్ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అనుసరించిన విధానాలకు నిరసనగా తమ ఎమ్మెల్యేలు సమావేశాన్ని బహిష్కరించారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో డబ్బు, మద్యం, అధికార దుర్వినియోగం ద్వారా టీఆర్‌ఎస్ గెలుపొందిందని, ఎన్నికల కమిషన్ కూడా పక్షపాతంతో వ్యవహరించిందని కాంగ్రెస్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ కారణంగానే సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతోపాటు ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, వీరయ్యలు పట్టణ ప్రగతి సమావేశానికి హాజరు కాలేదని గాంధీ భవన్ వర్గాలు తెలిపాయి.



రాష్ట్ర మున్సిపల్ సదస్సులో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ముచ్చట్లు

### ఆదర్శ నగరాలుగా మార్చే బాధ్యత మీదే...

రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాలను దేశంలోకెల్లా ఆదర్శంగా మార్చే బాధ్యత కొత్తగా ఎన్నికై న మేయర్లు, చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లపై ఉందని సీఎం కేసీఆర్ అన్నారు. ఒకప్పుడు కష్టం, త్యాగాలతో కూడిన రాజకీయాలు ఉండేవని, బ్రిటిష్ పాలన తర్వాత దేశంలో సౌకర్యవంతమైన రాజకీయాలు వచ్చాయన్నారు. 'జాతి నిర్మాణంలో తమ పాత్రను గుర్తెరిగి పనిచేసే వారికి మంచిపేరు వస్తుంది. ప్రజానాయకులుగా ఎదిగితే అది జీవితానికి మంచి సాఫల్యం. అధికారం, హోదా వచ్చాక మనిషి మారకూడదు. లేని గొప్పతనాన్ని, ఆడంబరాన్ని తెచ్చుకోకూడదు'అని సీఎం హితవు పలికారు. 'ఐదు కోట్ల మందిలో 140 మందికే మేయర్లు, చైర్‌పర్సన్లు అయ్యే అవకాశం వచ్చింది. దీన్ని ఒక ముందడుగుగా స్వీకరించి సానుకూలంగా మార్చుకోగలిగితే ప్రజాజీవితంలో ఎంత ముందుకైనా పోవచ్చు. ప్రజలు నన్ను రెండు సార్లు సీఎంను చేశారు. నా వరకై తే గెలిచేంత వరకే రాజకీయం. ఆ తర్వాత కాదు. ప్రభుత్వ పథకాల అమలు తీరు చూస్తే అది అర్థం అవుతుంది. ఒక్కసారి నాయకుడి మీద విశ్వాసం కలిగితే ప్రజలు సంపూర్ణంగా సహకరిస్తారు. సంకల్పం గట్టిగా ఉంటే 100 శాతం విజయం సాధిస్తారు'అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# కణాధారిత చికిత్సలదే భవిష్యత్తు!

▶ మొదటి పేజీ తరువాయి

చేయడం ద్వారా ఎముక మజ్జ మార్పిడి ప్రక్రియ లేకుండానే కేన్సర్‌కు చికిత్స అందించొచ్చన్న ఆలోచనతో దీన్ని మొదలుపెట్టాం.

**వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లను చంపేయడమే ఇప్పటివరకు పలు వ్యాధుల చికిత్సకు ఉపయోగిస్తున్న పద్ధతి. ఇలా కాకుండా శరీర వ్యవస్థలను బలోపేతం చేయడం సాధ్యమేనా?**

రోగ నిరోధక వ్యవస్థలో రకరకాల కణాలు ఉన్నాయి. కొన్ని బ్యాక్టీరియాలను నాశనం చేసేందుకు ఉపయోగపడితే టి–కణాల్లాంటివి వైరస్‌లను మట్టుబెట్టేందుకే పరిణమించాయి. బీ–కణాలు తయారుచేసే యాంటీబాడీలు బ్యాక్టీరియా, సూక్ష్మక్రిములకు అతుక్కుపోవడం ద్వారా అవి నాశనమయ్యేందుకు ఉపయోగపడతాయి. ఈ ప్రాథమిక ధర్మాల ఆధారంగా భవిష్యత్తులో మందులు వాడకుండానే ఎయిడ్స్ లాంటి తీవ్రస్థాయి వ్యాధులకూ చికిత్స చేయొచ్చు. మధుమేహం, ఆర్థరైటిస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధుల చికిత్సకూ కణాధారిత చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి.

**రోగ నిరోధక వ్యవస్థలోని టి–కణాలు వైరస్‌లను నాశనం చేసేందుకే ఉన్నాయని మీరు అంటున్నారు.. అలాంటప్పుడు కరోనా వైరస్‌కు విరుగుడుగా టీ–కణాలను వాడొచ్చా?**

వాడొచ్చు. అయితే ప్రస్తుతమున్న పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే కరోనా వైరస్ నియంత్రణకు ఒక వ్యాక్సిన్ పనిచేసేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కార్–టి వంటి కణాధారిత చికిత్సల అవసరం ఉండకపోవచ్చు. ఇప్పటికే కోవిడ్–19 బారిన పడి స్వస్థత చేకూరిన వారి రక్తంలో వైరస్‌ను ఎదుర్కొనే యాంటీబాడీలు మెండుగా ఉంటాయి. ఇలాంటి వారి నుంచి సేకరించిన సీరమ్‌ను ఎక్కించడం ద్వారా దీన్ని ఇతరులకు సోకకుండా చేయొచ్చు.

**ప్రస్తుతం ఏ అంశాలపై ప్రయోగాలు చేస్తున్నారు?**

కార్–టి చికిత్స విధానానికి జన్యు ఎడిటింగ్ టెక్నాలజీ క్రిస్పర్‌ను జోడించేందుకు ప్రయత్నం చేస్తున్నా. ఇది కేన్సర్ కణితులపై మంచి ఫలితం చూపిస్తుందని అంచనా.

**కార్–టి పద్ధతి కేన్సర్‌కు మెరుగైన చికిత్సేనా?**

అమెరికాలో ఈ పద్ధతి ఇప్పటికే చాలామంది ల్యూకేమియా, లింఫోమా రోగులకు చికిత్స కల్పించింది. త్వరలోనే ఎముక మజ్జకు వచ్చే మైలోమా రకం కేన్సర్‌కు కూడా ఎఫ్‌డీఏ అనుమతులు రానున్నాయి. ప్రస్తుతం మైలోమా చికిత్సకయ్యే ఖర్చు చాలా ఎక్కువ. ఈ చికిత్స వల్ల రెండు మూడేళ్లు మాత్రమే బతుకుతారనే వారు పదేళ్ల వరకూ మనుగడ సాగించవచ్చు. కేన్సర్ చికిత్సకు మరికొన్ని ఆసక్తికరమైన మార్గాలూ ఉన్నాయి. ఉదాహరణకు కణాల మధ్య సమాచార ప్రసారానికి ఉపయోగపడే ఎగ్జోజోమ్స్. ఈ కణాలను ఎలా తయారు చేస్తారన్న అంశంపై ఇది ఆధారపడి ఉంటుంది. ఇలా వేర్వేరు రకాల చికిత్స పద్ధతులను కార్–టి చికిత్స విధానంతో కలిపి వాడేందుకు అవకాశాలు ఉన్నాయి.

**మీరు చెప్పినదాని ప్రకారం కార్–టి కణాలతో అందించే చికిత్స చాలా ఖరీదైంది. భారత్ లాంటి దేశాల్లోనూ దీన్ని వాడాలంటే ఏం చేయాలి?**

కార్–టి కణాల తయారీ ప్రస్తుతం చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఒక్కో రోగి రక్తం నుంచి టి–కణాలను వేరు చేయడం, అవసరమైన మార్పులు చేయడం వల్ల ఖర్చులు ఎక్కువగా ఉంటున్నాయి. ఇప్పటివరకు టి–కణాలను పరిశోధన సంస్థల్లో మాత్రమే తయారు చేస్తున్నారు. నోవర్టిస్ లాంటి సంస్థ వాణిజ్య స్థాయి ఉత్పత్తి మొదలుపెట్టినా అది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేందుకు కొంత సమయం పడుతుంది. అమెరికాలో 2017 నాటి సగటు కార్–టి మందుల ఖర్చు ఏడాదికి రూ.3 కోట్ల వరకు ఉంటుంది. వీటికి బదులుగా బొడ్డు తాడు నుంచి సేకరించే రక్తం, మూలకణాల నుంచి యంత్రాల సాయంతో తయారు చేయగలిగితే కార్–టి కణాల తయారీ చాలా చౌక అవుతుంది.

**భారత ప్రభుత్వంతో కలసి పనిచేసే అవకాశం ఉందా?**

కచ్చితంగా.. కార్–టి చికిత్స విధానంపై ప్రభుత్వం తయారు చేసిన మార్గదర్శకాలను పరిశీలించి తగిన సలహా సూచనలు ఇవ్వాలన్నది ఆలోచన. బయోకాన్ కంపెనీతో పాటు, కేన్సర్ నిపుణులు సిద్ధార్థ ముఖర్జీ వంటి వారితో కలసి కంపెనీ పెట్టే ఆలోచన కూడా ఉంది.

# యువతి దారుణ హత్య

▶ మొదటి పేజీ తరువాయి

వేధిస్తున్న యువకుడే ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని మృతురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**కాబోయే భర్తతో ఫోన్‌లో మాట్లాడుతుండగా..**

సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన న్యాలకంటి లక్ష్మీరాజ్యం, మణెమ్మ దంపతుల మూడో కుమార్తె దివ్య (25) గజ్వేల్‌లోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆమెకు వరంగల్‌కు చెందిన సందీప్ అనే యువకుడితో వివాహం కుదిరింది. ఈనెల 26న వారి పెళ్లి జరగాల్సి ఉంది. దీంతో దివ్య తల్లిదండ్రులు పెళ్లి పనుల నిమిత్తం మంగళవారం ఉదయం ఎల్లారెడ్డిపేట వెళ్లారు. దివ్య బ్యాంకుకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చారు. కాబోయే భర్త సందీప్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ మెట్లు దిగుతుండగా.. రాత్రి 8.06 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై దాడి చేశాడు. పదునైన ఆయుధంతో ఆమె గొంతు కోశాడు. ఈ క్రమంలో ఆమె కేకలు వేయడం ఫోన్ మాట్లాడుతున్న సందీప్‌కు వినిపించాయి. వెంటనే అతడు గజ్వేల్‌లో తనకు తెలిసిన వారికి ఫోన్ చేసి చెప్పారు. వారు అక్కడకు వచ్చి చూసేసరికి దివ్య రక్తపు మడుగులో ప్రాణాలు కోల్పోయి కనిపించింది.

**కొన్నేళ్లుగా యువతికి వేధింపులు...**

కుమార్తె హత్యకు గురైందన్న సమాచారం తెలియడంతో దివ్య తల్లిదండ్రులు హుటాహుటిన ఇంటికి వచ్చారు. ప్రేమోన్మాదమే తమ కుమార్తె హత్యకు కారణమని విలపిస్తూ చెప్పారు. గత కొంతకాలంగా వేములవాడకు చెందిన వెంకటేష్ అనే యువకుడు దివ్యను వేధిస్తున్నాడని పేర్కొన్నారు. అతడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్టు వెల్లడించారు. ఈ వ్యవహారంపై పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా.. ఇక తమ కుమార్తె జోలికి రానని కాగితం రాసిచ్చాడని వివరించారు. కాగా, మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఏసీపీ నారాయణ తెలిపారు. యువతి ఉంటున్న ఇంటికి అతడు ఏ సమయంలో వచ్చాడు.. ఎలా దాడి చేశాడనే అంశాలను సీసీటీవీ ఫుటేజీ ద్వారా గుర్తిస్తామని చెప్పారు.

# చర్లపల్లిలో చుక్ చుక్

▶ మొదటి పేజీ తరువాయి

స్టేషన్‌లపై పెరిగిన ఒత్తిడి, రద్దీని దృష్టిలో ఉంచుకొని 4వ టెర్మినల్‌గా చర్లపల్లి విస్తరణ చేపట్టారు. వచ్చే రెండేళ్లలో దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. టెర్మినల్‌తో పాటు మరో 4 పిట్‌లైన్‌లను ఏర్పాటు చేయనున్నారు. నగరానికి తూర్పు వైపున చర్లపల్లి టెర్మినల్ అందుబాటులోకి రావడం వల్ల శివారు ప్రాంతాలకు చెందిన ప్రజలు నగరంలోకి ప్రవేశించవలసిన అవసరం లేకుండా ఔటర్ మీదుగా రాకపోకలు సాగించవచ్చు. అలాగే ఘట్‌కేసర్ నుంచి యాదాద్రికి వెళ్లేందుకు నిర్మించనున్న ఎంఎంటీఎస్ కూడా చర్లపల్లి మీదుగానే వెళ్తుంది. సబర్బన్ రైల్ నెట్ వర్క్‌కు ఇది కేంద్రం కానుంది.

**పెరగనున్న వేగం...**

గుంతకల్లు–కల్లూరు సెక్షన్‌లో రూ.322 కోట్ల అంచనాలతో చేపట్టిన 41 కిలోమీటర్ల రెండవ లైన్ మార్గం నిర్మాణం పూర్తయింది. అలాగే విద్యుద్దీకరణ పనులను సైతం పూర్తి చేశారు. ఈ మార్గాన్ని మంత్రి జాతికి అంకితం చేశారు. దీనివల్ల ఈ సెక్షన్‌లో నడిచే ఢిల్లీ, ముంబై, సికింద్రాబాద్‌ల నుంచి బెంగళూర్ వైపు వెళ్లే మార్గానికి ఇది అనుసంధానమవుతుంది. ఈ మార్గంలో రైళ్ల వేగం గంటకు 100 కిలోమీటర్ల వరకు పెరగనుంది. ఈ మార్గంలో ఒక ప్రధాన వంతెనతో పాటు, 4 పెద్ద వంతెనలు, మరో 45 చిన్న వంతెనలను నిర్మించారు. 11 లెవల్ క్రాసింగ్‌లను తొలగించారు. 3 ఏళ్ల వ్యవధిలోనే ఈ పనులను పూర్తి చేశారు.

**ఎర్రగుంట్ల–నంద్యాల విద్యుదీకరణ..**

ఎర్రగుంట్ల–నంద్యాల సెక్షన్‌లో రూ.112 కోట్ల అంచనాలతో చేపట్టనున్న 123 కిలోమీటర్‌ల మేర విద్యుదీకరణ పనులకు కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. సరుకు రవాణాకు, ప్రయాణికుల రవాణా సదుపాయానికి ఇది ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కడప జిల్లాలకు రైల్వేసదుపాయం విస్తరించనుంది. మద్దూరు, బనగానపల్లె, కోయిలకుంట్ల, సంజమల, నొస్సం, ఎస్.ఉప్పలపాడు, జమ్మలమడుగు, పొద్దుటూరు రైల్వేస్టేషన్‌ల నుంచి రైళ్లు రాకపోకలు సాగించనున్నాయి. ఈ సెక్షన్‌ను దక్షిణమధ్య రైల్వే మొట్టమొదటి సౌరశక్తి వినియోగ సెక్షన్‌గా ప్రకటించింది.

### 427 స్టేషన్‌లలో ఉచిత హై స్పీడ్ వైఫై

దక్షిణమధ్య రైల్వేలో ఉచిత హైస్పీడ్ వైఫై సదుపాయాన్ని మొట్టమొదట 2016 డిసెంబర్‌లో సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రారంభించారు. ఇప్పుడు ఈ స్టేషన్ వైఫై వినియోగంలో దేశంలోనే 4వ స్థానంలో ఉంది. అనంతరం దశలవారీగా 576 స్టేషన్‌లకు ఈ సదుపాయాన్ని విస్తరించారు. ప్రస్తుతం సుమారు రూ.65 కోట్లతో మిగిలిన 427 స్టేషన్‌లలో ఉచిత హైస్పీడ్ వైఫై సౌకర్యాన్ని కొత్తగా ప్రారంభించారు. దీన్ని మంత్రి మంగళవారం సికింద్రాబాద్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతికి అంకితం చేశారు.

# కేంద్రం వర్సెస్ రాష్ట్రం

### మంత్రుల సభలో విమర్శలు.. ప్రతి విమర్శలు

**సాక్షి, హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన, ప్రారంభోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం చర్చనీయాంశమైంది. మంత్రి తలసాని మొదట మాట్లాడుతూ.. రైల్వే ప్రాజెక్టుల నిర్మాణం, నిధుల కేటాయింపుల్లో కేంద్రం దక్షిణాది రాష్ట్రాలను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. బడ్జెట్‌లో దక్షిణ భారతానికి తక్కువ నిధులను కేటాయించిందని పేర్కొన్నారు. తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. రైల్వే మంత్రి ఏ రాష్ట్రానికి చెందిన వారైతే ఆ రాష్ట్రానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లు ఆరోపించారు. ఎంఎంటీఎస్ రెండో దశ నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారాలను అందిస్తుందని చెప్పారు. అనంతరం పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. గత యూపీఏ ప్రభుత్వం తెలంగాణకు కేటాయించిన నిధుల కంటే 10 రెట్లు ఎక్కువగా ఎన్డీయే ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. యూపీఏ తెలంగాణకు కేవలం రూ.258 కోట్టిస్తే.. తాము రూ.2,602 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. కేంద్రానికి ఏ ఒక్క రాష్ట్రం పట్ల ప్రత్యేక అభిమానం ఉండబోదని.. అన్ని రాష్ట్రాలు, అన్ని ప్రాంతాలు సమానమేనని స్పష్టం చేశారు. ప్రధాని మోదీకి 130 కోట్ల భారతీయులంతా సమానమేనని పేర్కొన్నారు. మంత్రి తలసాని వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు.

**ఎంఎంటీఎస్–2కు నిధులివ్వండి..**

కేంద్ర, రాష్ట్రాల సంయుక్త ప్రాజెక్టుగా ప్రారంభించిన ఎంఎంటీఎస్ రెండో దశకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.450 కోట్లు ఇవ్వకపోవడం వల్లనే పనులు నిలిచిపోయినట్లు పీయూష్ పేర్కొన్నారు. మౌలాలీ–సనత్‌నగర్ మధ్య పనులు నిలిచిపోయాయని చెప్పారు. రాష్ట్రం తన వాటా నిధులను అందిస్తే ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఆర్‌వీఎన్‌ఎల్ సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలోని చాలా మారుమూల ప్రాంతాలకు గతంలో కేవలం బస్సు సర్వీసు మాత్రమే ఉండేదని, ఇప్పుడు చాలా ప్రాంతాలకు రైల్వేతో అనుసంధానం ఏర్పడిందని అన్నారు. మోదీ ప్రభుత్వం వచ్చాకే రైల్వేలు విస్తరిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే శాఖ సహాయ మంత్రి సోంప్రకాష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, ఎంపీలు బండి సంజయ్, సీఎం రమేష్, రఘురామ కృష్ణంరాజు, పి.రంగయ్య, ధర్మపురి అరవింద్, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గజానన్ మాల్యా, ఎన్‌వీఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఒవైసీ ఒత్తిడితోనే సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం

- మజ్లిస్ అధినేతకు లొంగిపోయిన కేసీఆర్
- ఇది రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించడమే
- వెంటనే దాన్ని ఉపసంహరించుకోవాలి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఒత్తిడితోనే తెలంగాణలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మతరాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) రద్దు చేయాలంటూ మూడు రోజుల క్రితం తెలంగాణ కేబినెట్‌లో తీర్మానం చేయడం కూడా ఒవైసీ ఒత్తిడి ఫలితమేనని అన్నారు. వెంటనే ఆ తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఒకసారి పార్లమెంట్‌లో చట్టం అయిన తర్వాత అది భారతదేశ చట్టంగా మారుతుందని, దాన్ని అన్ని రాష్ట్రాలు గౌరవించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కానీ రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించేలా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మత ప్రాతిపదికన ప్రజల మధ్య విభజన కోసం నిరంతరం యత్నించే మజ్లిస్ పార్టీ బుట్టలో కేసీఆర్ పడిపోయారని, ఆయన కూడా మత రాజకీయాల వైపు నడవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి సరైన సమయంలో స్పందిస్తారన్న నమ్మకం ఉందన్నారు. సీఏఏపై తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, ఈ విషయంలో ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అసదుద్దీన్ ఒవైసీని ముస్లింలు కూడా నమ్మరని, ఆయన చెప్పే మాటలన్నీ అబద్ధాలేనని కొట్టిపడేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలంటూ ఇటీవల ఢిల్లీలో ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంలో తెలంగాణ మంత్రి కేటీఆర్ అన్నారని.. ఆ తర్వాత రెండు రోజులకే తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో సీఏఏకు వ్యతిరేకంగా తీర్మానం చేశారని ఆరోపించారు. ఇలా రెండు ధోరణులతో వ్యవహరించడం ప్రజలను మోసం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. వాస్తవానికి తెలంగాణ పురోగతికి కేంద్రం కట్టుబడి పనిచేస్తోందని, అందుకు తగ్గట్టు నిధులు కేటాయిస్తోందని తెలిపారు. కానీ కేంద్రానికి రాష్ట్రం నుంచే సహకారం అందడం లేదని ఆరోపించారు.



విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్. చిత్రంలో కిషన్‌రెడ్డి, కె.లక్ష్మణ్

## తెలంగాణలో బీజేపీ బలపడుతోంది..

తెలంగాణలో బీజేపీ బాగా బలపడుతోందని, కేంద్రం చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను తెలంగాణ వాసులు అర్థం చేసుకుంటున్నా రని పేర్కొన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో నలుగురు ఎంపీ అభ్యర్థులు గెలవడం, ఇటీ వలి మున్సిపల్ ఎన్నికల్లో బలాన్ని రెట్టింపు చేసుకోవడం దీనికి నిదర్శనమన్నారు. బీజేపీ తెలంగాణ ఎంపీలు అరవింద్, సంజయ్, బాపూరావులు నిత్యం తమ నియోజకవర్గాలకు నిధులు సంపాదించుకునేందుకు ఢిల్లీలో తీవ్రంగా ప్రయత్నిస్తుండటం అభినందించ దగ్గ విషయమన్నారు. ఇటీవలి బడ్జెట్‌లో రైల్వేలకు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో భారీగా నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ఎంపీలు అరవింద్, సంజయ్, బాపూరావు తదితరులు పాల్గొన్నారు.

# సమత కేసు ముద్దాయిలకు హైకోర్టు నోటీసులు

## విచారణ మార్చి 24కి వాయిదా



**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో సంచలనం రేపిన సమత హత్యోదంతం కేసులో కింది కోర్టు ఉరి శిక్ష విధించిన ముద్దాయిలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో షేక్ బాబు, షేక్ షాబుద్దీన్, షేక్ మఖ్దూంలను ఆదిలాబాద్ ప్రత్యేక కోర్టు దోషులుగా నిర్ధారిస్తూ గత నెల 30న తీర్పు చెప్పింది. గతేడాది నవంబర్ 24న కుమురం భీం జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్ గ్రామంలో సమతపై నిందితులు సామూహిక అత్యాచారానికి పాల్పడినట్లుగా ప్రత్యేక కోర్టు తేల్చి వారికి ఉరి శిక్ష విధించాలని తీర్పునిచ్చింది. అయితే ఉరి శిక్ష విధించిన తీర్పులను సంబంధిత హైకోర్టు ఖరారు చేయాల్సి ఉంది. దీంతో సమత కేసు హైకోర్టుకు చేరింది. దీనిని మంగళవారం విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిల ధర్మాసనం షేక్ బాబు, షేక్ షాబుద్దీన్, షేక్ మఖ్దూంలకు నోటీసులు జారీ చేసింది. కింది కోర్టు విధించిన ఉరి శిక్షను ఎందుకు అమలు చేయకూడదో పూర్తి వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 24కి వాయిదా వేసింది.




# జీవో ఇచ్చారు... ఆపారు!

## సాగునీటి శాఖ పునర్వ్యవస్థీకరణ ఉత్తర్వుల్లో అస్పష్టతే కారణం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర సాగునీటి శాఖను పూర్తి స్థాయిలో పునర్‌వ్యవస్థీకరిస్తూ ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వును (జీవో) తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలో పలు అంశాలపై అస్పష్టత ఉండటంతో దీన్ని పక్కనపెట్టినట్లుగా నీటిపారుదల వర్గాలు చెబుతున్నాయి. వాటిని సవరించే ప్రక్రియ పూర్తయిన అనంతరం తిరిగి సవరించిన జీవోను జారీ చేయనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సాగునీటి శాఖకు కొత్తరూపునిస్తూ పునర్‌వ్యవస్థీకరణ జీవోను గత శనివారం ప్రభుత్వం వెలువరించింది. మేజర్, మీడియం, మైనర్ పనులన్నింటినీ ఒకే గొడుగు కిందకి తీసుకొచ్చింది. పూర్వ జిల్లాల ప్రాతిపదికన ఒక్కో జిల్లాకు ఒక్కో చీఫ్ ఇంజనీర్‌కు బాధ్యతలు కట్టబెట్టింది. అయితే కొన్ని చోట్ల అస్పష్టత నెలకొంది. అధికారవర్గాలు తెలిపిన సమాచారం మేరకు.. కరీంనగర్ ఈఎన్‌సీ పరిధిలోకి ఎల్లంపల్లి కాల్వలు, మిడ్‌మానేరు కింద వరద కాల్వ, గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్, దిగువ మానేరు కింది ఎస్సారెస్పీ–2 ఆయకట్టు అంతా చేర్చారు. అయితే ఎస్సారెస్పీ ఆయకట్టు పూర్వ నల్లగొండ జిల్లా తుంగతుర్తి వరకు విస్తరించి ఉంటుంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు నల్లగొండ జిల్లా పరిధిలో ఉండే ఆయకట్టు అక్కడి సీఈ కిందకే రావాలి. కానీ కరీంనగర్ ఈఎన్‌సీ కిందకు చేర్చారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది.

ఇక గతంలో ఎస్సారెస్పీ సీఈ పరిధిలో ఆదిలాబాద్ జిల్లాలోని కుప్టి ప్రాజెక్టు ఉండగా, ఇప్పుడు దాన్ని ఆదిలాబాద్ సీఈ కిందకు మార్చారు. అయితే కుప్టి ప్రాజెక్టును నిర్మల్ సర్కిల్ పరిధిలో ఉంచాలా లేక అదే జిల్లాలోని పెన్‌గంగ సర్కిల్ పరిధిలో ఉంచాలా అన్నదానిపై అస్పష్టత ఉంది. ఇక జిల్లాకు చెందిన సీఈలే మైనర్ ఇరిగేషన్‌కు సంబంధించిన పనులన్నీ చూడాలని జీవోలో పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం గోదావరి, కృష్ణాబేసిన్‌లకు వేర్వేరుగా ఉన్న సీఈలను ఎక్కడ నియమించాలన్న దానిపై జీవోలో చెప్పలేదు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు హడావుడిగా జీవో విడుదలైనా, చాలా అంశాలపై స్పష్టత లేకపోవడంతో దాన్ని తాతాల్కికంగా నిలిపివేసినట్లు నీటిపారుదల వర్గాలు తెలిపాయి.

## ఆ రైళ్లు కేటాయించండి: కె.లక్ష్మణ్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణకు తేజస్, హమ్‌సఫర్, అంత్యోదయ రైళ్లను కేటాయించాలని పీయూష్ గోయల్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ కోరారు. ఈమేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఎంఎంటీఎస్–2 ప్రాజెక్టుకు రాష్ట్రం తన వాటా నిధులివ్వకపోవటం తో పనుల్లో జాప్యం జరుగుతున్నందున ఆ నిధులు వచ్చేలా ప్రభుత్వంతో మాట్లాడాలని విన్నవించారు.




### జేఈఈ మెయిన్, నీట్, ఎంసెట్ విద్యార్థులకు

# సాక్షి మాక్ టెస్టులు



**సాక్షి, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మంది విద్యార్థుల లక్ష్యం ఇంజనీరింగ్ లేదా మెడిసిన్.. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు ప్రముఖ ఇంజనీరింగ్/మెడికల్ కాలేజీలో ప్రవేశం లభించాలని కోరుకుంటారు. అందుకు కోచింగ్ ఫీజుల కోసం ఎంతైనా ఖర్చు చేయడానికి వెనకాడటం లేదు. విద్యార్థులు సైతం తమ లక్ష్యం, తల్లిదండ్రుల ఆశయం నెరవేరేలా రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలైన ఐఐటీలు, నిట్‌లలో ప్రవేశానికి మార్గం వేసే జేఈఈ మెయిన్, తెలుగు రాష్ట్రాల స్థాయిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ కాలేజీల్లో అడ్మిషన్ కల్పించే ఎంసెట్, అలాగే దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి వీలు కల్పించే నీట్ పరీక్షలు త్వరలో జరుగనున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్ పొందేలా చేయూత అందించేందుకు సాక్షి ముందుకు వచ్చింది. నిపుణుల ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్, ఎంసెట్, నీట్ పరీక్షలకు మాక్ టెస్టులు నిర్వహించనుంది. పరీక్షకు కొద్దిరోజుల ముందు వాస్తవ పరీక్షలాంటి వాతావరణంలో జరిగే సాక్షి మాక్ టెస్టులు రాయడం ద్వారా.. విద్యార్థులు తమ ప్రిపరేషన్ స్థాయిని అంచనా వేసుకొని, ప్రిపరేషన్‌ను మరింత మెరుగుపర్చుకోవచ్చు. అంతేకాకుండా సాక్షి మాక్ టెస్టుల్లో ఉత్తమ ప్రతిభను చూపడం ద్వారా టాప్ టెన్ ర్యాంకర్లు ఆకర్షణీయ బహుమతులూ గెలుచుకోవచ్చు. పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.

### ఏ పరీక్ష ఎప్పుడంటే..

- సాక్షి జేఈఈ మెయిన్ పరీక్ష 25–3–2020 (బుధవారం)న ఆన్‌లైన్‌లో ఉదయం 09:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతుంది. రిజిస్ట్రేషన్లకు చివరి తేది: 15–3–2020.
- సాక్షి మాక్ ఎంసెట్ (ఇంజనీరింగ్ అండ్ అగ్రికల్చర్) పరీక్ష 12–4–2020, 13–4–2020 (ఆదివారం, సోమవారం)న ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొదటి సెషన్ ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ: 5–4–2020
- సాక్షి మాక్ నీట్ పరీక్ష 22–4–2020 (బుధవారం) ఆఫ్‌లైన్‌లో ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు జరుగుతుంది. రిజిస్ట్రేషన్లకు చివరి తేదీ: 15–4–2020.
- ఒక్కో పరీక్షకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.150. అభ్యర్థులు httpr://www.arenoane.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విజయవంతంగా దరఖాస్తులు పూర్తిచేసిన అభ్యర్థుల ఈ మెయిల్‌కు హాల్‌టికెట్ పంపుతారు.

**వివరాలకు సంప్రదించాల్సిన నంబర్లు:**

చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపూర్, నెల్లూరు: 9666697219
విజయవాడ, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి: 9912671555
తూర్పుగోదావరి, వైజాగ్, శ్రీకాకుళం, విజయనగరం: 9666283534
తెలంగాణ జిల్లాలు: 9505514424, 9666013544
గ్రేటర్ హైదరాబాద్: 9912035299, 9912671222

## హౌజింగ్‌బోర్డు భూములను పేదలకు కేటాయించాలి: సీపీఎం

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా హౌజింగ్‌బోర్డు కోసం సేకరించిన భూముల్లో మిగిలిన 871 ఎకరాలను పేదలకు ఇళ్ల నిర్మాణం, ఇంటి స్థలాల కోసం కేటాయించాలని సీపీఎం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ భూములు పట్టణాలకు ఆనుకొని ఉన్నందున వీటిని పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు అనుకూలంగా ఉన్నాయని ఓ ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వం పేదల భూములను బలవంతంగా సేకరించి అధిక లాభాలకు అమ్ముకోవడానికి పూనుకోవడం సరికాదని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు.






సాక్షి
బుధవారం, ఫిబ్రవరి, 19

# చర్చలతోనే పరిష్కారం

పౌరసత్వ సవరణ చట్టానికి(సీఏఏ) వ్యతిరేకంగా గత రెండు నెలలుగా దేశ రాజధానిలోని షహీన్‌బాగ్‌లో సాగుతున్న ఆందోళన సుప్రీంకోర్టు జోక్యంతో కొత్త మలుపు తిరిగిందని చెప్పాలి. ఆందోళనలు జరుగుతుంటే, నిరసనలు పెల్లుబుకుతుంటే సమస్యలను వినడానికి పాలకులు సిద్ధపడాలి. ఆందోళనకారులు చేస్తున్న డిమాండ్లలో సహేతుకమైనవి వుంటే నెరవేర్చడానికి, లేనిపక్షంలో నచ్చజెప్పడానికి ప్రయత్నించాలి. వారి కోర్కెలు అసమంజమైనవైతే కనీసం ఆ సంగతైనా చెప్పాలి. మొత్తానికి సమస్యలున్నాయని భావించే వారితో మాట్లాడాలి. అది ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రాథమిక లక్షణం. ఈమధ్య ఒక చానెల్‌తో మాట్లాడిన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆందోళనకారులతో చర్చించడానికి సిద్ధంగా వున్నామని ప్రకటించినప్పుడు అందరూ హర్షించారు. తాము అమిత్ షా కార్యాలయానికి వెళ్లి చర్చిస్తామని ఉద్యమకారులు కూడా ప్రకటించారు. ఒక ప్రతినిధి బృందంగా వెళ్లే ప్రయత్నం చేస్తే వారికి అనుమతి లభించేదేమో. కానీ ఉద్యమకారులు ఆ ప్రతిపాదన తిరస్కరించి దాదాపు అయిదు వేలమందితో ఊరేగింపుగా వెళ్తామని ప్రకటించారు. పోలీసులు అనుమతించకపోవడంతో అది కాస్తా మూలనబడింది. ఈ దశలో సర్వోన్నత న్యాయస్థానం తీసుకున్న చొరవ ప్రశంసనీయమైనది. ఉద్యమకారులతో చర్చించడం కోసం సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, న్యాయవాది సాధనా రామచంద్రన్, కేంద్ర సమాచార మాజీ కమిషనర్ వాజత్ హబీబుల్లాలతో ఒక కమిటీని ఏర్పాటు చేయడంతోపాటు వారంలోగా ఉద్యమకారులతో చర్చించి నివేదిక అందజేయాలని జస్టిస్ కిషన్ కౌల్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు గమనించదగ్గవి. నిరసన తెలియజేయడానికి పౌరులకుండే హక్కును ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలూ గుర్తించాయని చెబుతూ, దానిని అనుమతించాల్సిందేనని ధర్మాసనం తెలిపింది. అది పౌరులకుండే ప్రాథమిక హక్కని కూడా వివరించింది. అయితే నిరసన ఎక్కడ తెలియజేయాలన్న విచక్షణ ఉండాలని అభిప్రాయపడింది. ప్రజలు నిత్యం ఉపయోగించే రహదారిని దిగ్బంధించి నిరసనలు కొనసాగించడం ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. కోర్కెలు ఎంత సమంజసమైనవి అయినా రహదారుల దిగ్బంధం చేస్తూ పోయే ధోరణి ఎంతవరకూ సబబని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు ఆత్రుత అర్థం చేసుకోదగిందే. షహీన్‌బాగ్ నిరసనకారులు అంబులెన్స్‌లను సైతం అనుమతించడం లేదన్న సొలిసిటర్ జనరల్ ఫిర్యాదు విపరీతమైనదే కావొచ్చుగానీ, అక్కడ రహదారి దిగ్బంధించడం వల్ల సమీప ప్రాంతాలవారు సమస్యలు ఎదుర్కొంటున్నారన్న మాట వాస్తవం.

షహీన్‌బాగ్ నిరసనకు ఒక విలక్షణత ఉంది. ఈ ఉద్యమానికి సారథ్యం వహిస్తున్నది మహిళలే అయినా, వారిలో ప్రముఖులనదగ్గవారెవరూ లేరు. ఇందులో పాల్గొంటున్న వేలాదిమందిలో అత్యధికులు మహిళలు. వారిలో ముస్లిం మహిళలు ఎక్కువ. నెలల పిల్లలున్న తల్లుల నుంచి వృద్ధ మహిళల వరకూ అనేకులు అందులో పాలుపంచుకుంటున్నారు. వందేళ్లుగా ఎన్నడూ లేనంత స్థాయిలో చలి ఢిల్లీని వణికించినప్పుడు కూడా వారంతా రాత్రింబగళ్లు నిరసన శిబిరంలోనే ఉండిపోయారు. నిరసనల ఉద్దేశం ప్రధానంగా పదిమందికీ తమ గోడు వినబడాలన్నదే. సమస్యేమిటో అందరికీ తెలిస్తే, అర్థమైతే ప్రభుత్వాలపై ఒత్తిళ్లు వస్తాయని, తమ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని ఉద్యమంలో పాలుపంచుకునేవారు భావిస్తారు. పరిష్కారం సంగతి వదిలేస్తే షహీన్‌బాగ్ నిరసనోద్యమకారులు కోరుకుంటున్నదేమిటో దేశవ్యాప్తంగా ఇప్పుడు అందరికీ తెలిసిందన్నది వాస్తవం. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని దేశంలోని పలు నగరాలు, పట్టణాల్లో సైతం ధర్నా శిబిరాలు వెలిశాయి. ఆ ఆందోళనలపైనా, కేంద్రం తీసుకున్న నిర్ణయాల్లోని సహేతుకతపైనా అన్ని స్థాయిల్లో అనుకూలంగా, వ్యతిరేకంగా అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. తమకున్న మత విశ్వాసాలతో సంబంధం లేకుండా అనేకులు వాటిపై తమ వైఖరేమిటో చెబుతున్నారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు తాము ఎన్‌ఆర్‌సీ, సీఏఏలను అనుమతించబోమని, ఎన్‌పీఆర్‌ను ఒప్పుకునేది లేదని ప్రకటించడాన్ని ఈ నేపథ్యంలోనే చూడాలి. అదీగాక అస్సాంలో ఎన్‌ఆర్‌సీ నిర్వాకమేమిటో తెలిశాక అందరిలోనూ సందేహాలు అలుముకున్నాయి. కనుక షహీన్‌బాగ్ నిరసనల ఉద్దేశం నెరవేరిందని చెప్పాలి.

ప్రజల్ని ఒప్పించడం లేదా వారడుగుతున్న డిమాండ్లను పరిశీలించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవడమనేది ప్రభుత్వాల చేతుల్లోనే వుంటుంది. ప్రజలద్వారా ఎన్నికై అధికారంలోకొచ్చినవారికి అలాంటి నిర్ణయాలు తీసుకోవడమనేది ఒక అధికారం మాత్రమే కాదు...బాధ్యత కూడా. సుప్రీంకోర్టు ఇలాంటి అంశాల్లో కేవలం ఒక సంధానకర్తగా, దోహదకారిగా మాత్రమే వ్యవహరించగలదు. ఈ విషయంలో ధర్మాసనానికి స్పష్టత ఉంది. అందుకే చర్చలు జరిపే బాధ్యతను కార్యనిర్వాహకవర్గం తీసుకుని ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా మరో మాట కూడా చెప్పింది. 'ఈ సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నాం. ఇందులో విఫలమైతే ఏం చేయాలన్నది అధికారులకే విడిచిపెడతాం' అని తేటతెల్లం చేసింది. నిరసనలు చేస్తున్నవారు ఇంతక్రితం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్‌ను కలుసుకున్నారు. తమ కోర్కెలు వివరించారు. కానీ ఏం చేయాలన్నా కేంద్ర ప్రభుత్వమే చేయగలదు. షహీన్‌బాగ్ నిరసనలు శాంతియుతంగా సాగుతున్నాయి. కనుక వారితో చర్చించేందుకు కేంద్రానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు. అలాగే డిమాండ్లు నెరవేరేవరకూ ఉద్యమాన్ని ఆపకూడదని ఆందోళనకారులు అనుకుంటే సుప్రీంకోర్టు సూచించిన విధంగా నిరసన వేదికను మరో చోటకు మార్చుకోవడానికి వారు సిద్ధపడాలి. ఆ అవసరం లేకుండా చర్చల ద్వారా ఈ సమస్యకొక పరిష్కారాన్ని సాధించగలిగితే అది పాలకుల గౌరవాన్ని పెంచుతుంది.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, తిథి బ.ఏకాదశి సా.5.16 వరకు, తదుపరి ద్వాదశి నక్షత్రం మూల ఉ.8.44 వరకు,తదుపరి పూర్వాషాఢ వర్జ్యం సా.6.25 నుంచి 8.02 వరకు,దుర్ముహూర్తం ప.11.51 నుంచి 12.35 వరకు,అమృతఘడియలు..తె.4.10 నుంచి 5.45 వరకు.

**సూర్యోదయం :** 6.29
**సూర్యాస్తమయం:** 5.59
**రాహుకాలం :** ప. 12.00 నుంచి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు

# శిశుమరణాల్లో మనదే రికార్డు

రాజస్తాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని ఆరు ప్రభుత్వ ఆసుపత్రులలో 2019 డిసెంబర్ 1 నుంచి 500 శిశుమరణాలు చోటుచేసుకున్నాయని వార్తలు. రాజస్తాన్ కోటాలోని జేకే లోన్ ఆసుపత్రిలోనే 101 మంది శిశువులు హరీమన్నారు. జోధ్‌పూర్‌లోని ఉమైద్, ఎండీఎమ్ ఆసుపత్రులలో 102 మంది, బికనీర్‌లోని సర్దార్ పటేల్ మెడికల్ కాలేజ్‌లో 124 మంది శిశువులు మరణించడం విచారకరం. గుజరాత్ రాజ్‌కోట్‌లోని పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ ఆసుపత్రిలో 111 మంది, అహ్మదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో 85 మంది శిశువులు చనిపోయారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 2018లో 7,21,000 శిశుమరణాలు చోటుచేసుకున్నాయని అంచనా. అంటే సగటున రోజుకు 1,975 మంది శిశువులు చనిపోయినట్లు లెక్క.

శిశుమరణాల సమస్య ఒక్క కోటా సమస్యే కాదని గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై పనిచేస్తున్న మమతా కార్యనిర్వాహక డైరెక్టర్, శిశువైద్యుడు సునీల్ మెహ్రా పేర్కొన్నారు. 'ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగిన సౌకర్యాలు లేకపోవడం, రోగులను నిపుణులకు సిఫార్సు చేయడంలో జాప్యం, రవాణా సౌకర్యాల లేమి వంటి సంస్థాగత సమస్యలే శిశుమరణాలకు అధికంగా కారణాలవుతున్నాయి' అని అన్నారు. దేశవ్యాప్తంగా పిల్లలు, శిశువులు ఇంత అధికంగా ఎందుకు చనిపోతున్నారో అర్థం చేసుకోవడానికి డేటా విశ్లేషణ సంస్థ ఇండియాస్పెండ్ 13 రాష్ట్రాలకు చెందిన ఆరోగ్య డేటాను విశ్లేషించింది. బిహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్తాన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, అస్సాం వంటి పేద రాష్ట్రాలతోపాటు గుజరాత్, మహారాష్ట్ర వంటి సంపన్న రాష్ట్రాల ఆసుపత్రుల్లో కూడా శిశుమరణాలు సంభవిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. వీటితో పోలిస్తే గోవా, కేరళ, తమిళనాడులోనే శిశుమరణాలు తక్కువగా ఉన్న రాష్ట్రాలుగా నమోదయ్యాయి. ఆరోగ్య మౌలిక వసతులు, శిశు సంరక్షణ, గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, ప్రసవానంతర సంరక్షణ వంటి అంశాల్లో నాసిరకం నాణ్యత వంటివి శిశువుల ప్రాణాలను హరిస్తున్నాయని విశ్లేషణ చెబుతోంది.

పోషకాహార లోపం, పారిశుద్ధ్యం, రోగనిరోధకశక్తి వంటి వైద్యేతరమైన సమస్యలే శిశుమరణాలకు కారణమవుతున్నాయని ఢిల్లీలోని బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపా సిన్హా చెప్పారు. న్యూమోనియా వంటి ప్రాథమిక స్థాయిలోనే చికిత్స చేయదగిన ఇన్ఫెక్షన్ల వల్లే శిశుమరణాలు అధికంగా సంభవిస్తున్నాయి. అంటే వ్యాధి నిరోధక, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు కుప్పకూలిపోయినట్లు చెప్పవచ్చని ఆమె చెప్పారు.

### ప్రపంచంలోనే మరణాల రేటు అధికం

2018లో భారతదేశంలో అయిదేళ్ల లోపు పిల్లలు 8,82,00 మంది చనిపోయారు. ఇది ప్రపంచంలోనే అత్యధిక రేటు. భారత్‌లో అతిపెద్ద శిశుజనాభాలో అయిదేళ్లలోపు పిల్లల మరణాలు (1000 మంది శిశువుల్లో 37మంది) నమోదవుతున్నప్పటికీ ప్రపంచ సగటు శిశుమరణాల రేటు (39)తో పోలిస్తే తక్కువగానే ఉంది. 1990లో వెయ్యిమందికి 126 మంది పిల్లలు మరణిస్తున్న స్థాయినుంచి సగటు శిశుమరణాల రేటు తగ్గుముఖం పట్టింది.



పిల్లలకు అయిదేళ్లు రాకముందే ఎక్కువ మరణాలు మనదేశంలో సంభవిస్తున్నాయి. 2017లో సంవత్సరం వయసున్న పిల్లల్లో వెయ్యికి 33 మంది పిల్లలు చనిపోయారు. 11 ఏళ్లకు ముందు ఇది 42 శాతంగా ఉండేదని ప్రభుత్వ శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ తెలిపింది. అయితే రాష్ట్రాల వారీగా చూస్తే శిశుమరణాల విషయంలో భారీ వ్యత్యాసాలను గమనించవచ్చు. 2017లో నాగాలాండ్ అత్యంత తక్కువగా 7 శాతం, గోవా (9), కేరళ (10) శిశుమరణాల రేటును నమోదు చేయగా, మధ్యప్రదేశ్ 47 శాతం అత్యధిక రేటును నమోదు చేసింది.

### ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో విపరీతమైన రద్దీ

అయిదేళ్లలోపు శిశువుల మరణాల్లో కొత్తగా పుట్టిన శిశువులవే ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రసవానంతరం మాతా, శిశు ఆరోగ్య సంరక్షణలో నాణ్యతను కల్పించడం ద్వారా వీరిలో చాలామంది శిశువులను కాపాడవచ్చని యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ 2019 నివేదిక తెలిపింది.

దేశంలో సంస్థాగత ప్రసవాల రేటు 2005లో 38.7 శాతంతో పోలిస్తే 2015–16 నాటికి 78.9 శాతం పెరిగింది. కానీ ఈ ప్రసవాల రేటుకు అనుగుణంగా నవజాత శిశువుల సంరక్షణలో మౌలిక వసతుల కల్పన పెరగలేదని గుజరాత్ ఆనంద్‌లోని ప్రముఖ్‌స్వామి మెడికల్ కాలేజ్ శిశువైద్య శాఖ ప్రొఫెసర్ సోమశేఖర్ నింబాల్కర్ తెలిపారు. 28 రోజుల వయసు ఉన్న నవజాత శిశువుల్లోనే అత్యధిక మరణాలు (57.9 శాతం) సంభవించాయని దిలాన్సెట్‌లో ప్రచురితమైన 2019 అధ్యయనం చూపింది. కంగారూ కేర్ (అంటే తల్లితో అత్యంత సమీపంలో శిశువును ఉంచి వెచ్చదనాన్ని అందించడం, తల్లి పాలు తాపడం, ఇన్ఫెక్షన్ల నుంచి, శ్వాస సమస్యల నుంచి ప్రాథమిక సంరక్షణ కల్పించడం, తక్కువ ఖర్చుతో కూడిన పద్ధతుల ద్వారా ఈ చిన్నారుల మరణాలను అరికట్టవచ్చు.

జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ కింద నవజాత శిశు సంరక్షణ వ్యవస్థలను పిల్లలను ప్రసవించే అన్ని కేంద్రాల్లో ఏర్పర్చారు. అలాగే దేశవ్యాప్తంగా అన్ని జిల్లా ఆసుపత్రుల్లో ప్రాథమిక రెఫరల్ యూనిట్లను, ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ యూనిట్లను నెలకొల్పారు. కానీ ఈ శిశు సంరక్షణ కేంద్రాల్లో వాటి శక్తికిమించిన రోగులు వెల్లువెత్తుతున్నారు. పైగా వైద్యుల కొరత, ఆసుపత్రిలో పడకల కొరత, వైద్యసామగ్రిని సకాలంలో మరమ్మతు చేసే యంత్రాంగాల కొరత తారాస్థాయికి చేరినట్లు జర్నల్ ఆఫ్ పెరినెటాలజీలో ప్రచురితమైన 2016 అధ్యయనం పేర్కొంది.

83 శాతం కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో నవజాత శిశు కేంద్రాలు ఉంటుండగా, 59శాతం కేంద్రాల్లో ఆరోగ్య స్థిరీకరణ విభాగాలు లేవని 2018 గ్రామీణ ఆరోగ్య గణాంకాల నివేదిక తెలిపింది. ఇక కేరళ, మహారాష్ట్ర మినహా తక్కిన 13 రాష్ట్రాల్లోని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో శిశువైద్య నిపుణులు లేరు. దీంతో చాలామంది రోగులు జిల్లా ఆసుపత్రుల వంటి ప్రాదేశిక సంరక్షణ విభాగాల్లో చేరాల్సి వస్తోంది. దీంతో అప్పుడే పుట్టిన శిశువుల సంరక్షణ కేంద్రాల్లో తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. ఈ పరిస్థితి ఇన్ఫెక్షన్ల పెరుగుదలకు కారణమవుతోంది.

### పుట్టుకకు ముందే సమస్యలు

శిశు, పిల్లల మరణాల్లో గృహ సంపద, ప్రసూతి విద్య అనేవి ముఖ్యపాత్ర వహిస్తున్నాయి. విద్యావంత మహిళలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు పిల్లలకు మెరుగైన ఆరోగ్య పరిస్థితులను కల్పిస్తున్నాయని ఇండియాస్పెండ్ 2017 మార్చి 20న ప్రకటించింది. 20 శాతం సంపన్న గృహాల్లో పుట్టిన శిశువులు 20 శాతం నిరుపేద గృహాల్లో పుట్టిన శిశువుల కంటే మూడు రెట్లు ఎక్కువగా మనగలిగే పరిస్థితులు ఉంటున్నాయి. పదేళ్లవరకు మాత్రమే చదువుకుని, బాల్యవివాహాలు ఎక్కువగా చేసుకున్న మహిళలు ఉంటున్న మధ్యప్రదేశ్, అస్సాం, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ రాష్ట్రాల్లో శిశుమరణాలను అధికంగా నమోదు చేస్తున్నాయి. పైగా ఈ రాష్ట్రాల్లోని మహిళలకు రక్తహీనత, పోషకాహార లేమి, అధిక రక్తపోటు, ప్రసవానంతర మధుమేహంపై ప్రత్యేక సంరక్షణ చర్యలు అందుబాటులో లేవు. ప్రసవానంతర సంరక్షణ అతి తక్కువగా లభిస్తున్న రాష్ట్రాల్లో బిహార్ అగ్రగామిగా ఉంటోంది.

### ప్రసవసమయంలో సమస్యలు

అయిదు మంది పిల్లల్లో ఒక్కరు 205 కేజీలకంటే తక్కువ బరువుతో పుడుతున్నారు. ఇక సగంమంది పిల్లలు మాత్రమే ఆరునెలలపాటు తల్లి పాలు తాగగలుగుతున్నారు. తల్లిపాలకు నోచుకున్న పిల్లల ఆరోగ్యం మాత్రం గణనీయంగా మెరుగుపడుతోంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అతిపెద్ద సమస్య ఏదంటే తక్కువ బరువుతో పుట్టడం, తల్లికి పోషకాహార లేమి ఉండటమేనని ఐఐటీ బాంబేకి చెందిన గ్రామీణప్రాంతాల సాంకేతిక ప్రత్యామ్నాయాల కేంద్రం శిశువైద్య నిపుణురాలు రూపల్ దలాల్ చెబుతున్నారు. శిశువుకు జన్మనిచ్చిన సమయంలో బిడ్డకు పాలుతాపడంపై గ్రామీణ తల్లులకు సరైన మార్గదర్శకత్వం లేదు. దీనితో తక్కువ బరువుతో పుట్టిన పిల్లలకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటోందని డాక్టర్ రూపల్ తెలిపారు. శిశువు పుట్టిన తర్వాత పాలు తాపడంలో జాప్యం జరిగితే అలాంటి పిల్లల ప్రాణాలకే ప్రమాదం సంభవిస్తుందని, తల్లిపాలకు ఎంత సమయం దూరంగా ఉంటే అంత ఎక్కువ ప్రమాదం నవజాత శిశువులకు కలిగే అవకాశం ఉంటుందని యూనిసెఫ్ నివేదిక హెచ్చరించింది. ఉత్తరప్రదేశ్‌లో పుట్టిన నలుగురు బిడ్డల్లో ఒక్కరికి మాత్రమే గంటలోపే తల్లిపాలు అందుతుండగా రాజస్తాన్‌లో 28.4 శాతం పిల్లలు తల్లిపాలు లేకుండా గంటపైగా గడుపుతున్నారు. ఈ రెండు రాష్ట్రాల్లోనే పిల్లల అధిక మరణాల రేటును చూడవచ్చు.

ఇక పిల్లలకు టీకాలు తగినంత మేరకు లభిస్తున్న రాష్ట్రాల్లో తమిళనాడు (69.7శాతం), గోవా (88.4శాతం) అగ్రస్థానంలో ఉంటున్నాయి. అస్సాం (47.1 శాతం), గుజరాత్ (50.4శాతం), ఉత్తరప్రదేశ్ (51.1 శాతం), రాజస్తాన్ (45.2 శాతం) రాష్ట్రాలు పిల్లలకు రోగనిరోధక శక్తి అత్యల్పంగా ఉన్న జాబితాలో అన్నిటికంటే దిగువన ఉంటున్నాయి. ఇకపోతే 2017లో ప్రచురితమైన ఇండియాస్పెండ్ నివేదిక ప్రకారం అయిదేళ్లలోపు పిల్లల్లో అధికమరణాలకు పోషకాహార లేమి ప్రధాన కారణమని తెలిసింది. ఇది మొత్తం శిశుమరణాల్లో 68.2 శాతంగా ఉంటోంది.

స్వగతా యాదవర్, శ్రేయా రామన్
ప్రముఖ డేటా విశ్లేషకులు
'ది వైర్' సౌజన్యంతో..

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### హే రామ్



"గౌరవంతో, అభిమానంతో హే రామ్ సినిమాను గుర్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. 20 ఏళ్ల క్రితం ఆ సినిమా రూపొందడానికి కారణమైన అన్ని విభాగాల అధిపతులతో సహా షారూఖ్ ఖాన్, నసీరుద్దీన్, రాణీ ముఖర్జీ, హేమమాలినికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నా. చంద్రహాసన్, మనోహర్ శామ్ జోషి, ఓంపురి, మోహన్ గోఖలే, గిరీష్ కర్నాడ్, వాలి, హెచ్.శ్రీధర్, రేణు సలూజా, జ్ఞాన్ కూట్టన్, విక్రమ్ ధర్మ తదితరులు ఆ సంతోషాన్ని పంచుకోవడానికి ఇప్పుడు మన మధ్యన లేకపోవడం విచారకరం."

– కమలహాసన్, నటుడు

### వీసా



"నాకు వీసా మంజూరైన తరువాత భారత ప్రభుత్వం ఎందుకు రద్దు చేసింది? భారత్ చేరుకున్నాక వీసా తీసుకునే సౌకర్యాన్ని వాళ్లు నాకెందుకు కల్పించరు? ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని నేను ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నారా?"

– డెబ్బీ అబ్రహమ్స్, బ్రిటన్ ఎంపీ

### ప్రార్థన



"పరీక్షలు రాయబోతున్నవారి కోసం, ఇప్పటికే రాస్తున్నవారి కోసం ప్రార్థన చేస్తున్నా. కష్టపడి చదవండి, మీరు ఎంత కష్టపడగలిగితే అంత కష్టపడి చదవండి, పరీక్షలు బాగా రాయండి.. అంతా మంచే జరుగుతుంది. ఇక్కడితో ముగిసిపోయినట్టేమీ కాదు, ఎప్పుడూ మరోసారి ప్రయత్నించే అవకాశం ఉంటుంది. గాడ్ బ్లెస్ యూ."

– రవీనా టాండన్, నటి

### సమర్థన



"ఈ నెల 15న సుఖ్‌దేవ్ విహార్ దగ్గర విధ్వంసంలో బస్సును తగులబెట్టారు. దయచేసి విచారణ చేసి, దోషులను శిక్షించండి. అంతేకానీ, జామియా మిలియా ఇస్లామియాలో జరిగిన దాన్ని మాత్రం సమర్థించుకోకండి. పోలీసులు యూనివర్సిటీ క్యాంపస్‌లోకి ప్రవేశించి, విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టారు. పోలీసులు సీసీటీవీ కెమెరాతో సహా ఆస్తులను ధ్వంసం చేశారు. ఇప్పుడు పోలీసులే పోలీసులపై విచారణ జరుపుతారా?"

– జెబావర్సీ, జర్నలిస్ట్

### పరీక్ష



"ఒక బోర్డు పరీక్ష అనంతరం నా సోదరికీ, ఆమె కుమార్తెకూ మధ్య నిజంగా జరిగిన సంభాషణ ఇది.

**తల్లి:** పేపర్ ఎలా ఉంది? **కూతురు:** బానే ఉంది (ముభావంగా అంది)

**తల్లి:** ఓహ్ గుడ్ గుడ్ (కాస్త ఊపిరి పీల్చుకుంటూ) **కూతురు:** గుడ్ గుడ్ కాదు, గుడ్ మాత్రమే (తల్లి కళ్లలోకి చూస్తూ)"

– స్మితా ప్రకాష్, జర్నలిస్ట్

### గ్రే



"ఆర్థిక కార్యాచరణ మండలి పాకిస్తాన్‌ను గ్రే లిస్ట్ లోనే ఉంచాలని నిర్ణయించినట్టు తెలిసింది. ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద సంస్థలకు నిధులు సమకూర్చే దేశాలను పరిశీలించే ఈ సంస్థ శుక్రవారం సమావేశం అనంతరం తుది నిర్ణయం వెల్లడిస్తుంది."

– నిధి రజ్దానీ, జర్నలిస్ట్

## ఇన్‌బాక్స్

### బహుజన చక్రవర్తి ఛత్రపతి శివాజీ

1630 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని కున్బీకాపు వ్యవసాయ కులం(ఓబీసీ)లో పుట్టిన శివాజీ ఏ సింహాసన వారసత్వం లేకుండా స్వశక్తితో రాజ్యాన్ని స్థాపించిన మహా వీరుడు. ప్రజలు తమదిగా భావించే స్వరాజ్యంలో రైతులు, స్త్రీలు, దళితులు, గిరిజనులు, సామాన్యులను ఎలా భాగస్వామ్యం చేయాలో; బహుజన రాజ్య నిర్మాణం ఎలా ఉండాలి అనే ప్రణాళికకి ఆయన పాలనా విధానం మాతృక లాంటిది.



జాతీయ భావన లేని, దేశ ప్రేమ లేని, విదేశీ ఆర్య బ్రాహ్మణీయ ఆధిపత్య గుంపు, తమ స్వార్థం కోసం ఏ కొత్త రాజు వచ్చినా పాదాల చెంత మోకరిల్లి విధేయతను ప్రకటించుకుంటూ కులకర్ణిలుగా, దేశ్‌ముఖ్, దేశ్‌పాండే, జాగీర్‌దారులుగా తమకు నచ్చిన రీతిలో పాలన సాగిస్తూ, దేశాన్ని బానిసత్వంలో ఉంచుతూ, ప్రజలను, రైతులను వేధిస్తున్నవారిని అణచివేసి సామాన్యులకు ఈ దేశం మీద ప్రేమ కల్పించిన గొప్ప వ్యక్తి ఛత్రపతి శివాజీ మహారాజ్.

శివాజీ దళితులని సైన్యంలోకి తీసుకుని వారిని దుర్గాధిపతులని చేశాడు. గూఢచారి విభాగం అధిపతి బాహిర్జీ నాయక్ గిరిజన రామోషి తెగ వ్యక్తి. సముద్రంలో చేపలు పట్టే కోలీ, సొంకాలీ, భండారీ లాంటి బెస్త కులాల మట్టి మనుషులని నావికా దళ సైన్యంగా మార్చాడు. శివాజీ రాజ్యంలో జూన్ నుండి అక్టోబర్ నాటికి పంట చేతికి వచ్చినంక రైతులందరూ దసరాకి సైనిక శిక్షణ తీసుకుని సంక్రాంతి నుండి యుద్ధాలలో పాల్గొని శివాజీ సామ్రాజ్యాన్ని విస్తరింపచేశారు. మహా చక్రవర్తి అయిన శివాజీని జీవితాంతం వెంటాడిన బ్రాహ్మణవాదం, ఆ తర్వాత కాలంలో తన పబ్బం గడుపుకోవడానికి శివాజీని ముస్లిం వ్యతిరేకిగా, కరడుగట్టిన హిందూ మతాభిమానిగా చిత్రించి చరిత్రని వక్రీకరించింది.

(నేడు శివాజీ 390వ జయంతి)

–ఇట్యాల వెంకటకిషన్ శాక్య
9908198484

# కొత్త రూపంలో పాత ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు

సందర్భం



కొవ్వూరి త్రినాథరెడ్డి

కొన్నేళ్లక్రితం సహకార రంగ బ్యాంకులన్నీ తీవ్రంగా వ్యతిరేకించిన ఫైనాన్షియల్ రిజల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డీఐ) బిల్లు కొత్త రూపంలో మళ్లీ రాబోతోంది. ఈ నెల మొదట్లో బడ్జెట్ ప్రవేశపెట్టాక విలేకరులతో మాట్లాడిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లులో మార్పులు చేర్పులు చేసి కొత్త రూపంలో దాన్ని తీసుకొస్తామని చెప్పారు. అయితే బిల్లు ఎప్పుడు ప్రవేశపెడతామన్నది ఆమె చెప్పలేదు. 2017లో ఆ బిల్లును చట్టంగా మార్చాలని ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అందులో ఉన్న 'బెయిల్ ఇన్' అనే పదంపై అందరికీ తీవ్ర అభ్యంతరాలున్నాయి. బ్యాంకు దివాలా తీసే పరిస్థితుల్లో ఆ బ్యాంకులోవున్న డిపాజిట్లలో కొంత భాగంగానీ, మొత్తంగా గానీ డిపాజిట్‌దారునికి తదనంతర కాలంలో ఇవ్వొచ్చునని ఆ క్లాజు చెబుతోంది. ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులు, సాధారణ ప్రజలకు చెందిన 68 శాతం డిపాజిట్లు బ్యాంకుల్లో ఉన్నాయి. నెలనెలా ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీతో వారు బతుకీడుస్తున్నారు. కనుకనే ఆ బిల్లుపై అంత వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు ఫైనాన్స్ సెక్యూరిటీ డెవలప్‌మెంట్ రిజల్యూషన్(ఎఫ్‌ఎస్‌డీఆర్) పేరిట కొత్త బిల్లుకు రూపకల్పన చేస్తున్నారు. కొత్త సీసాలో పాత సారా అన్నట్టు స్వల్ప మార్పులు చేసి, బిల్లు పేరు మార్చి, 'బెయిల్ ఇన్' అనే పదం తొలగించి అంతకన్నా ప్రమాదకరమైన అంశాలతో దీన్ని రూపొందించారు. ఇది చట్టమైతే ఫైనాన్స్ సెక్యూరిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌ఎస్‌డీఏ) పేరిట ఒక నియంత్రణ సంస్థ ఏర్పాటవుతుంది. ఒక ఫైనాన్స్ సంస్థ నష్టాల బారిన పడితే ఆ సంస్థకున్న డిపాజిట్లను వినియోగించి ఆ నష్టాలను పూడ్చివేయడానికి లేదా అదే డిపాజిట్లతో కొత్త వ్యాపార సంస్థను నెలకొల్పడానికి ఆ నియంత్రణ సంస్థకు అధికారం వుంటుంది. డిపాజిట్ల నుంచి కొంత లేదా పూర్తి మొత్తం తీసుకుని ఎప్పుడైనా తిరిగిచ్చే వీలు వుంటుంది. ఈ బిల్లు చట్టమైతే స్వతంత్ర ప్రతిపత్తిగల రిజర్వ్ బ్యాంక్ నిర్వీర్యమవుతుంది. బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ సంస్థల నియంత్రణ ఆర్‌బీఐ పరిధి నుంచి అథారిటీకి వెళ్తుంది. ఇది చాలా ప్రమాదకరమైనది.

ప్రస్తుతం బ్యాంకులకు రావాల్సిన రుణాల్లో కార్పొరేట్ సంస్థలు ఎగవేసినవే 86 శాతం వరకూ వున్నాయి. మిగిలిన 14 శాతం వ్యవసాయదారులు, చిన్న పరిశ్రమలవారు తీసుకున్నవే. ఇప్పటికైతే అన్ని బ్యాంకుల నిరర్థక ఆస్తులు(అంటే పారు బాకీలు) 9 శాతం( అంటే రూ. 8 లక్షల కోట్లు) అని చెబుతున్నారు. వచ్చే నెలకు ఈ మొత్తం పది లక్షల కోట్లు ఉండొచ్చునని నిపుణుల అంచనా. బ్యాంకు డిపాజిట్లపై ఇప్పటివరకూ వున్న రూ. లక్ష గ్యారంటీని రూ. 5 లక్షలకు పెంచామని కేంద్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంది. కానీ ఇప్పుడు రూపొందిస్తున్న బిల్లులోని అంశాలు అందుకు అనుగుణంగా లేవు. డిపాజిట్‌దారునికి ఇందులో వున్న రక్షణ ఏమిటో అర్థంకాని పరిస్థితివుంది. ఈమధ్య టీఎంసీ బ్యాంకు, మరి కొన్ని ఫైనాన్స్ సంస్థలు దివాలా తీసి డిపాజిట్‌దారులకు శఠగోపం పెట్టిన నేపథ్యంలో అందరిలో ఆందోళన నెలకొంది.

తాజా బిల్లులో అథారిటీకి విస్తృతమైన అధికారాలున్నాయి. ఈ బిల్లు చట్టమైతే బ్యాంకులకు ఉద్దీపన ప్యాకేజీలు వుండవు. వాస్తవానికి అలాంటి ఉద్దీపన ప్యాకేజీలు ఈమధ్య బాగా తగ్గిపోయాయి. నష్టజాతక బ్యాంకులకు రూ. 2 లక్షల 11 వేల కోట్లు ఇస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ ఇచ్చింది రూ. 95,000 కోట్లు మాత్రమే. చాలా బ్యాంకులు భారీ నష్టాల్లో నడుస్తున్నాయి. అప్పులు ఎగ్గొట్టేవారిపై కఠిన చర్యలు అమలవుతుంటే ఎవరూ బాకీలు ఎగ్గొట్టడానికి సాహసించరు. కానీ మన దేశంలో ఆ పరిస్థితులున్నాయా? లేవు కాబట్టే పారు బాకీలు వసూలు కావడం అసాధ్యం. విజయ్ మాల్యా, నీరవ్ మోదీ వంటివారు రుణాలు తీసుకుని, చెల్లించే సమయం వచ్చేసరికి చడీచప్పుడూ లేకుండా విదేశాలకు పరారయ్యారు. గత రెండేళ్లలో కార్పొరేట్ సంస్థలు చెల్లించాల్సిన బాకీలు భారీయెత్తున రద్దయ్యాయి. ఇలాంటి చర్యలు తీసుకోవాల్సివచ్చినప్పుడు ఉద్దీపన ప్యాకేజీలు ఇవ్వకుండా వుండటానికే తాజా బిల్లుకు రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటికే లాభాలు ఆర్జిస్తున్న ఎల్‌ఐసీ వంటి సంస్థ ప్రైవేటీకరణకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడుతోంది. ఇక ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు ఏ రూపంలో వచ్చినా పరిస్థితి మరింత అధ్వానమవుతుంది. కనుక ఇలాంటి ఆలోచన మానుకోవడం ఉత్తమం.

వ్యాసకర్త ఉమ్మడి ఏపీ నీటి సంఘాల సమాఖ్య
మాజీ ప్రధాన కార్యదర్శి
ఫోన్: 9440204323

## స్వచ్ఛమైన శత్రువు

పరిచయమున్న మిత్రులకన్నా స్వచ్ఛమైన శత్రువే ఉన్నతమైనవాడు. శత్రువు నేరుగా దాడి చేస్తాడు. కానీ మిత్రుడు అనుకోని చోట అనుకోని రీతిలో దాడి చేసి దెబ్బతీస్తాడు. శత్రువుని గుర్తుపట్టొచ్చు, కానీ మిత్రుడిని గుర్తుపట్టలేం. శత్రువు కంచె ఉన్న ముల్లు. మిత్రుడు మట్టిలో దాగి ఉన్న ముల్లు. విషం మన ప్రాణాలు తీస్తుందని తెలుసు. అమృత విషం మనకు తెలియకుండానే మన ప్రాణం తీస్తుంది. చీకట్లో నల్ల సంచీని తెలుసుకోవడం కష్టం. స్నేహమనే మత్తులో మిత్రుడి వ్యవహారశైలిని గుర్తుపట్టడం కఠినం. మిత్రుడూ మనిషే. శత్రువూ మనిషే. భగవంతుడు సృష్టిలో మిత్రుడూ శత్రువూ రెండు రూపాలు. మనిషి ఈ రెండింటికీ మధ్యలో ఉంటాడు. గుణం మంచిదై ఉన్నప్పుడు దేవుడవుతాడు. అలా అనిపిస్తాడుకూడా. ఆ గుణమే ముడుచుకుపోయినప్పుడు మృగమవుతాడు. మృగాన్ని మిత్రుడిగా చేసుకునే కన్నా దైవాన్ని శత్రువుగా చేసుకోవడం మేలు.



జ్యోతిర్మయం

దేవుడా, ఇతను మిత్రుడు... అతను శత్రువు... అని నాకు వేరు చూసి చూపాల్సిన బాధ్యత నీదే. ఎవరికెంత దూరంలో ఉండాలో నువ్వే నన్ను ఆలోచించుకునేలా చెయ్యి. నా శత్రువులను నేను చూసుకుంటాను. మిత్రుల నుంచి నన్ను రక్షించు అనుకోవడం ఓ ప్రార్థనే అవుతుంది. ఇష్టమున్నా లేకున్నా బొంగరం అనేది ఆడాల్సిందే. అయితే బొంగరం తానుగా ఆడదు. ఆడించేవారిని బట్టి ఆడుతుంది. అది విధిరాత. తాడును తిప్పితే ఆడాల్సిన బొంగరమే మనిషి. ఆ తాడు తిప్పే చేతులను బట్టి ఉంటుంది. దానినిబట్టి కష్టసుఖాలు, జయాపజయాలు ఉంటాయి. ఆశ అనే ఊయలలో ఆడనిదెవరు...ఆశనేది ఎప్పుడూ ముందువెనుకలుగా ఉంటుంది. నిజానికి ఆశే మనందరినీ నడిపిస్తుంది. అందుకే సముద్రమంత దొరికినా ఉబ్బితబ్బిబ్బు అయిపోకూడదు. ఆవగింజంతే దొరికినా కలత చెందకూడదు. హృదయంలోని వెలుగే ప్రపంచం. అదే దేవుడు. అదే సర్వమూ. అది స్పష్టమైన క్షణంలో బాధలన్నీ తొలగిపోతాయి. ప్రపంచం రెండు విధాలుగా నడుస్తుంది. అవి, తప్పు. ఒప్పు. అయితే ఏది తప్పు ఏదిఒప్పు అనేది వారివారి మనసును బట్టి ఉంటుంది. కనుక అన్ని కలతలకూ కలవరాలకూ ఒకటే మందు. విచక్షణ, చైతన్యం ముఖ్యం.

–యామిజాల జగదీశ్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899



# రెడీ టు కమాండ్


తనయుడు శివాజీతో జిజియాబాయి

**ఛత్రపతి శివాజీకి జిజియాబాయి జన్మనిచ్చిన రోజు ఇది. జన్మను మాత్రమే ఇవ్వలేదు జిజియా. జన్మభూమిని కాపాడే శౌర్యాన్ని ఇచ్చింది. స్త్రీలను, పరమతాలను గౌరవించడం నేర్పింది. భారత, రామాయణాల్ని చదివించింది. బలి చక్రవర్తి గాథల్ని వినిపించింది. యుద్ధతంత్రాలలో నిష్ణాతుడిని చేసి, ఖడ్గాన్ని చేతికి ఇచ్చింది. శివాజీ ఖడ్గధారకు అంతటి పదును తల్లి పట్టిన పాల వల్లనే! అతడొక గొప్పచక్రవర్తి అయ్యాడంటే.. ఆమె ఒక ధీశాలి అయిన తల్లి అవడం వల్లనే!**

**మ**గపిల్లల్ని గొప్ప యోధులుగా తీర్చిదిద్దిన తల్లులే కాదు, గొప్ప యోధులై.. దేశమాతను కాపాడుకున్న ఆడబిడ్డలూ మన దేశ చరిత్రలో ఎందరో ఉన్నారు. రాణీ లక్ష్మీబాయి, రాణీ పద్మిని, రజియా సుల్తానా, అహల్యాబాయ్ హోల్కర్, మాతా భాగ్ కౌర్, ఒనకె ఓబవ్వ, కేలడి చెన్నమ్మ, బెలవాడి మల్లమ్మ, అబ్బక్క రాణి.. ఎన్ని యుగాలకైనా ధ్వని తీవ్రత క్షీణించని శంఖారావాలు.

పునీతా అరోరా, పద్మావతీ బందోపాధ్యాయ, మిథాలి మధుమిత, ప్రియా ఝింగన్, దివ్యా అజిత్ కుమార్, నివేదిత చౌదరి, అంజనా బాధురియా, ప్రియా సేవమ్‌వాల్, దీపికా మిశ్రా, సోఫియా ఖురేషి, శాంతి టిగ్గా, గనెవె లాల్జీ, గంజన్ సక్సేనా, అవని చతుర్వేది, మోహనాసింగ్, భావనా కాంత్.. తానియా శేర్గిల్.. వర్తమాన రక్షణదళ మహిళా క్షిపణులు.


మాతా భాగ్ కౌర్

ఐక్యరాజ్యసమితి భారతదళ సభ్యులుగా ఆఫ్రికా దేశాలలో, భారత రక్షణ సేనానులుగా పొరుగు దేశాల్లో.. శాంతిని స్థాపించి వచ్చిన లెఫ్ట్‌నెంట్ అనువందన జగ్గీ, మేజర్ గోపికా భట్టీ, మేజర్ మధు రాణా, మేజర్, మేజర్ ప్రీతీసింగ్, మేజర్ అనూజా యాదవ్.. యుద్ధభూముల్లో స్త్రీ శక్తిని చాటిన అస్త్రాలు.

మహిళల్ని ఆర్మీలోకి కమాండర్‌లుగా తీసుకోవడం సాధ్యం కాదు అని సుప్రీంకోర్టులో సోమవారం కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నప్పుడు.. 'ఎందుకు సాధ్యం కాదూ! సాధ్యం చేసిన, సాధ్యం చేస్తున్న వాళ్ల మాటేమిటి?' అంటూ పైన ఉదహరించిన వారిలో పదమూడు మంది వర్తమాన మహిళా యోధుల పేర్లను సుప్రీంకోర్టు జడ్జిలు ప్రస్తావించారు. మూడు నెలల్లోగా మహిళల్ని కమాండింగ్ పోస్టులోకి తీసుకోవడం ప్రారంభించాలని తీర్పు చెప్పారు. సైన్యంలోని యుద్ధ విధుల్లో పని చేయాలన్న తపన ఉన్న యువతులకు ఇది ఉత్సాహాన్నిచ్చే తీర్పు.

• • •

తొమ్మిదేళ్ల క్రితమే ఢిల్లీ హైకోర్టు ఇలాంటి తీర్పు ఇచ్చినప్పటికీ, తీర్పును అమలు చేసేందుకు ప్రభుత్వం సంశయించింది. శత్రువుకు ప్రత్యక్షంగా అందుబాటులో ఉండని ఎయిర్‌ఫోర్స్‌లో, నేవీలో పర్వాలేదు కానీ.. శత్రువుకు ఎదురుగా వెళ్లి పోరాడవలసిన సైనికుల బృందానికి మహిళా కమాండర్‌లని సేనానులుగా పెట్టడం మంచిది కాదు అని ప్రభుత్వ వాదన. వాదన కాదు.. సంశయం! సంకోచం! సందేహం! మహిళల దేహ ధర్మాలు.. యుద్ధ ధర్మాలను సక్రమంగా నెరవేర్చనివ్వవని, మగ సైనికులు మహిళా కమాండర్ మాట వినరనీ, వీళ్లు బట్టలు మార్చుకుంటుంటే వాళ్లు తొంగిచూస్తుంటారనీ, శత్రువు చేతికి మన మహిళ చిక్కితే దేశ ప్రజల హృదయ స్పందనలు హద్దులు, సరిహద్దులు మీరే ప్రమాదం ఉందనీ స్వయంగా ఆర్మీ చీఫే అన్నారు.


ఐరాస విధుల్లో భారత మహిళా జవాన్లు

అయితే.. ''ఇవన్నీ మీరు ఊహించుకుంటున్నవే కానీ.. కర్తవ్య నిర్వహణలో కమాండ్ చేసేందుకు మహిళలు ఎప్పుడూ సంసిద్ధంగానే ఉంటారు'' అని తీర్పు వెలువరించడానికి ముందు సుప్రీం జడ్జిలు వ్యాఖ్యానించారు.

దేశ రక్షణకు ఉవ్విళ్లూరుతున్న యువతుల్ని నిరుత్సాహపరిచేందుకు మనల్ని ప్రేరేపిస్తున్నది వాళ్ల రక్షణ, వాళ్ల భద్రత మాత్రమేనని అనిపిస్తున్నప్పటికీ దానివెనుక తెలియకుండా ఉన్నది వివక్ష మాత్రమే. అది ఉద్దేశపూర్వకమైన వివక్ష కాకపోవచ్చు. 'స్త్రీ, పురుషుడు సమానం కాదు' అనే ఆదిమ భావన నుంచి నేటి ఆధునిక సమాజం కూడా బయటపడలేకపోతోంది. ఇక ఆర్మీలోనైతే చెప్పే పని లేదు. సైనిక పటాలాలను పురుషుడు మాత్రమే నియంత్రించగలడనీ, సమర వ్యూహాలు, ప్రతిభాపాటవాలు పురుషుడికి మాత్రమే ఉంటాయని దివి నుంచి భువికి ఎవరో చెప్పి పంపించినట్లుగా స్థిరపడిపోయింది. మహిళకు అవకాశం రాక (ఇవ్వక) పురుషుడు దేశ రక్షకుడయ్యాడు కానీ.. దేశ రక్షణ బాధ్యతను మోసే బలం మహిళలకు లేదని కాదు.


రాణి లక్ష్మీబాయి


రజియా సుల్తానా

• • •

భారతదేశ రక్షణ వ్యవస్థలోని సైనిక, వైమానిక, నావికా దళాలలో రెండు రకాలైన నియామకాలు ఉంటాయి. షార్ట్ సర్వీస్ కమిషన్. పర్మినెంట్ కమిషన్. షార్ట్ సర్వీస్‌లో విధి నిర్వహణ పదేళ్లు మాత్రమే. సామర్థ్యాన్ని బట్టి మరో నాలుగేళ్ల పొడిగింపు ఉంటుంది. పర్మినెంట్ సర్వీసులో ఉన్నవారు పదవీ విరమణ వయసు వచ్చేవరకు విధుల్లో ఉండొచ్చు. అయితే మహిళల్ని ఉదారంగా రక్షణ దళాల్లోకి తీసుకుంటున్న ప్రభుత్వం.. అంతే ఔదార్యంతో వారిని పర్మినెంట్ కమిషన్‌లోకి తీసుకోవడం లేదు. కోర్టులో దీనిపై తొమ్మిదేళ్లుగా సాగుతూ వస్తున్న వాదోపవాదనల్లోనే.. ఇప్పుడు తాజాగా సుప్రీంకోర్టు మహిళల్ని కూడా పర్మినెంట్ కమిషన్‌లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చింది. దీంతో దళాల్ని ముందుకు నడిపించే (కమాండింగ్) బాధ్యతల్లోకి అతి త్వరలోనే మహిళలూ రాబోతున్నారు.


సోఫియా ఖురేషి

ఈ కేసులో ప్రభుత్వం చేసిన ముఖ్యవాదన.. 'గ్రామాల నుంచి వచ్చిన మగ జవానులు మహిళా కమాండ్ మాట వినరు.. దాంతో యుద్ధ సమయాలలో శత్రువును కట్టడి చెయ్యడం మనకు కష్టం అవుతుంది. అది దేశ భద్రతకే ప్రమాదం..' అని!

1992లో భారత సైన్యంలో చేరిన 25 మంది మహిళా అధికారులలో తొలి కేడెట్ అయిన మేజర్ ప్రియా ఝింగన్.. మొన్నటి సుప్రీం కోర్టు తీర్పుకు ఒకరోజు ముందు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మన ప్రభుత్వ వాదనకు తగిన సమాధానమే చెప్పారు. ''జవాన్లు మాట వినరని మీరే అనడం ద్వారా.. 'మహిళా కమాండర్ మాట వినొద్దు' అని మీరు చెబుతున్నట్లుగా ఉంది'' అన్నారు ఝింగన్.


ప్రియా ఝింగన్

ఏ సిపాయి అయినా కమాండర్ మాట వినకపోతే సైనిక చట్టాల ప్రకారం పనిష్మెంట్‌లు ఉంటాయి. పనిష్మెంట్ ఉంటుందన్న భయం ఉంటే.. పై అధికారి పురుషుడైనా, మహిళ అయినా మాట వినే తీరుతారు. 'మహిళలు కుటుంబం కోసం యుద్ధరంగాన్ని కాదనుకుని పోతారు' అని మరొక వాదన. అదీ నిజం కాదు. సమర్థతతో, అంకితభావంతో, త్యాగనిరతితో ఏ బాధ్యతనైనా నిర్వర్తించే మనోబలం, నిబద్ధత మహిళల్లో ఉన్నాయి కనుకనే ప్రపంచ వ్యాప్తంగా పెద్ద పెద్ద వ్యవస్థలు విజయవంతంగా, నిరంతరాయంగా నడుస్తున్నాయి.

**భా**రతీయ సైనికదళం నూట ఇరవై నాలుగేళ్లుగా ఉంది. అంతకు ఏడేళ్ల ముందు నుంచే సైన్యం కోసం మహిళా నర్సుల సేవలు సిద్ధంగా ఉన్నాయి! మొదటి, రెండు ప్రపంచ యుద్ధాలలో భారత సైన్యంలోని నర్సులు మూడు వందల యాభై మందికి పైగా మరణించడమో, బందీలుగా శత్రువుల చేతికి చిక్కడమో జరిగింది. మరికొందరు అసలు ఏమైపోయారో కూడా తెలీదు. ఆ తర్వాత నలభై ఏడేళ్లకు గానీ మహిళల్ని వైద్యేతర విభాగాల్లోకి తీసుకునే చొరవ చేయలేకపోయింది భారత సైన్యం. తొలిసారి 1992లో నాన్-మెడికల్ విధుల్లోకి మహిళలు ప్రవేశించారు. తర్వాత పదిహేనేళ్లకు మన దేశం నుంచి ఐక్యరాజ్య సమితి తరఫున వందమందికిపైగా మహిళా పోలీసులు శాంతిస్థాపన కోసం లైబీరియా వెళ్లి సమర్థంగా విధులు నిర్వర్తించి వచ్చారు. 2014 నాటికి భారతీయ సైనిక దళంలో 3 శాతానికి, నావికాదళంలో 2.8 శాతానికి, వైమానిక దళంలో 8.5 శాతానికి మహిళ సంఖ్య పెరిగింది. 2015లో తొలిసారి ఫైటర్ పైలట్‌లుగా మహిళలు యుద్ధవిధుల్లోకీ వచ్చేశారు.

## ఫ్రెండ్లీ పీసీఓఎస్

# ఇద్దరు అమ్మాయిలు

''**బెం**గళూరు నీళ్లకు కాబోలు జుట్టంతా రాలిపోతోంది..'' తల స్నానం చేసి జుట్టుకు హెయిర్ డ్రయర్ పెడుతూ అన్నది నమ్రతా జార్జ్. ''ఓసారి ట్రైకాలజిస్ట్‌ను కలవాలి' అంది మళ్లీ తనే నమ్రత పక్కనే ఉన్న రూమ్మేట్ థెరిసాతో.

''అప్పర్ లిప్ మీద హెయిర్ వస్తోంది. ముఖమంతా యాక్నే, ఒంటిమీద నల్లగా చుక్కలు కూడా వస్తున్నాయి. డెర్మటాలజిస్ట్‌ను కూడా కలవాలేమో'' దిగులుగా తనలో తనే అనుకున్నట్లుగా అంటోంది నమ్రత.

''నువ్వు కలవాల్సింది గైనకాలజిస్ట్‌ని'' డ్రెస్ వేసుకుంటూ, హడావుడిగా టేబుల్ దగ్గరకు వెళ్లి వెజిటబుల్ సలాడ్ ఫోర్క్‌తో నోట్లో పెట్టుకుంటూ బదులిచ్చింది థెరిసా.

థెరిస్సాను విచిత్రంగా చూసింది నమ్రత.

''నాకు వరుసగా మూడు నెలలు పీరియడ్స్ మిస్ అయ్యాయని గైనకాలజిస్ట్‌ని కలిశాను కదా! అప్పుడు తెలిసింది ఇవన్నీ పీసీఓఎస్ లక్షణాలని. నన్నయితే బరువు తగ్గమని గట్టిగా చెప్పింది. నువ్వు కూడా ఓ సారి కలువు'' నమ్రత వైపు చూడకుండా చెప్పుకుంటూ పోతోంది థెరిసా.

• • •

నమ్రతా జార్జ్, థెరెసా బోబన్‌లు పదకొండేళ్లుగా స్నేహితులు. ఈ కేరళ అమ్మాయిలు ఏడేళ్లుగా రూమ్మేట్‌లు. ఇద్దరూ ఫ్యాషన్ ఎక్స్‌పర్ట్‌లే. సొంతూరు కొచ్చి నుంచి గత ఏడాది బెంగుళూరు కొచ్చి ఫ్యాషన్ పరిశ్రమలో పని చేస్తున్నారు.


నమ్రత, థెరిసా

థెరిసా సలహాతో నమ్రత గైనకాలజిస్ట్‌ను సంప్రదించింది. నిజమే! ఆమె సమస్య కూడా పీసీఓఎస్‌నే. అండాశయంలో సిస్ట్‌లు ఏర్పడ్డాయి. నిండా పాతికేళ్లు లేవు. ఇప్పుడే గర్భాశయ సమస్య లేంటి? అసలీ పీసీఓఎస్ ఏంటి? ఇది ఎన్ని రకాలుగా ఇబ్బంది పెడుతుంది? అని పరిశోధన చేసినంత పని చేశారు. తమ ఇద్దరిలోనే కాదు ఈ పీసీఓఎస్ ప్రపంచ వ్యాప్తంగా కోటిమంది మహిళలను వేధిస్తోందనీ, మన దేశంలో ఈ దశాబ్దంలో విపరీతంగా పెరిగిపోతోందనీ తెలుసుకున్నారు.

**ధైర్యం చెబుతున్నారు**

మనదేశంలో మహిళలు తమ ఆరోగ్యాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నారో తెలియచేస్తున్నారు కేరళకు చెందిన ఇద్దరు స్నేహితులు. ఇంకా ముఖ్యంగా ఆడపిల్లలను పెళ్లికి ముందు రొటీన్ చెకప్‌లలో భాగంగా గైనకాలజిస్టుకు చూపించడానికి తల్లిదండ్రులు భయపడతారు. పెళ్లికావల్సిన అమ్మాయిని గైనకాలజిస్టు దగ్గరకు తీసుకెళ్లినట్లు ఎవరికైనా తెలిస్తే 'వాళ్లు ఏమనుకుంటారో' అని ఆందోళన పడుతుంటారు తప్ప సమస్య తొలి దశలో ఉన్నప్పుడే వైద్యం చేయించాలనుకోరు. పీసీఓఎస్ సమస్య దీర్ఘకాలం కొనసాగితే గర్భధారణ సమస్యలు ఎదురవుతాయని తెలిసినా సరే పెళ్లయిన తర్వాత డాక్టర్‌ను సంప్రదించవచ్చని.. సమస్యను తీవ్రతరం చేసుకుంటుంటారు. ఇంకా... పీసీఓఎస్‌కు చికిత్స చేయించుకుందని బంధువులకు, స్నేహితులకు తెలిస్తే 'ఈ అమ్మాయికి సమస్య ఏ స్థాయిలో ఉందో ఏమిటో, పిల్లలు పుడతారో లేదో' అనే అనుమానాలను చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తారేమోనని మరొక భయం.

**తేలిగ్గా వివరిస్తున్నారు**

ఆడపిల్లలను గైనకాలజిస్టుకు చూపించడం మీద మన సమాజంలో ఉన్న అనేక అపోహలను తొలగించే ప్రయత్నం మొదలు పెట్టారు నమ్రతా జార్జ్, థెరెసా బోబన్‌లు. ఇందుకోసం ఇన్‌స్టాగ్రామ్‌లో పేజీ ఓపెన్ చేసి సందేహాలకు సమాధానాలిస్తున్నారు. గైనిక్ సమస్యల పట్ల యువతులను చైతన్యవంతం చేయడానికి పూనుకున్న స్నేహితుల చొరవ ఇది. డాక్టర్లు వివరించేటప్పుడు వైద్యపరమైన సాంకేతిక పదాలు సామాన్య యువతులను, మహిళల్ని భయపెడుతుంటాయి. ఈ ఫ్రెండ్స్ మాత్రం విషయాన్ని సామాన్యులకు అర్థమయ్యే పదాలతో సులువుగా వివరిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్ పేజీ అంతగా విజయవంతం కావడానికి ఇదీ ఒక కారణమే. ''మొదట్లో కొన్నాళ్లు బెంగళూరు నీటిని తిట్టుకున్నాం. ఆ తర్వాత రియాలిటీలోకి వచ్చాం'' అని నవ్వారు ఈ ఫ్రెండ్స్.

– మంజీర

### సమస్యే కాదు



**డి**జిటల్ మీడియా వేదికగా మేము చేపట్టిన ఈ ఉద్యమం... మహిళల ఆరోగ్యం పట్ల మన సమాజంలో కరడుగట్టి ఉన్న నిరాసక్తతను పటాపంచలు చేయడానికే. 'టూ బ్రోక్ గర్ల్స్ విత్ పీసీఓఎస్' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజ్ ఓపెన్ చేశాం. అందులో పీసీఓఎస్ లక్షణాల గురించి సమగ్రంగా తెలియచేస్తున్నాం. అవసరమైతే నిపుణుల సలహా తీసుకుని ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని కూడా సూచిస్తున్నాం. మా పేజీని అనుసరిస్తున్న వాళ్లలో కొందరు తమలో ఉన్న కొన్ని లక్షణాలను బట్టి డాక్టర్‌ను సంప్రదిస్తున్నారు. అన్నింటికంటే ముందుగా పీసీఓఎస్ కారణంగా దేహంలో ఎదురయ్యే అవాంఛిత రోమాల వంటి వాటి గురించి అమ్మాయిలు విపరీతంగా వ్యాకులతకు లోనవుతుంటారు. ఇది మానసిక వేదనకు లోను కావాల్సిన సమస్య కానే కాదని వాళ్లకు ధైర్యం చెబుతున్నాం. బయటకు చెప్పుకోలేని ఆవేదనను పంచుకోవడానికి, చైతన్యవంతం కావడానికి ఒక వేదిక కల్పించాం. ఇది ఆరోగ్య చైతన్య విప్లవం.

– నమ్రత, థెరిసా



# వెంకీ డ్రైవింగ్ లైసెన్స్?



● వెంకటేశ్

వెంకటేశ్‌కు రామ్‌చరణ్ 'డ్రైవింగ్ లైసెన్స్' ఇవ్వాలనుకుంటున్నారట. విచిత్రంగా ఉంది కదూ.. 'డ్రైవింగ్ లైసెన్స్' అనేది మలయాళం సినిమా. ఈ చిత్రం తెలుగు రీమేక్ హక్కులను రామ్‌చరణ్ దక్కించుకున్నారని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ రీమేక్‌లో వెంకటేశ్ హీరోగా నటించబోతున్నారని సమాచారం. ఇందుకోసం రామ్‌చరణ్ సంప్రదింపులు జరుపుతున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. తెలుగు ఇండస్ట్రీలో ఎక్కువ రీమేక్ చిత్రాల్లో నటించిన క్రెడిట్ వెంకటేశ్‌కే దక్కుతుంది. గడచిన పదేళ్లల్లోనే 'బాడీగార్డ్, మసాల, దృశ్యం, గోపాల గోపాల, గురు' వంటి రీమేక్ చిత్రాలు ఉన్నాయి. ప్రస్తుతం చేస్తున్న 'నారప్ప' కూడా తమిళ చిత్రం 'అసురన్'కి రీమేక్ కావడం విశేషం. మరి.. 'డ్రైవింగ్ లైసెన్స్'తో వెంకీ రీమేక్ ఖాతాలో మరో సినిమా చేరుతుందా?

# మా బుట్టబొమ్మ..లా వాటే బ్యూటీ ఉంది

- త్రివిక్రమ్



● వెంకీ కుడుముల, త్రివిక్రమ్, రష్మికా మందన్నా, నితిన్, సూర్యదేవర నాగవంశీ, మహతి సాగర్

''భీష్మ' సినిమాని చూశాను.. చాలా చాలా బాగుంది. 21న అందరూ బాగా ఎంజాయ్ చేస్తారని నమ్మకంగా చెబుతున్నా'' అన్నారు దర్శకుడు త్రివిక్రమ్. నితిన్, రష్మికా మందన్నా జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'భీష్మ'. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథి **త్రివిక్రమ్** మాట్లాడుతూ– ''భీష్మ'లో నాకు బాగా నచ్చిన అంశాలు సెకండాఫ్‌లో రెండున్నాయి. ఒకటి వెంకట్ మాస్టర్ చేసిన ఫైట్. రెండు.. జానీ మాస్టర్ చేసిన లాస్ట్ సాంగ్ 'వాటే బ్యూటీ'. ఈ పాటను మా 'బుట్టబొమ్మ' పాటలా బాగా చేశాడు. 'జెర్సీ' తర్వాత నిర్మాత వంశీ మరో మంచి సినిమాని తీసుకువస్తున్నారు'' అన్నారు.

నిర్మాత **'దిల్' రాజు** మాట్లాడుతూ– ''భీష్మ' చూసి చాలా సంతోషపడ్డా. ఎంత నవ్వించాలో అంత నవ్వించారు. ప్రేక్షకులు ఫుల్ ఎంజాయ్ చేస్తారు. నితిన్ డ్యాన్సులు ఇరగదీశాడు. 'అల.. వైకుంఠపురములో' ఎంత పెద్ద హిట్టయ్యిందో తెలుసు. ఆ సినిమాతో పోటీపడేలా 'భీష్మ' విజువల్స్ ఉన్నాయి'' అన్నారు. ''వెంకీ కుడుముల లేకపోతే నేనిక్కడ ఉండేవాణ్ణి కాదు'' అన్నారు సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్.

**వెంకీ కుడుముల** మాట్లాడుతూ – ''భీష్మ' కథకు సమయం పట్టింది. అయితే సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచం'' అన్నారు. ''ఈరోజు టాలీవుడ్‌లో నేను ఉన్నానంటే ప్రధాన కారణం వెంకీ కుడుముల. ఆయనకు జీవితాంతం మంచి ఫ్రెండ్‌గా ఉంటాను. నితిన్ నా బెస్ట్ కో–స్టార్ కాదు.. బెస్ట్ ఫ్రెండ్'' అన్నారు రష్మికా మందన్నా.

**నితిన్** మాట్లాడుతూ– ''వెంకీ కుడుముల నాకు, 'దిల్' సినిమాకు పెద్ద అభిమాని. ఒక అభిమాని సినిమా తీస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుంది. 'దిల్', 'సై' తర్వాత మళ్లీ అలాంటి యాంగిల్‌లో నన్ను చూపించాడు. నా అభిమానులందరూ ఎప్పుడూ 'డ్యాన్స్.. డ్యాన్స్' అని అడుగుతున్నారు.. ఈ సినిమాలో నా డ్యాన్స్ చూసి వారి ఆకలి తీరుతుందనుకుంటున్నా. ఈ సినిమాలో 'వాటే బ్యూటీ' సాంగ్‌లో రష్మిక డ్యాన్స్ చూసి షాకయ్యా.. చాలా బాగా చేసింది. మా నిర్మాతలు చినబాబు, వంశీగార్లతో మొదట 'అఆ' చేశా.. ఇప్పుడు 'భీష్మ' చేశాను.. మూడో సినిమా 'రంగ్ దే' ఇప్పటికే చేస్తున్నా. నాలుగో సినిమా కోసం నాగవంశీ స్కెచ్ గీస్తున్నారు. నా జీవితంలో మా అమ్మానాన్నలు, మా అక్క, పవన్ కల్యాణ్‌గారు, త్రివిక్రమ్‌గారు పంచప్రాణాలు.. ఇప్పుడు పెళ్లవబోతోంది కాబట్టి నా భార్య ఆరో ప్రాణం కాబోతోంది'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత ఎన్.సుధాకర్ రెడ్డి, డైరెక్టర్ వెంకీ అట్లూరి, నటుడు బ్రహ్మాజీ, పాటల రచయితలు శ్రీమణి, కాసర్ల శ్యామ్, నృత్య దర్శకుడు జానీ మాస్టర్, ఫైట్ మాస్టర్ వెంకట్, సుచిర్ ఇండియా కిరణ్, గ్రీన్ మెట్రో ప్రతినిధులు అశోక్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# అర్జున్ ఫ్రెండ్‌షిప్



● అర్జున్

భారత మాజీ క్రికెటర్ హర్భజన్‌సింగ్ 'ఫ్రెండ్‌షిప్' సినిమాలో హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో తమిళ బిగ్‌బాస్ ఫేమ్ లోస్లియా మరియనేసన్ కథానాయిక. జాన్ పాల్ రాజ్, శ్యామ్ సూర్యల సంయుక్త దర్శకత్వంలో జేపీఆర్, స్టాలిన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ ప్రధాన పాత్ర చేయడానికి అంగీకరించారు యాక్షన్ కింగ్ అర్జున్. అలాగే తమిళ యాక్టర్ సతీష్ కూడా ఓ కీలక పాత్ర చేయనున్నారు. ఈ సినిమాను ఈ ఏడాది వేసవిలో పలు భారతీయ భాషల్లో విడుదల చేయాలనుకుంటున్నారు.

# నలభై ఏళ్లు వెనక్కి వెళ్లినట్లుంది

- కె.విశ్వనాథ్



● కె. విశ్వనాథ్‌కి పాదాభివందనం చేస్తున్న వంశీతో తులసి, చంద్రమోహన్, డబ్బింగ్ జానకి...

''శంకరాభరణం' సినిమా 1980 ఫిబ్రవరి 2న విడుదలైంది. ఆ సినిమాని ఇప్పుడు చూస్తే 40 ఏళ్లు వెనక్కి వెళ్లినట్టు ఉంది'' అన్నారు 'కళాతపస్వి' కె.విశ్వనాథ్. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న మొట్ట మొదటి తెలుగు సినిమా 'శంకరాభరణం' విడుదలై 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'బాపురమణ అకాడమీ' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు చంద్రమోహన్ మాట్లాడుతూ– ''మరో రెండు రోజుల్లో మా అన్నయ్య కె.విశ్వనాథ్ 90వ పడిలోకి అడుగుపెడుతున్నారు. మా ఇద్దరి కాంబినేషన్‌లో మంచి హిట్ సినిమాలు వచ్చాయి. మా అన్నయ్య వంద పుట్టిన రోజులు జరుపుకోవాలి. 'శంకరాభరణం' 50 ఏళ్ల ఫంక్షన్‌కి కూడా మా అన్నయ్య రావాలి'' అన్నారు.

''ఇలాంటి సినిమాని పాఠ్య గ్రంథంగా పెట్టి భవిష్యత్ దర్శకులకు ఎలాంటి సినిమాలు తీయాలో నేర్పాలి'' అన్నారు నటుడు ఎల్బీ శ్రీరామ్. ''శంకరాభరణం' లాంటి సినిమా తీయడం తెలుగు చలన చిత్ర పరిశ్రమ చేసుకున్న అదృష్టం. కె.విశ్వనాథ్‌గారు మనకందించిన 'శంకరాభరణం' చిరస్మరణీయం'' అన్నారు పాటల రచయిత 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి. ప్రసాద్ ల్యాబ్స్ అధినేత రమేష్ ప్రసాద్, నిర్మాతల అచ్చిరెడ్డి, సంగీతదర్శకుడు మాధవపెద్ది సురేష్, నిర్మాత డాక్టర్ కె. వెంకటేశ్వరరావు నటుడు తనికెళ్ల భరణి, దర్శకుడు హరీష్ శంకర్ తదితరులతో పాటు 'శంకరాభరణం' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన వంశీ(ప్రస్తుతం డైరెక్టర్), చిత్రనిర్మాత ఏడిద నాగేశ్వరరావు కుమారులు ఏడిద రాజా, ఏడిద శ్రీరామ్, నటి డబ్బింగ్ జానకి, నటి తులసి తదితరులు పాల్గొన్నారు.

# రన్ తాప్సీ రన్



● తాప్సీ

బాయ్‌ఫ్రెండ్ లైఫ్‌ను కాపాడుకోవడానికి 20 నిమిషాల్లో దాదాపు 40లక్షల రూపాయలు రెడీ చేసుకోవాల్సిన పరిస్థితుల్లో పడిపోతుంది ఓ అమ్మాయి. దానికోసం ఏం చేసింది? అనే కథాంశంతో రూపొందిన జర్మన్ చిత్రం 'రన్ లోలా రన్'. ఇప్పుడీ స్టోరీ లైన్ ఆధారంగా 'లూప్ లపేటా' పేరుతో హిందీలో ఓ చిత్రం తెరకెక్కనుంది. ఇటీవల 'పింక్, బద్లా, సాండ్ కీ ఆంఖ్' వంటి ఫిమేల్ ఓరియంటెడ్ చిత్రాల్లో దూసుకెళుతున్న తాప్సీ ఈ రీమేక్‌లో నటించనున్నారు. ఇది కూడా కథానాయిక ప్రాధాన్యంగా సాగే సినిమా. ఇందులో దుండగుల నుంచి బాయ్‌ఫ్రెండ్ లైఫ్‌ను రక్షించుకునే యువతి పాత్రలో తాప్సీ నటించబోతున్నారు. తాహిర్ రాజ్ భాషిన్ కీలక పాత్రధారి. ఆకాశ్ భాటియా దర్శకత్వం వహించనున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏప్రిల్‌లో గోవాలో ప్రారంభం కానుంది. జనవరి 29న విడుదల చేయాలనుకుంటున్నారు. ''ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అన్నారు తాప్సీ. ప్రస్తుతం 'హసీన్ దిల్‌రుబా', 'శభాష్ మిథూ' (మహిళా క్రికెటర్ మిథాలీరాజ్ బయోపిక్) చిత్రాలతో బిజీగా ఉన్నారు తాప్సీ. ఇలా వరుస సినిమాలతో రన్ తాప్సీ రన్ అంటూ హుషారుగా కెరీర్‌లో పరుగులు పెడుతున్నారు.

# 14 ఏళ్ల తర్వాత...



● 'విరాటపర్వం' లొకేషన్‌లో నందితా దాస్

'విరాటపర్వం'లో అడుగుపెట్టారు ప్రముఖ నటి నందితా దాస్. 'నీదీ నాదీ ఒకే కథ' ఫేమ్ వేణు ఊడుగుల దర్శకత్వంలో రానా, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో ఓ కీలక పాత్ర చేయడానికి అంగీకరించిన నందితా దాస్ మంగళవారం ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ''మళ్లీ తెలుగు సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు నందితాదాస్. 2006లో వచ్చిన 'కమ్లీ' చిత్రం తర్వాత నందిత నటిస్తున్న స్ట్రయిట్ తెలుగు చిత్రం ఇదే కావడం విశేషం. దాదాపు 14ఏళ్ల తర్వాత నందిత తెలుగులో చేస్తున్న చిత్రం ఇది. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతోన్న ఈ పీరియాడికల్ సినిమాలో ప్రియమణి, ఈశ్వరీరావు తదితరులు నటిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు.

# యాక్టర్‌ని మాత్రమే కాదు రైటర్‌ని కూడా

"వేరొకరి కథలోని పాత్రలో మనం ఒదిగిపోవడం యాక్టింగ్. మన సృజనాత్మక ఆలోచనలను కథగా చెప్పడం రైటింగ్. నేను యాక్టర్‌నే కాదు. రైటర్‌ని కూడా. పాటలు కూడా రాస్తాను" అన్నారు **దిగంగనా సూర్యవంశీ.** రమేశ్ కుడుముల దర్శకత్వంలో లక్ష్య చదలవాడ, దిగంగనా సూర్యవంశీ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'వలయం'. పద్మావతి చదలవాడ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దిగంగన చెప్పిన విశేషాలు.



● దిగంగనా

● ఈ చిత్రంలో దిశ అనే గృహిణి పాత్రలో నటించాను. పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్న దిశ అనుకోకుండా ఓ రోజు అకస్మాత్తుగా కనిపించకుండాపోతుంది. ఎవరైనా కిడ్నాప్ చేశారా? లేక తనే భర్తను మోసం చేసిందా? భర్తే దిశను ఏమైనా చేశాడా? అనే ప్రశ్నలతో సినిమా ఆసక్తిగా ఉంటుంది. అందుకే పోస్టర్స్‌లో కూడా క్వొశ్చన్ మార్క్ ఉంచాం. సినిమా అంతా చాలా ఉత్కంఠగా సాగుతుంది. ప్రేక్షకులు థ్రిల్ ఫీల్ అవుతారనే నమ్మకం ఉంది.

● భార్య కనిపించకుండాపోవడంతో హీరో కొన్ని సమస్యల్లో ఇరుక్కుంటాడు. తన భార్య గురించి అందరూ తప్పుగా మాట్లాడుతుంటే అసలు... నిజంగా ఏం జరిగింది? అనే కన్‌ఫ్యూజన్‌లో ఉంటాడు హీరో. అతన్ని కూడా వైవిధ్యమైన ఆలోచనలు వేధిస్తుంటాయి.. అందుకే ఈ సినిమాకు 'వలయం' అనే టైటిల్ బాగా యాప్ట్ అవుతుందని చెప్పగలను.

● నేను రాసిన రెండు సినిమా కథల్లో ఒకటి సైకలాజికల్ నేపథ్యంలోని కుటుంబ కథాచిత్రం. మరొకటి ఓ వ్యక్తి జర్నీ. డైరెక్షన్ అనేది చాలా పెద్ద జాబ్. దర్శకత్వం గురించి భవిష్యత్‌లో ఆలోచిస్తాను. ప్రస్తుతానికి కథలు, స్క్రిప్ట్స్ రాయడమే నాకు ఇష్టం. తెలుగులో మహేశ్‌బాబు, రామ్‌చరణ్, అల్లు అర్జున్‌ల సినిమాలు చూస్తుంటాను. ఈ హీరోలతో నటించాలని ఉంది. కేవలం కమర్షియల్ సినిమాలే కాదు. ప్రయోగాత్మక సినిమాలు కూడా చేయాలని ఉంది.

● ప్రస్తుతం గోపీచంద్‌గారి 'సీటీమార్' చిత్రంలో కబడ్డీ ప్లేయర్‌గా నటిస్తున్నాను. నా తర్వాతి సినిమాల గురించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తాను.

# హే రామ్.. 20 ఏళ్లు



● కమల్‌హాసన్, రాణీ ముఖర్జీ

కమల్‌హాసన్ చేసే సినిమాల్లో వివాదాల్లో ఇరుక్కోని సినిమాలు చాలా అరుదు. అలా పలు వివాదాలు, సంచలనాల మధ్య విడుదలైన ఆయన సినిమాల్లో 'హే రామ్' ఒకటి. 2000 ఫిబ్రవరి 18న ఈ సినిమా విడుదలైంది. ''తీయాల్సిన టైమ్‌లో 'హే రామ్' తీసినందుకు ఆనందంగా ఉంది. కాకపోతే ఆ సినిమాలో ప్రస్తావించిన భయాలు, చేసిన హెచ్చరికలు ఇప్పుడు నిజం కావడం బాధాకరం. దేశ క్షేమం కోసం సవాళ్లను అధిగమించడానికి మనం ప్రయత్నించాలి'' అన్నారు కమల్‌హాసన్. ఆయన నటించి, దర్శకత్వం వహించిన 'హే రామ్'లో కమల్ చేసిన సాకేత్ రామ్ జూనియర్ పాత్రకు రాణీ ముఖర్జీ భార్య పాత్రను పోషించారు. 'హే రామ్' 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రాణి మాట్లాడుతూ – ''నేను చాలా పొట్టిగా ఉంటాను. హై హీల్స్ వేసుకుని 'హే రామ్' లొకేషన్‌కి వెళితే, ఒక రోజు కమల్ చూసి, 'అంత ఎత్తు చెప్పులు ఎందుకు వేసుకుంటున్నావు' అని అడిగారు. 'పొట్టిగా ఉంటాను కదా' అన్నాను. అప్పుడు కమల్ 'నీ ప్రతిభను నువ్వు ఎంత ఎత్తు ఉన్నావు అనేదాన్నిబట్టి కొలవరు. నువ్వు సాధించిన విజయాలే నిన్ను అందరూ గుర్తుపెట్టుకునేలా చేస్తాయి' అన్నారు. ఈ మాటలను జీవితాంతం గుర్తుపెట్టుకుంటాను'' అన్నారు.

# థియేటర్ నేపథ్యంలో...



● మహిపాల్, డి. సురేష్ బాబు

''పోస్టర్' సినిమా టీజర్ చూశాక మహిపాల్ రెడ్డి ప్రతిభ ఏంటో అర్థమైంది. తనకి ఇది తొలి సినిమా అయినా అనుభవం ఉన్న దర్శకుడిలా తీశారు. థియేటర్ నేపథ్యంలో ఈ సినిమా తీశారని తెలుస్తోంది'' అన్నారు నిర్మాత డి.సురేష్ బాబు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో ప్రొజెక్టర్ ఆపరేటర్‌గా పదేళ్లు పని చేసిన టి.మహిపాల్ రెడ్డి (టీఎంఆర్) దర్శకత్వం వహించిన తొలి చిత్రం 'పోస్టర్'. విజయ్ ధరన్ హీరోగా, రాశీ సింగ్, అక్షత సోనావానే హీరోయిన్లుగా నటించారు. శ్రీ సాయి పుష్పా క్రియేషన్స్ పతాకంపై టి.శేఖర్ రెడ్డి, ఏ.గంగారెడ్డి, ఐ.జి రెడ్డి నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని సురేష్‌బాబు విడుదల చేశారు. మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ– ''పోస్టర్ అంటించడానికి కూడా పనికి రాని ఒక వ్యక్తి పోస్టర్ మీదకు ఎక్కే స్థాయికి ఎలా ఎదిగాడు? అనేది ఈ సినిమా కథ. సమస్యల్ని అధిగమించి ముందుకు వెళ్లగలిగితే జీవితం ఎంతో బావుంటుంది. చిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకోవద్దని చెప్పాం'' అన్నారు. ''జీరో నుంచి ఒక వ్యక్తి హీరోగా ఎలా ఎదిగాడు? అన్నదే మా సినిమా కథ'' అన్నారు విజయ్ ధరన్. ''మా సినిమా ప్రేక్షకులకు బాగా నచ్చుతుంది'' అన్నారు రాశీ సింగ్, అక్షత సోనావానే. ఈ చిత్రానికి సంగీతం: శాండీ అద్దంకి, కెమెరా: రాహుల్

# టైటిల్ ఆలోచింపజేసేలా ఉంది

- జీవితా రాజశేఖర్



● ఏవీఆర్ స్వామి, సుబ్బు వేదుల, కృతీ గార్గ్, జీవితా రాజశేఖర్, అభిరామ్, రాజ్ కందుకూరి

అభిరామ్ వర్మ, కృతీ గార్గ్ జంటగా సుబ్బు వేదుల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాహు'. 'బాహుబలి' ప్రభాకర్, చలాకీ చంటి, గిరిధర్, 'సత్యం' రాజేష్, స్వప్నిక కీలక పాత్రల్లో నటించారు. ఏవీఆర్ స్వామి, శ్రీ శక్తి బాబ్జి, రాజా దేవరకొండ, సుబ్బు వేదుల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 28న విడుదలకానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'రాహు' మ్యూజిక్ సక్సెస్‌మీట్‌లో సుబ్బు వేదుల మాట్లాడుతూ– ''కొత్త కాన్సెప్ట్‌తో వస్తోన్న మా సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను. మంచి సంగీతం ఇచ్చిన ప్రవీణ్ లక్కరాజుగారికి ధన్యవాదాలు'' అన్నారు. ''జీ తెలుగువారు 'రాహు' సినిమా శాటిలైట్ అండ్ డిజిటల్ రైట్స్ తీసుకోవడంతో ఈ సినిమా సక్సెస్ మొదలైందనిపిస్తోంది'' అన్నారు నిర్మాత 'మధుర' శ్రీధర్. ''థ్రిల్లర్ నేపథ్యంలో వస్తోన్న 'రాహు' సినిమా పెద్ద విజయం సాధించాలి'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి. 'రాహు' టైటిల్ ఆలోచింపజేసేలా ఉంది. ఈ సినిమా హిట్ కావాలి'' అన్నారు నటి జీవితారాజశేఖర్. ''మా సినిమా విజయం సాధించి మళ్లీ ఇలా సక్సెస్‌మీట్‌లో అందరూ కలవాలని కోరుకుంటున్నా'' అన్నారు చిత్రనిర్మాతల్లో ఒక్కరైన స్వామి. ''సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ మా సినిమాను విడుదల చెయ్యడం సంతోషంగా ఉంది'' అన్నారు అభిరామ్. ఈ చిత్రానికి కెమెరా: సురేష్ రగుతు, ఈశ్వర్ యల్లు మహంతి.



# బ్యూటిప్స్

### ఇంట్లోనే మాయిశ్చరైజర్

చర్మం మృదువుగా, ముడతలు పడకుండా, మచ్చలు ఏర్పడకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్‌ను ఉపయోగించాలి. దీనిని ఇంట్లోనే తయారుచేసుకోవచ్చు.

ఒక కప్పు పెరుగు, టేబుల్‌స్పూన్ ఆరెంజ్ జ్యూస్, టేబుల్‌స్పూన్ నిమ్మరసం ఒక గిన్నెలోకి తీసుకుని, బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు, పాదాలకు పట్టించాలి. తర్వాత సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రంగా కడిగేయాలి.

### మృదువైన ముఖ చర్మానికి...

అవొకాడో గుజ్జు టీ స్పూన్, ఉడికించి గుజ్జు చేసిన క్యారట్ టీ స్పూన్, టీ స్పూన్ వెన్న, గుడ్డులోని తెల్లసొన, రెండు టీ స్పూన్ల తేనె ఒక పాత్రలో వేసి మృదువుగా అయ్యేంతవరకు బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు ప్యాక్‌లా వేసుకోవాలి. పదిహేను నిమిషాలు ఆరనిచ్చి తర్వాత చల్లని నీటితో శుభ్రపరుచుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేస్తుంటే చర్మం మృదువుగా తయారవుతుంది.



### బ్లాక్‌హెడ్స్ పోవాలంటే...

కొద్దిగా బియ్యం గింజలను తగినన్ని పాలలో నానబెట్టాలి. ఐదు గంటల తర్వాత బియ్యాన్ని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి. ఈ స్క్రబ్‌ని ముఖానికి రాసుకొని మునివేళ్లతో సున్నితంగా 5–10 నిముషాలు మర్దనా చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. తడి లేకుండా తుడుచుకొని తేనె రాసి 10 నిముషాలు ఉంచి శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండు సార్లు ఈ విధంగా చేస్తే మృతకణాలు, బ్లాక్‌హెడ్స్ తొలగిపోయి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది. తేనెకు బదులుగా ఫేస్‌ప్యాక్ ఉపయోగించుకోవచ్చు.

# కత్తిలా బతికి వెళ్లిపోయారు...

సినీ పరివారం

**ఎన్.టి.ఆర్, ఏ.ఎన్.ఆర్‌లు తెలుగు సినిమాకు రెండు కళ్లు. కాని కాంతారావు ఆ మెడలో మెరిసే చంద్రహారం. కత్తి వీరుడు కాంతారావుగా జానపద చిత్రాలు చేసి సగటు ప్రేక్షకుడికి ఆయన చేరువయ్యారు. సాంఘిక చిత్రాలలో బలమైన పాత్రలు చేసి పెద్ద హీరోలను ఢీకొట్టారు. నటుడిగా ఎంత బిజీగా ఉన్నా ఇంటిని, ఇల్లాలి చేతి వంటని, పిల్లల బాల్యాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. ఆయన కనుమరుగై దాదాపు దశాబ్దం పైగానే గడిచింది. అయితేనేం చెన్నైలో ఉండే పెద్ద కుమారుడు ప్రతాప్, హైదరాబాద్‌లో ఉండే నాలుగో కుమారుడు రాజా తండ్రి జ్ఞాపకాల పరిమళాలను ఎంతో సంతోషంగా సాక్షితో పంచుకున్నారు.**





(నిలబడినవారు..ఎడమ నుంచి వరుసగా) ప్రతాప్, కేశవరావు, సుశీల, రాజా, సత్యం (కాంతారావు పిల్లలు); (కూర్చున్నవారు) కాంతారావు, హైమవతి (సతీమణి)

**రాజా:** నాన్నగారికి మేం నలుగురు మగ పిల్లలం, ఒక ఆడపిల్ల. ప్రతాప్ పెద్దన్నయ్య, రెండో అన్నయ్య కేశవరావు, ఆ తరవాత అక్క సుశీల, నేను, నా తరవాత తమ్ముడు సత్యం. నాకు నాలుగేళ్లు వచ్చేవరకు మాటలు రాలేదు. కుర్తాళంలో ఉన్న జలపాతం నీటికి ఔషధ గుణాలు, మహిమలు ఉన్నాయని తెలిసినవారు చెప్పటంతో నన్ను అక్కడకు తీసుకువెళ్లారు. జలపాతం నీళ్లు నా మీద పడేలా తన భుజాల మీద ఎక్కించుకున్నారు. నీటి మహిమో, యాదృచ్ఛికమో గానీ, వారు చెప్పినట్టుగానే నాకు మాటలు రావడంతో నాన్నగారి ఆనందానికి అవధులు లేవు. ఆ సంఘటన తరచుగా చెబుతుండేవారు.

నాకు చిన్నప్పటి నుంచి ఆయనతో అనుబంధం పెనవేసుకుంది. ఆయనతో మాకు ఎన్నో తీపి అనుభవాలు ఉన్నాయి. పుట్టినరోజులు బాగా జరిపేవారు. పార్టీలకు, ఫ్రెండ్స్ ఇళ్లకు వెళ్లటంలాంటి అలవాట్లు ఆయనకు లేవు. అవకాశం వచ్చినప్పుడల్లా మాతో క్యారమ్స్, షటిల్ ఆడేవారు. వినాయకచవితికి మాతో పూజ చేయించేవారు. నాన్న ఊరు వెళ్తుంటే ఏడ్చేవాళ్లం. అప్పుడప్పుడు ఔట్‌డోర్ షూటింగ్‌కి తీసుకువెళ్లేవారు. మేం షూటింగ్ చూసిన మొట్టమొదటి సినిమా సతీ సులోచన. కోదాడ వెళ్లినప్పుడు అక్కడి పొలాలకు తీసుకువెళ్లేవారు. అక్కడ మమ్మల్ని చూసి 'కాంతారావుగారి అబ్బాయి' అని అందరూ అంటుంటే మాకు భలే సరదాగా ఉండేది. నాన్నగారు చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చేశాక ఆయన బ్యాంకు పనులు చూడటం అలవాటు చేసుకున్నాను. హైదరాబాద్ వచ్చాక ఒకసారి నన్ను షూటింగ్‌కి తీసుకువెళ్లారు. వాళ్లు నన్ను ప్రొడక్షన్ బాయ్ అనుకుని, నేను అన్నం దగ్గర కూర్చున్న చోట నుంచి లేపి, మరోచోట కూర్చోమన్నారు. నాన్నగారు కోపంగా, 'నాకు కూడా అక్కడే అన్నం పెట్టండి' అన్నారు. ఏం జరుగుతోందో వాళ్లకు అర్థం కాలేదు. 'వాడు మా అబ్బాయి, మీ పని నాకు అవమానంగా ఉంది' అన్నారు. మద్రాసులో వారికి నేనెవరో తెలుసు. కాని హైదరాబాద్‌లో ఎవ్వరికీ తెలియకపోవటం వల్ల ఈ సంఘటన జరిగింది. మేం పెద్దగా చదువుకోకపోయినా, నాన్న ప్రేమను పరిపూర్ణంగా అందుకున్నాం. 'సుడిగుండాలు' చిత్రానికిగాను 1968లో అవార్డు అందుకున్నాను. అవార్డు వచ్చినందుకు సంతోషపడ్డారు కానీ, అటువంటి పాత్రలు ఎన్నడూ వేయద్దు, నా కొడుకు నా కళ్ల ముందరే ఉండాలి' అంటూ కళ్లనీళ్లు పెట్టుకున్నారు. ఆ చిత్రంలో నేను వేసిన పాత్రలో చనిపోతాను. సినిమా రంగానికి దూరంగా ఉండమని చెప్పేవారు. హేమ ఫిలిమ్స్ పేరున మేం తీసిన 'సప్తస్వరాలు' చిత్రం ఫ్లాప్ కావటంతో, నాన్నగారికి గుండెపోటు వచ్చింది. 'మీ ప్రేమే నన్ను కాపాడుతుంది. అమ్మని బాగా చూసుకో రాజా' అన్నారు. 1971 దాకా హీరోగా చేశారు. 'గుండెలు తీసిన మొనగాడు' నాన్న హీరోగా చేసిన ఆఖరి సినిమా. 'నేరము – శిక్ష' నుంచి క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారారు. నవంబరు 16వ తేదీన నాన్నగారి పుట్టినరోజు. ఆ రోజు నాన్నగారు ఒక కార్యక్రమానికి హాజరయ్యారు. అప్పటికే నాన్న క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. అక్కడ కొద్దిసేపు ఉండి, ఇంటికి బయలుదేరుతూ, అందరి ఎదుట, 'నాన్నా రాజా! ఇంక నాకు ఈ కర్ర అవసరం లేదు. నువ్వే నా కుడి భుజం. అమ్మని జాగ్రత్తగా చూసుకో' అని చెప్పారు. చివరికి అదే నిజం చేస్తూ ఏడాదికల్లా నాన్న కన్ను మూశారు.

**ప్రతాప్:** నాన్నగారి స్వస్థలం తెలంగాణలోని కోదాడ. రజాకార్ మూవ్‌మెంట్ టైమ్‌లో అక్కడ నుంచి చెన్నై మకాం మార్చేశారు. నాన్నగారిది ప్రేమ వివాహం. అమ్మది జగ్గయ్యపేట. అమ్మ మీద నాన్నకు విపరీతమైన అభిమానం. అమ్మ చేతి కాఫీతోనే నాన్న నిద్ర నుంచి లేచేవారు. ఇంటి వ్యవహారమంతా అమ్మే చూసుకునేది. అమ్మ సింపుల్‌గా ఉండటమే కాదు, మమ్మల్ని కూడా అలాగే పెంచింది. ఇంట్లో రెండు కార్లు ఉన్నా రిక్షాలోనే వెళ్లేది. మేం కూడా సైకిల్ లేదా బస్సుల్లో ప్రయాణించేవాళ్లం. నాన్న చాలా బిజీగా ఉండేవారు. ఒకసారి షూటింగ్‌కి వెళ్లిపోతే వారం పదిరోజుల దాకా ఆయనను చూడటానికి కుదిరేది కాదు. ప్రతి రోజూ మూడు షిఫ్టులు పనిచేసేవారు. సంవత్సరానికి పన్నెండు సినిమాలు చేయాలనుకునేవారు. 1960 – 1971 మధ్యకాలంలో ఆయన ఎంత బిజీగా ఉన్నారంటే ఆయన కాల్షీట్లు చూడటానికి ఇద్దరు సెక్రటరీలను పెట్టుకునేంత! రోజుకి మూడు గంటలు మాత్రమే నిద్రపోయేవారు. మా చిన్నతనంలో తిరుపతి వెళ్లినప్పుడు నాకు గుండు కొట్టించారు. నేను కుదురుగా ఉండకపోవటంతో కొలనులోకి దొర్లిపోయాను. నాన్నగారు వెంటనే చూడటంతో బతికి బయటపడ్డాను. మద్రాసులో సినిమా వాళ్ల పిల్లలంతా కేసరయ్య స్కూల్‌లోనే చదివేవారు. మేం కూడా అక్కడే చదువుకున్నాం. ఆ తరవాత రామకృష్ణ మిషన్‌లో చదివాం. కాలేజీలో నా అంతట నేనే చేరాను. తమ్ముళ్లని మాత్రం నాన్న చేర్పించారు. 1957లో అనుకుంటాను. పెళ్లికి వెళ్లి, తిరుపతి నుంచి తిరిగి వస్తున్నాం. అప్పుడు నాకు ఏడేళ్లు. ముందు సీట్లో నాన్న ఒళ్లో పడుకున్నాను. ఆయన నా మెడ మీద చేయి వేసి పడుకోబెట్టుకున్నారు. బాగా వాన పడుతుండటంతో రాణీ పేట దగ్గర కారు చక్రం స్కిడ్ కావటంతో యాక్సిడెంట్ అయ్యింది. కుడి వైపు చెట్టుకి కొట్టుకుని వెనక్కి వచ్చి మళ్లీ కొట్టుకుంది. అద్దాల ముక్కలు తలలో పడ్డాయి. సరిగ్గా అప్పుడు నాన్న నన్ను కిందకి తోసేసి, తను కూడా దూకేశారు. డ్రైవర్ జంప్ చేశాడు. చెట్టు కొట్టుకోవటం వల్ల, ప్రమాదం నుంచి తప్పించుకోగలిగాం. కారు నుజ్జునుజ్జు అయిపోయింది. కారు కండిషన్ చూసినవారంతా మేం ఎలా బతికి బయటపడ్డామా అనుకున్నారు. ఆ ఏడుకొండల వాడి దయ వల్ల బతికాం అని నాన్న చెప్పేవారు. 1968లో సప్తస్వరాలు సినిమా స్వయంగా నిర్మించి అందులో నటించారు. ఆ సినిమాకి కావలసిన వస్తువులు కొంటూ నాకు 150 రూపాయలు పెట్టి సీకో వాచీ కొన్నారు. ఆ వాచీ చాలా సంవత్సరాలు వాడాను, అది పాడైపోయాక మళ్లీ చాలాకాలం వాచీ కొనుక్కోలేదు. 1974లో సింగపూరు వెళ్లినప్పుడు వాచీ కొని తెచ్చుకున్నాను. గడియారం కాలాన్ని ఎంత ముందుకు తోస్తున్నా మేము మాత్రం ఎప్పుడూ నాన్న జ్ఞాపకాల్లోనే ఉంటాం.

– సంభాషణ: **వైజయంతి పురాణపండ**

### అప్పటి నుంచి మాతోనే...



నేను మొదటి నుంచి నాన్నగారి ప్రొడక్షన్స్ చూసుకునేవాడిని. ఎక్కడా ఉద్యోగం చేయలేదు. చెన్నైలో ఉన్నన్ని రోజులు నాన్నగారు మా దగ్గరే ఉండేవారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేవారు. నాకు ముగ్గురు అబ్బాయిలు. సాయికిరణ్, కార్తిక్, గుణరంజన్. ముగ్గురూ ఆస్ట్రేలియాలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. నా భార్య లక్ష్మి. మా అత్తవారు మేము ఇరుగుపొరుగువారం. నాన్నగారితో వియ్యమందుకున్నాక, మా మావగారు పి. చంద్రశేఖర్ మా ప్రొడక్షన్‌లో భాగస్వాములయ్యారు.

– **ప్రతాప్**

### నా దగ్గరే...



నేను ఒక చిన్న ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాను. అమ్మ హైమవతి నా దగ్గరే ఉంది. నా భార్య ఉషశ్రీ. వాళ్లది తణుకు. మా అబ్బాయి సాయి ఈశ్వర్ బిటెక్ చదువుతున్నాడు. అమ్మాయి ప్రియాంకకు వివాహం అయ్యింది. అల్లుడు మెరైన్‌లో పనిచేస్తున్నాడు.

– **రాజా**

సీ'రియల్'

# పంతొమ్మిదేళ్లుగా బుల్లితెర అమ్మ

**'కాలచక్రం సీరియల్ చేస్తున్నప్పుడు నా వయసు 21. అప్పుడే అమ్మగా చేశాను. నాతో పాటు వచ్చిన హీరోయిన్లు ఇప్పుడు అమ్మలు అయ్యారు. కానీ, నేను మాత్రం పంతొమ్మిదేళ్లుగా అమ్మగానే ఉన్నాను..' అంటోంది మేఘనా రామి. ఒక దశలో 117 కేజీల బరువుకు మించిపోయి, ఆ తర్వాత తనకు తానుగా తగ్గి తిరిగి జీ టీవీలో 'రాధమ్మ కూతురు' సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. చక్రవాకం సీరియల్ ఇంద్రనీల్ అర్ధాంగి మేఘనారామి. ఒక దశలో ఆవహించిన బద్ధకం, తిరిగి జీవితాన్ని చురుగ్గా మార్చుకున్న విధానం.. ఇలా ఎన్నో విషయాలను ముచ్చటించింది...**



సీరియల్ లో కూతుళ్లతో రాధమ్మ

'కొన్ని ఏళ్ల తర్వాత ఓ మంచి ప్రాజెక్ట్ నన్ను వెతుక్కుంటూ వచ్చింది. ఆ క్రెడిట్ అంతా మా ఆయన ఇంద్రనీల్‌కే ఇవ్వాలి. ఓ రోజు జీ టీవీ నుంచి ఫోన్ 'రాధమ్మ కూతురు సీరియల్‌లో నటిస్తారా' అని. అందులో రాధమ్మ చుట్టూ తనే స్టోరీ అంతా నడుస్తుంది అన్నారు. చాలా సర్‌ప్రైజ్ అయ్యాను. నేను 'బాగా లావుగా ఉండి, కొంత వరకు తగ్గాను. అదే విషయం చెబుతూ ఇప్పుడు ఫొటోస్ పంపిస్తాను ఒకసారి చూసి చెప్పండి' అన్నాను. 'ఎందుకు సందేహిస్తావు. ఇలాంటి క్యారెక్టర్ కోసమే ఎదురు చూస్తున్నావ్ కదా.. చేసెయ్ అన్నారు' ఇంద్రనీల్. ఓ గంటలోపు ఫోన్ చేసి 'లుక్ టెస్ట్ చేద్దాం రండి' అన్నారు. ఇన్నేళ్ల ఎక్స్‌పీరియన్స్ ఉండి కూడా లుక్ టెస్ట్‌కి భయపడ్డాను ఓకే అవుతానా.. అని.

బుల్లితెరపై 'ముత్తయిదువ' నా మొట్టమొదటి సీరియల్. ఆ తర్వాత 'ఆత్మీయులు', కాలచక్రం, చక్రవాకం చేశాను. అన్నింటిలోనూ హీరోయిన్‌కి అమ్మగా. 'పక్కింటి అమ్మాయి' సీరియల్‌లో మాత్రం నా గెటప్ చాలా హెవీగా ఉంటుంది. రాధమ్మ క్యారెక్టర్ విన్న తర్వాత నాకు నేనే డిసైడ్ అయ్యి సింపుల్‌గా రెడీ అయ్యా. లుక్ టెస్ట్‌లో అందరూ ఓకే అన్నారు. ఆ తర్వాత కొంతమంది సీనియర్ ఆర్టిస్టులు 'రాధమ్మ కోసం మమ్మల్నీ అడిగారు' అని చెబుతుంటారు. ఎంతమంది అనుకున్నా ఆ క్యారెక్టర్ నన్ను వరించింది. దానికి తగ్గ న్యాయం చేయాల'ని తపన పడుతున్నాను.

### ప్లస్ సైజులో ప్లస్‌వి వెతికేదాన్ని



అన్నీ తెలిసినా ఒక్కోసారి బుర్ర పనిచేయదు. ఒకలాంటి స్తబ్దత మనసును చుట్టేస్తుంది. 'పక్కింటి అమ్మాయి' సీరియల్ సమయానికే 117 కేజీలకు పైగా బరువు పెరిగిపోయాను. కారణం ఏంటంటే... ఆరేళ్ల క్రితం సీరియల్ టైమ్‌లో అబార్షన్ అయ్యింది. ఆ బాధలో ఇండస్ట్రీకి దూరమై ఇంట్లోనే ఉన్నాను. ఉదయాన్నే పూజ చేసి, ఇంద్రకు బాక్స్ కట్టిచ్చి, ఆ తర్వాత టీవీ ముందు కూర్చోవడం... బెడ్ మీద నుంచి లేచేదాన్ని కాదు. అదేపనిగా గంటలతరబడి కూర్చోవడం, తింటూ ఉండటంతో.. బాగా లావయ్యాను.



భర్త ఇంద్రనీల్‌తో...

బరువు పెరుగుతున్నావు, డైట్ చేయమని ఇంద్రనీల్, అమ్మనాన్న, చెల్లెలు ఎవరు చెప్పినా వినలేదు. డ్రెస్సులు కొనుక్కోవడానికి షాపింగ్‌కి వెళితే ప్లస్ సైజువే తీసుకునేదాన్ని. అందులోనూ ఫ్రీ సైజు డ్రెస్సులు ఉన్నాయా అని వెతికేదాన్ని.

### మార్చేసిన డ్యాన్స్ షో

ఒక టీవీ షోలో కపుల్ డ్యాన్స్‌లో పాల్గొనేందుకు వెళ్లాను. అది కూడా ఇంద్రనీల్ కోసం ఒప్పుకున్నాను. జంట డ్యాన్స్. ఏదో రెండు ఎపిసోడ్స్ చేసి వచ్చేద్దాం అనుకున్నాను. కానీ, ఆ షోలో అందరూ ప్రశంసించడంతో ఆలోచనల్లో పడ్డాను. ఇంద్ర కోసం డ్యాన్స్ చేయాల్సిందే అని చాలా కష్టపడ్డాను. మూడు నెలలు ఇంద్ర చుక్కలు చూపించాడు.(నవ్వుతూ) నాలుగు గంటలకు లేపి 'ఐదు గంటలకల్లా రెడీ అవ్వు.. అని తొందరపెట్టేవాడు. అలవాటు లేని ప్రాణం కదా, నరకం అనిపించేది. టీవీ స్క్రీన్ మీద నన్ను నేను చూసుకున్నాక తగ్గాలనిపించింది. మొత్తానికి ఆ ప్రాసెస్‌లో ట్రోఫీ గెలుచుకున్నాను.

### ఆరోగ్యకరమైన ఆహారం

అప్పటి వరకు ఏది పడితే అది తిన్న నేను 'ఏం తింటే బరువు నియంత్రణలో ఉంటుంది' అని బోలెడంత రీసెర్చ్ చేశాను. డ్యాన్స్‌లో యాక్టివ్‌గా ఉండటం కోసం చేసిన ప్రయత్నాలన్నీ క్రమం తప్పకుండా చేసేలా మార్చాయి. ముఖంలో కళ తగ్గకుండా ఒళ్లు తగ్గాలంటే డైట్ హెల్దీగా ఉండేలా నేను చేసుకున్న ప్లాన్ ఫలించింది. 117 కేజీల బరువున్న నేను 8 నెలల్లో 40 కేజీలు తగ్గాను. అర కిలో మీటర్ నడవాలంటేనే ఆయాసపడేదాన్ని. ఇప్పుడు రోజూ 6 కిలోమీటర్లు ఫాస్ట్‌గా నడిచేస్తున్నాను.

### గర్భవతిగా ఉన్న సీన్

రాధమ్మ కూతురులో సన్నివేశాలన్నీ భావోద్వేగాలతో కూడుకున్నవే. ఇందులో ఒక ఫ్లాష్‌బ్యాక్ సీన్.. విజయవాడ కృష్ణానది ఒడ్డున జరుగుతుంది. నేను కడుపుతో ఉంటాను. ఎలాంటి సాయం అందని స్త్రీని. భర్త మరో స్త్రీతో ఉంటాడు. గట్టు మీద పడిపోయి అక్కడే డెలివరీ అవుతుంది. ఇద్దరు పెద్ద పిల్లలు అప్పుడే పుట్టిన పాపతో భర్త దగ్గరకు వెళ్లే సీను గుండెను పిండేసేలా ఉంటుంది. రాధమ్మ పాత్రకు ఎంతగా కనెక్ట్ అయ్యానంటే సీరియల్‌లోని నా కూతుళ్లు స్క్రీన్‌పై అందంగా కనిపించాలని నా చీరలు తెచ్చివ్వడం, ఇమిటేషన్, ఫ్యాషన్ జ్యువెలరీ ఐటమ్స్ తీసుకొచ్చి ఇవ్వడం నాది తల్లి పాత్ర కాబట్టి నేను ఎలా ఉన్నా పర్లేదు. పిల్లలు బాగా కనిపించాలనుకునేంతగా... తల్లిగా చక్రవాకం సీరియల్‌లో 500 ఎపిసోడ్లు చేశా. అప్పటికన్నా ఇప్పుడు అమ్మగా బాగా చేయగలుగుతున్నాను అనిపిస్తుంది.

### సెల్ఫీ ప్లీజ్ ...

నేను టైటిల్ రోల్‌లో నటించాలన్న ఇంద్రనీల్ కల ఇన్నాళ్లకు నెరవేరిందని చాలా సంతోషంగా ఉన్నాను. ఇటీవల మహాబలేశ్వరం వెళ్లినప్పుడు అక్కడ కొందరు తెలుగు వాళ్లు వచ్చి 'రాధమ్మా...' అని పిలిచారు. 'మా రాధమ్మతో ఓ ఫొటో తీయండి' అని ఇంద్రనీల్‌కి ఫోన్‌లు ఇచ్చి అడిగి మరీ ఫొటోలు తీసుకున్నారు. 'ఫీలయ్యావా!' అంటే 'నేను చాలా చాలా హ్యాపీ.. ఇలా ఫొటోలు తీసుకుంటూ గడిపేస్తా!' అని నవ్వేసారు.'

– సంభాషణ: **నిర్మలారెడ్డి**

ఫ్యామిలీ డాక్టర్

బీపీ కౌన్సెలింగ్

### పేరెంట్స్‌కు ఉంటే నాకూ హైబీపీ వస్తుందా?

నా వయసు 46 ఏళ్లు. మా తల్లిదండ్రులకు హైబీపీ ఉంది. ఇప్పుడు నాకో సందేహం వస్తోంది. పేరెంట్స్‌కు ఉండటం వల్ల ఇది నాకు కూడా వచ్చే అవకాశం ఉందా అన్న సంశయం నన్ను వేధిస్తోంది. దీన్ని నివారించడానికి సలహా ఇవ్వండి.

**– డి. సీతారామ్, విజయవాడ**

మీ తల్లిదండ్రులకూ లేదా మీ రక్తసంబంధీకులకు గానీ, మీకు చాలా దగ్గరి బంధువులకు గానీ అధిక రక్తపోటు ఉంటే, అది మీకు కూడా వచ్చే అవకాశాలు కాస్తంత ఎక్కువే. అయితే, మీ జీవనశైలిని ఆరోగ్యకరంగా మార్చుకోవడం ద్వారా కుటుంబంలో హైబీపీ చరిత్ర ఉన్నప్పటికీ దీన్ని చాలావరకు నివారించుకోవచ్చు. దీనికోసం మీరు చేయాల్సింది చాలా సులువు. అవి...

- క్రమం తప్పకుండా నిత్యం ఆరోగ్యకరమైన పోషకాహారాన్ని తీసుకోవాలి. అందునా సమతులాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. మీరు తీసుకునే ఆహారంలో ఉప్పు చాలా తక్కువగా తీసుకోవాలి. అంటే... మీరు అప్పడాలు, పచ్చళ్లు, నిల్వ ఉండే ఆహారాలు, బేకరీ ఐటమ్స్‌కు వీలైనంత దూరంగా ఉండండి. పెరుగు తినే సమయాల్లో పైనుంచి ఉప్పు వేసుకోవడం మానేయండి. చాలావరకు ఉప్పు తక్కువగా ఉండే చప్పిడి భోజనానికి అలవాటు పడటం మంచిది
- మీరు దినచర్యలో శారీరక శ్రమను పెంచండి. ఇందుకు నడక వంటి వ్యాయామాలు దీనికి బాగా ఉపకరిస్తాయి
- బరువు పెరగకుండా చూసుకోండి. మీ ఎత్తుకు మీరెంత బరువుండాలో దానికి మించకుండా నియంత్రించుకుంటూ ఉండండి
- పొగాకు వాడకాన్ని పూర్తిగా మానేయండి
- మీరు ఏవైనా మందులు వాడుతూ ఉంటే... డాక్టర్లు రాసిన ప్రిస్క్రిప్షన్‌లోని మందులను క్రమం తప్పకుండా తీసుకుంటూ ఉండండి. వారి సలహా మేరకు మాత్రమే మందులు వాడండి. మీ అంతట మీరు ఆన్ కౌంటర్ మెడిసిన్స్ వాడకండి
- ఆల్కహాల్ అలవాటు ఉంటే దానిని పూర్తిగా మానేయండి.

### అప్పుడు హైబీపీ లేకపోయినా ఉన్నట్టు వస్తుందేమో కదా?

నా వయసు 49 ఏళ్లు. ఇటీవల నాకు తరచూ తలనొప్పిగా ఉంటోంది. అంతేకాదు... బాగా తలతిరుగుతున్నట్లుగా అనిపిస్తోంది. ముందుకు పడిపోతానేమో అని ఆందోళన కూడా కలుగుతోంది. నా లక్షణాలు చూసిన నా స్నేహితులు బీపీ చెక్ చేయించుకోమంటున్నారు. దాంతో నాకు ఆందోళన మరింత ఎక్కువవుతోంది. ఇలా ఆందోళన బాగా పెరిగిపోవడం వల్ల ఒకవేళ నాకు లేకపోయినా హైబీపీ ఉన్నట్లుగా బీపీ చెకప్ చేయించుకున్నప్పుడు రిజల్ట్ వస్తుందేమోనని ఇంకా ఆందోళన పెరుగుతోంది. నాకు తగిన సలహా ఇవ్వగలరు.

**– సిహెచ్. రమేశ్, చౌటుప్పల్**

బీపీని కొలవకుండా కేవలం మీకు కనిపిస్తున్న లక్షణాలతో ఆ సమస్య ఉందని అనుకోవడం సరికాదు. మనలో రక్తపోటు పెరగడం వల్ల ఎండ్ ఆర్గాన్స్‌లో ముఖ్యమైనదైన మెదడులోని రక్తనాళాల చివరల్లో రక్తం ఒత్తిడి పెరగడం వల్ల తలనొప్పి రావచ్చు. అలాగే మన భంగిమ (పోష్చర్)ను అకస్మాత్తుగా మార్చడం వల్ల ఒకేసారి మనలో రక్తపోటు తగ్గవచ్చు. దీన్ని 'ఆర్థోస్టాటిక్ హైపోటెన్షన్' అంటారు. అలాంటి సమయాల్లోనూ మీరు చెప్పినట్లుగా ముందుకు పడిపోతారేమో లాంటి ఫీలింగ్, గిడ్డీనెస్ కలగవచ్చు. బీపీలో మార్పులు చోటు చేసుకోవడం వల్ల మీరు చెప్పిన లక్షణాలు కనిపించినప్పటికీ, అవి బీపీ వల్లనే అని చెప్పలేం. సాధారణంగా బీపీ వల్ల ఉదయం వేళల్లో తలనొప్పి వచ్చినప్పటికీ, ఇతర చాలా ఆరోగ్య సమస్యలలోనూ తలనొప్పి ఒక లక్షణంగా ఉంటుంది. అలాగే మీరు చెప్పిన గిడ్డీనెస్ సమస్యకూ వర్టిగో, సింకోప్ లాంటి మరెన్నో సమస్యలు కారణం కావచ్చు. అందుకని కేవలం లక్షణాల ఆధారంగానే బీపీ నిర్ధారణ చేయడం సరికాదు. అందుకే మీరు నిర్భయంగా ఒకసారి డాక్టర్‌ను కలవండి. వారు కూడా కేవలం ఒక్క పరీక్షలోనే బీపీ నిర్ధారణ చేయరు. అనేక మార్లు, అనేక సందర్భాల్లో బీపీని కొలిచిచూస్తారు. ఒకవేళ నిజంగానే సమస్య ఉంటే అప్పుడు మాత్రమే దాన్ని కచ్చితంగా నిర్ధారణ చేసి చికిత్స సూచిస్తారు.



**డాక్టర్ ఎమ్. గోవర్ధన్,** సీనియర్ ఫిజీషియన్, కేర్ హాస్పిటల్స్, నాంపల్లి, హైదరాబాద్



సాక్షి భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక, రోడ్ నంబరు-1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. ఈ-మెయిల్ sakshieducation@gmail.com
బుధవారం
19-2-2020


# అవుతారా... అటవీ అధికారి!

**యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) ఎగ్జామినేషన్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూ అనే మూడంచెల ఎంపిక ప్రక్రియ ద్వారా పోస్టుల భర్తీ చేపట్టనుంది. అన్ని దశల్లోనూ ప్రతిభచూపి ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన అభ్యర్థులు ఉన్నత స్థాయి అటవీ అధికారిగా నియమితులవుతారు. ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి హోదా, గుర్తింపు, జీతభత్యాలు, సౌకర్యాలు ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారులకు లభిస్తాయి. ఈ నేపథ్యంలో.. ఐఎఫ్ఎస్ 2020 నోటిఫికేషన్ సమాచారం.. అర్హతలు.. ఎంపిక ప్రక్రియ గురించి తెలుసుకుందాం...**



» ఐఎఫ్ఎస్ 2020కు నోటిఫికేషన్ విడుదల
» మూడంచెల్లో ఎంపిక ప్రక్రియ
» ప్రిలిమ్స్ పరీక్ష తేది: మే 31, 2020

» మొత్తం పోస్టుల సంఖ్య: 90
- **అర్హతలు:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి యానిమల్ హస్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత. అలాగే అగ్రికల్చర్/ఫారెస్ట్రీ/ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఫైనల్ ఇయర్ విద్యార్థులూ అర్హులే.
- **వయసు:** 21 ఏళ్ల నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ట వయో సడలింపు లభిస్తుంది.
- **అటెంప్ట్‌ల సంఖ్య:** జనరల్ అభ్యర్థులు ఆరు సార్లు, ఓబీసీలు 9సార్లు పరీక్షకు హాజరుకావచ్చు. ఎస్సీ/ఎస్టీలు గరిష్ట వయోపరిమితికి లోబడి ఎన్నిసార్లైనా రాయొచ్చు.
- **తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
- **తెలుగు రాష్ట్రాల్లో మెయిన్ పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** మార్చి 03. 2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ప్రిలిమ్స్ పరీక్ష:** మే 31, 2020
- **మెయిన్ పరీక్షలు:** నవంబర్ 2020
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in, www.upsconline.nic.in

### ఎంపిక విధానం

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియలో ప్రిలిమ్స్, మెయిన్, ఇంటర్వ్యూ అనే మూడు దశలు ఉంటాయి. తొలి దశ ప్రిలిమ్స్ పరీక్ష వడపోత ప్రక్రియ మాత్రమే. ఇందుకోసం యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షకు అభ్యర్థులు హాజరుకావాల్సి ఉంటుంది. ప్రిలిమ్స్‌లో నిర్దేశిత కటాఫ్ సాధించిన అభ్యర్థులను మెయిన్ పరీక్షలకు అనుమతిస్తారు. మెయిన్ రాత పరీక్షల్లో ప్రతిభ చూపిన వారిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. ఇంటర్వ్యూ 300 మార్కులకు జరుగుతుంది.

### ప్రిలిమ్స్‌లో రెండు పేపర్లు

సివిల్స్, ఐఎఫ్ఎస్‌కు ఉమ్మడిగా ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు.. జనరల్ స్టడీస్ పేపర్-1, జనరల్ స్టడీస్ పేపర్-2 ఉంటాయి. ఒక్కో పేపర్‌కు 200 మార్కుల చొప్పున మొత్తం 400 మార్కులకు ప్రిలిమ్స్ పరీక్ష జరుగుతుంది. ప్రిలిమ్స్ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. ఒక్కో పేపర్ పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. జనరల్‌స్టడీస్ పేపర్-2 అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో కనీసం 33 శాతం మార్కులు సాధించాలి. నెగిటివ్ మార్కుల విధానం అమల్లో ఉంది.

### ప్రిలిమ్స్ సిలబస్

పేపర్-1లో జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత గల కరెంట్ ఈవెంట్స్, భారత దేశ చరిత్ర, భారత స్వాతంత్రోద్యమం, భారత, ప్రపంచ భౌగోళిక శాస్త్రం, ఇండియన్ పాలిటీ, ఎకనామిక్ అండ్ సోషల్ డవలప్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్‌పై ప్రశ్నలు ఎదురవుతాయి. అలాగే పేపర్ -2లో కాంప్రెహెన్షన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, డిసిసెన్ మేకింగ్, ప్రాబ్లం సాల్వింగ్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, బేసిక్ న్యూమరసీపై ప్రశ్నలు అడుగుతారు.

### మెయిన్ ఎగ్జామినేషన్

- మెయిన్ పరీక్షలు వ్యాసరూప విధానంలో జరుగుతాయి. ఇందులో మొత్తం ఆరు పేపర్లు ఉంటాయి. పేపర్ 1- జనరల్ ఇంగ్లిష్ 300 మార్కులకు; పేపర్2-జనరల్ నాలెడ్జ్ 300 మార్కులకు నిర్వహిస్తారు. వీటితోపాటు ఎంపిక చేసుకున్న రెండు ఆప్షనల్ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కో సబ్జెక్టు నుంచి రెండు పేపర్ల చొప్పున నాలుగు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్ 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది. మెయిన్‌లో అన్ని ప్రశ్న పత్రాలు ఇంగ్లిష్‌లో ఉంటాయి. సమాధానాలు సైతం ఇంగ్లిష్‌లో మాత్రమే రాయాలి. ఒక్కో పేపర్ పరీక్ష సమయం మూడు గంటలు.
- మెయిన్‌లో ఆప్షనల్ సబ్జెక్టులు... అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, యానిమల్ హస్బెండరీ అండ్ వెటర్నరీ సైన్స్, బోటనీ, కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, జియాలజీ, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, జువాలజీ.

## జాబ్ పాయింట్

### బామర్‌లారీ-40

భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన బామర్‌లారీ దేశవ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 40 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ మేనేజర్-19, డిప్యూటీ మేనేజర్-6, మేనేజర్-3, సీనియర్ మేనేజర్-6, చీఫ్ మేనేజర్-5, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్-1.
- **అర్హత:** పోస్టులను బట్టి ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ ఇన్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ/ఎంఎస్‌డబ్ల్యూ, సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 9, 2020
- **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

### ఎల్‌హెచ్ఎంసీ-76

భారత ప్రభుత్వానికి చెందిన న్యూఢిల్లీలోని లేడీ హర్డింజ్ మెడికల్ కాలేజ్ (ఎల్‌హెచ్ఎంసీ).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 76 జూనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **అర్హత:** ఎంబీబీఎస్/బీడీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఇంటర్న్‌షిప్ చేసి ఉండాలి.
- **వయసు:** ఫిబ్రవరి 11, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** రాతపరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీలకు రూ.300; పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఎంబీబీఎస్ జూనియర్ రెసిడెన్స్-ఫిబ్రవరి 27, 2020; బీడీఎస్ జూనియర్ రెసిడెంట్స్-మార్చి 19, 2020.
- **వెబ్‌సైట్:** www.lhmc-hosp.gov.in

### కొచ్చిన్ షిప్‌యార్డ్-18

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన 18 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **విభాగాల వారీ ఖాళీలు:** మెకానికల్-5, ఎలక్ట్రికల్-3, ఎలక్ట్రానిక్స్-1, సివిల్-6, ఐటీ-3.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** ఫిబ్రవరి 28, 2020 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ ప్రతిభ, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 28, 2020
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.com

### టీటీడీ-7

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే).. 7 ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **అర్హత:** ఇంటర్మీడియట్/ఆపై విద్యార్హత. దివ్య ప్రబంధాలు, స్తోత్రాలు, ఉపయుక్త వేదాలు, పంచసూక్తాలు పుస్తక సహాయం లేకుండా చదవడం, ఇంగ్లిష్ నాలెడ్జ్ ఉండాలి.
- **వయసు:** 45 ఏళ్లకు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 9, 2020
- **వెబ్‌సైట్:** www.tirumala.org

### బీఐఎస్-50

భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖకు చెందిన ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 50 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **విభాగాల వారీ ఖాళీలు:** టెక్నికల్ అసిస్టెంట్ (ల్యాబొరేటరీ)-30;సీనియర్ టెక్నీషియన్-20.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఐటీఐ, మెట్రిక్యులేషన్, డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** ఆన్‌లైన్ పరీక్ష, స్కిల్/ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.50
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 8, 2020
- **వెబ్‌సైట్:** https://bis.gov.in

### డీఎఫ్‌సీసీఐఎల్-54

భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (డీఎఫ్‌సీసీఐఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 54 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **విభాగాల వారీ ఖాళీలు:** అసిస్టెంట్ మేనేజర్ (ఫైనాన్స్, ఐటీ)-30, జూనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్, ఫైనాన్స్, ఐటీ)-24.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, బీఈ/బీటెక్; ఎంబీఏ, సీఏ/సీఎంఏ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** జనవరి 1, 2020 నాటికి 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ), ఇంటర్వ్యూ,మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 15, 2020
- **వెబ్‌సైట్:** https://dfccil.com

### ఇస్రో-182

భారత ప్రభుత్వ అంతరిక్ష విభాగానికి చెందిన బెంగళూరులోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో).. యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్ (యూఆర్ఎస్సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 182 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- **పోస్టులు:** టెక్నీషియన్, డ్రాఫ్ట్స్‌మెన్, టెక్నికల్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, సైంటిఫిక్ అసిస్టెంట్, హిందీ టైపిస్ట్, కుక్, ఫైర్‌మెన్ తదితర విభాగాలున్నాయి.
- **విభాగాలు:** ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, ఎలక్ట్రికల్, ప్లంబర్, టర్నర్, మెషినిస్ట్, ఎలక్ట్రోప్లేటింగ్, మెకానికల్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి పదోతరగతి, సంబంధిత ట్రేడుల్లో/సబ్జెక్టుల్లో ఐటీఐ, డిప్లొమా(ఇంజనీరింగ్), గ్రాడ్యుయేషన్, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్‌టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 6, 2020
- **వెబ్‌సైట్:** www.isro.gov.in

### మెకాన్-80

రాంచీలోని భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన మెకాన్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 80 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎగ్జిక్యూటివ్ పోస్టులు: 49
- **విభాగాలు:** మేనేజ్‌మెంట్ అడ్వయిజరీ సర్వీసెస్, రాజభాష, కంప్యూటర్ సైన్స్, లీగల్, ఫైనాన్స్, మెడికల్, మార్కెటింగ్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ, ఎంబీఏ, మాస్టర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీబీఎస్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 30-52 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 20, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 20, 2020

2. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ప్రొఫెషనల్స్-31
- **పోస్టులు:** అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజనీర్, మేనేజర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ ఎగ్జిక్యూటివ్ తదితర పోస్టులున్నాయి.
- **విభాగాలు:** ఇన్‌స్ట్రుమెంటేషన్, మార్కెట్ రీసెర్చ్, సివిల్, మార్కెటింగ్, కెమిస్ట్, హ్యూమన్ రీసోర్స్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ డిగ్రీ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 32-48 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** షార్ట్‌లిస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఫిబ్రవరి 20, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 5, 2020
- **వెబ్‌సైట్:** www.meconlimited.co.in

### ఇండియన్ కోస్ట్‌గార్డ్-37

ఇండియన్ కోస్ట్‌గార్డ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 37 యాంత్రిక్ పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
- **విభాగాల వారీ ఖాళీలు:** యాంత్రిక్ టెక్నికల్ (మెకానికల్)-19, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రికల్)-3, యాంత్రిక్ టెక్నికల్ (ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్)-15.
- **అర్హత:** పోస్టులను బట్టి మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన అర్హత ఉండాలి.
- **వయసు:** ఆగస్టు 1, 1998-జులై 31, 2002 మధ్య జన్మించి ఉండాలి. (18-22 ఏళ్ల మధ్య ఉండాలి).
- **ఎంపిక:** రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** మార్చి 16, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** మార్చి 22, 2020
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in


ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగాలు-2020
❖ స్టడీ మెటీరియల్, బిట్‌బ్యాంక్, జీకే, మాక్ టెస్టులు, కరెంట్ అఫైర్స్, ప్రీవియస్ పేపర్స్, వీడియో గైడెన్స్, మోడల్ పేపర్స్ మొదలైనవి.
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి





## స్పెషల్ స్టోరీ

# విజేతల మనోగతం

## సీఏ ఫౌండేషన్

**చార్టర్డ్ అకౌంటెన్సీ.. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్ పేరుతో మూడు దశలుగా నిర్వహించే కోర్సు. ఇందులో తొలిదశ ఫౌండేషన్ నుంచే చక్కటి ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించడం చాలా అవసరం. ఎందుకంటే.. ఫౌండేషన్ కోర్సులో మెరుగ్గా రాణిస్తే మిగతా రెండు దశల్లో సబ్జెక్ట్‌లను ఆకళింపు చేసుకోవడం, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం తేలికవుతుంది. ఈ నేపథ్యంలో.. సీఏ ఫౌండేషన్‌లో రాణించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై.. తాజా సీఏ ఫౌండేషన్ ఫలితాల టాపర్లు ఏం చెబుతున్నారో చూద్దాం...**

### లక్ష్యంపై స్పష్టతతో విజయం

**- బి.ఈరేశ్,** సీఏ ఫౌండేషన్ ఆలిండియా 28వ ర్యాంకర్



**మాది** కర్నూలు జిల్లా, కోసిగి గ్రామం. లక్ష్యంపై స్పష్టత ఉంటే ఫౌండేషన్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సులభమే. వాస్తవానికి ఇంజనీరింగ్ లక్ష్యంగా ఎంపీసీలో చేరా. ఆ తర్వాత సీఏ కోర్సు ఎంపీసీ విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని తెలుసుకొని మాస్టర్‌మైండ్స్‌లో చేరా. కోర్సులో చేరిన రోజు నుంచే ఫౌండేషన్లో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించాలన్న లక్ష్యంతో రోజుకు 12 గంటలు కష్టపడ్డా. ఫలితంగా ఆలిండియా స్థాయిలో 28వ ర్యాంకు వచ్చింది. తరగతి గదిలో చెప్పిన అంశాలను ఏరోజుకారోజు చదువుతూ.. కాన్సెప్ట్స్ అవగాహన చేసుకుంటూ సాధన చేస్తే ఫౌండేషన్‌లో ఉత్తీర్ణత సాధించడం కష్టమేమీ కాదు. రివిజన్ ఎగ్జామ్స్, వీకెండ్ ఎగ్జామ్స్‌కు హాజరవడం కూడా నా విజయంలో కీలకంగా నిలిచింది. కోర్సులో చేరే వారు సిలబస్‌పై అవగాహన, కాన్సెప్ట్‌లపై పట్టు సాధించి, ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ సాగిస్తే.. ఫౌండేషన్‌లో విజయం సాధించటం తేలికే.

### ఇంజనీరింగ్ లక్ష్యం నుంచి సీఏ దిశగా

**- ఆర్.అనూష,** సీఏ-ఫౌండేషన్ జాతీయ స్థాయిలో 40వ ర్యాంకు



**మాది** శ్రీకాకుళం జిల్లా పలాస. నాన్న బాలకృష్ణ ఆటోడ్రైవర్. తొలుత ఇంజనీరింగ్‌పై ఆసక్తితో ఎంపీసీలో చేరా. ఐఐటీలో ర్యాంకు రాకపోవడం.. అదే సమయంలో సీఏ కోర్సు అవకాశాల గురించి తెలియడంతో సీఏ లక్ష్యంగా ఫౌండేషన్ కోర్సుకు నమోదు చేసుకున్నా. లక్ష్యం సాధించేందుకు తొలిరోజు నుంచీ కృషి చేశా. ఫౌండేషన్ పరీక్షల్లో రాణించాలంటే.. సిలబస్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి. వీలైనంత మేరకు రివిజన్‌కు ఎక్కువ సమయం కేటాయించేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి.

### హార్డ్ వర్క్‌తోనే సక్సెస్

**- టి.హరికృష్ణ,** సీఏ-ఫౌండేషన్ ఆలిండియా 45వ ర్యాంకు



**మాది** చిత్తూరు జిల్లాలోని వీకేఆర్ పురం గ్రామం. నాన్న రాజా, కూలీ. నాకు సీఏ పట్ల ఉన్న ఆసక్తితో పదో తరగతిలోనే సీఏ చదవాలని నిర్ణయించుకున్నా. అందుకే ఇంటర్లో ఎంఈసీ చేశా. ఆ తర్వాత ఫౌండేషన్ కోర్సులో చేరా. ఫౌండేషన్ కోర్సులో చేరినప్పటి నుంచి వీకెండ్ ఎగ్జామ్స్, సిలబస్‌ను పూర్తిగా ఆకళింపు చేసుకునేలా ఎప్పటికప్పుడు చదవడం, రివిజన్ టెస్ట్‌లకు హాజరు కావడం నా విజయానికి ఉపకరించాయి. సీఏ ఫౌండేషన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే.. కష్టపడే తత్వం తప్పనిసరి.

### నిర్దిష్ట ప్రణాళికతోనే విజయం

**-జి.విశ్వనాథ్,** సీఏ-ఫౌండేషన్ ఆలిండియా 49వ ర్యాంకు



**మాది** పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు. నాన్న వెంకట దుర్గా ప్రసాద్ వడ్రంగి వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నప్పటికీ.. నా లక్ష్యం తెలుసుకుని ప్రోత్సహించారు. దాంతో పదో తరగతి నుంచే సీఏ దిశగా అడుగులు వేశా. ఇంటర్లో ఎంఈసీ గ్రూప్‌లో చేరా. ఫౌండేషన్ కోర్సులో అడుగుపెట్టిన రోజు నుంచే నిర్దిష్ట ప్రణాళిక రూపొందించుకుని దాని ప్రకారం చదివా. అకౌంట్స్, లా సబ్జెక్ట్‌లకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చా. సిలబస్‌పై అవగాహనతో ఆయా సబ్జెక్ట్‌లలో మన సామర్థ్యం తెలుసుకొని.. ప్రిపరేషన్ వ్యూహాన్ని అనుసరిస్తే ఫౌండేషన్ పరీక్షలో మంచి మార్కులు సాధించొచ్చు.

### కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం

**- ఎం.త్రివేణి,** సీఏ-ఫౌండేషన్ ఆల్ ఇండియా 50వ ర్యాంకు



**నా** పేరు మామిడాల త్రివేణి. మాది కృష్ణా జిల్లా, నందిగామ. ఇంజనీరింగ్ లక్ష్యంగా ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీలో చేరా. జేఈఈ-మెయిన్‌లో 93.94 శాతం మార్కులతో మంచి ర్యాంకు సొంతం చేసుకున్నా. కానీ ఆ ర్యాంకుతో సుదూర ప్రాంతాల్లోనే సీటు వస్తుంది. అంత దూరం వెళ్లడం ఇష్టం లేకపోవడంతో సీఏ కోర్సుపై దృష్టిసారించా. ఫౌండేషన్ కోర్సులో చేరా. ఫౌండేషన్ సిలబస్‌లో నాకు కష్టంగా ఉండే ఎకనామిక్స్ సబ్జెక్ట్ ప్రిపరేషన్‌కు ఎక్కువ సమయం కేటాయించా. దీంతో ఫౌండేషన్‌లోని అన్ని సబ్జెక్ట్‌లపై చక్కటి అవగాహన వచ్చింది. నాలానే చాలా మంది విద్యార్థులకు క్లిష్టమైన సబ్జెక్ట్‌లుంటాయి. ఈ సబ్జెక్ట్‌లకు ఎక్కువ సమయం కేటాయిస్తూ.. రివిజన్ టెస్టులకు హాజరైతే ఆశించిన ఫలితం కచ్చితంగా వస్తుంది.

### ఏ గ్రూప్ వారికైనా అనుకూలమే

సీఏ కోర్సు, అందులోని తొలిదశ ఫౌండేషన్ కొన్ని గ్రూప్‌ల విద్యార్థులకే అనుకూలం అనేది అపోహ మాత్రమే. ఇంటర్లో ఏ గ్రూప్ చదివిన విద్యార్థులైనా ఫౌండేషన్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు ఆస్కారం ఉంది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం.. జాతీయ స్థాయిలో టాప్-50లో నిలిచిన పై ఐదుగురిలో ముగ్గురు ఎంపీసీ విద్యార్థులే. విద్యార్థులు తమ లక్ష్యానికి అనుగుణంగా తొలి రోజు నుంచే నిర్దిష్ట ప్రణాళికతో చదవాలి, కాన్సెప్ట్యువల్ అప్రోచ్‌తో వ్యవహరించాలి. అలా చేస్తే ఫౌండేషన్ పరీక్షల్లో తొలి ప్రయత్నంలోనే మంచి విజయం సాధించొచ్చు.



**- ఎం.ఎస్.ఎస్.ప్రకాశ్,** మాస్టర్‌మైండ్స్







## విమానం ఇంజిన్లో మంటలు..

**ముంబై:** అహ్మదాబాద్ నుంచి బెంగళూరు వెళ్లేందుకు సిద్ధమవుతున్న గోఎయిర్‌కు చెందిన జీ8–802 విమానం ఇంజిన్‌ను పక్షి ఢీ కొట్టడంతో కుడి పక్క ఇంజిన్‌లో మంటలు రేగాయి. దీంతో విమానాన్ని నిలిపివేసి ప్రయాణికులను దించేశారు. అనంతరం విమానాన్ని రన్‌వే నుంచి దూరంగా తీసుకెళ్లారు. ఈ ఘటన అహ్మదాబాద్ విమానాశ్రయంలో మంగళవారం చోటుచేసుకుంది. ఇందులో సిబ్బంది కాకుండా మొత్తం 134 మంది ప్రయాణికులు ఉన్నారు. వారంతా సురక్షితంగా ఉన్నారని గోఎయిర్ సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు. దాదాపు మూడున్నర గంటల తర్వాత మరొక విమానంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపించారు.




**చెన్నైకి చెందిన 93 ఏళ్ల శివసుబ్రమణియన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో పీజీ పూర్తిచేసి అతిపెద్ద వయసులో పీజీ పట్టా పొందిన వ్యక్తిగా నిలిచారు. ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమంలో సోమవారం తీసిందీ ఫొటో.**

## కంబళలో మరో బోల్ట్

నిశాంత్ శెట్టి సంచలనం | 13.61 సెకన్లలో | 143 మీటర్ల పరుగు

**యశవంతపుర:** బురద మడిలో దున్నపోతులను పరిగెత్తించే కర్ణాటక తీరప్రాంత సంప్రదాయ కంబళ పోటీల్లో సరికొత్త పరుగుల వీరులు వెలుగుచూస్తున్నారు. ఇటీవల పరుగులో ఉసేన్ బోల్ట్ కంటే వేగంగా పరిగెత్తాడని పేరు పొందిన మంగళూరువాసి శ్రీనివాసగౌడ రికార్డు మరిచిపోకముందే నిశాంత్ శెట్టి ఆ రికార్డును బద్దలు కొట్టారు. మంగళూరుకే చెందిన నిశాంత్ 143 మీటర్ల దూరాన్ని 13.61 సెకన్లలో అధిగమించాడు. శ్రీనివాసగౌడ 13.62 సెకన్లలో 143 మీటర్లు పరిగెత్తాడు. నిశాంత్ పరుగులు తీసిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. మేటి క్రీడాకారునిగా ఎదిగేలా భారతీయ క్రీడా ప్రాధికార సంస్థతో శిక్షణను ఇప్పిస్తామన్న కేంద్ర క్రీడల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆఫర్‌ను శ్రీనివాసగౌడ తిరస్కరించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిశాంత్‌శెట్టికి ఎలాంటి ఆఫర్ వస్తుందోనని ఆసక్తి నెలకొంది.



## ఇకపై భారీగా తత్కాల్ టికెట్లు..

**దళారుల అక్రమ సాఫ్ట్‌వేర్ల పని పట్టిన రైల్వే పోలీసులు**

**న్యూఢిల్లీ:** రైల్వే ప్రయాణికులకు శుభవార్త. ఇకపై తత్కాల్ టికెట్లు భారీ సంఖ్యలో అందుబాటులోకి రానున్నాయి. అక్రమ సాఫ్ట్‌వేర్లను ఏరివేయడమే కాకుండా.. తత్కాల్ టికెట్లను బ్లాక్ చేస్తున్న దాదాపు 60 మంది నకిలీ ఏజెంట్లను రైల్వే పోలీసులు అరెస్ట్ చేయడంతో భారీ తత్కాల్ టికెట్లు అందుబాటులోకి వస్తాయి. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంతో ఇప్పటివరకు నిమిషాల్లోనే తత్కాల్ టికెట్లు అయిపోతుండగా.. ఇప్పుడు ప్రయాణికులకు గంటల పాటు అందుబాటులోకి వస్తాయని ఆర్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ వెల్లడించారు. ఏఎన్ఎంఎస్, ఎంఏసీ, జాగ్వార్ తదితర అక్రమ సాఫ్ట్‌వేర్లు.. ఐఆర్‌సీటీసీ లాగిన్, కాప్చా, బ్యాంక్ ఓటీపీ స్టేజీలు లేకుండానే టికెట్లు బుక్ చేస్తున్నాయని అధికారులు వివరించారు. అయితే సాధారణ ప్రయాణికుడు మాత్రం ఈ స్థాయిలన్నీ దాటుకుంటే కానీ టికెట్ బుక్ కాదని పేర్కొన్నారు. సాధారణ ప్రయాణికుడికి సరాసరి 2.55 నిమిషాల సమయం పడుతుండగా, అక్రమ సాఫ్ట్‌వేర్ సాయంతో 1.48 నిమిషాలు మాత్రమే పడుతుందని చెప్పారు. దీనివల్ల సాధారణ ప్రయాణికులకు టికెట్లు దొరకడం కష్టమవుతుందన్నారు. గత రెండు నెలలుగా ఈ అక్రమ సాఫ్ట్‌వేర్ ద్వారా దళారులు ఒక్క టికెట్ కూడా బుక్ చేయకుండా రైల్వే కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంది.

## అఫ్గాన్ అధ్యక్ష పీఠం ఘనీదే



**కాబూల్:** అఫ్గానిస్తాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ రెండో విడతా పదవిలో కొనసాగనున్నారు. గత ఏడాది సెప్టెంబర్ 28వ తేదీన జరిగిన ఎన్నికల ఫలితాలను ఆ దేశ ఎన్నికల సంఘం దాదాపు ఐదు నెలల తర్వాత మంగళవారం వెలువరించింది. ఈ ఫలితాల్లో అష్రాఫ్ ఘనీకి 50.64 శాతం ఓట్లు లభించాయని ఎన్నికల సంఘం అధ్యక్షురాలు నూరిస్తానీ తెలిపారు. అఫ్గాన్ జనాభా 3.50 కోట్లు కాగా ఓటర్లు 96 లక్షలు. వీటిలో ఎన్నికల్లో పోలైంది 27 లక్షలు.

## సైనేడ్ కిల్లర్‌కు యావజ్జీవం



**మంగళూరు:** సైనేడ్ కిల్లర్ మోహన్‌కు కర్ణాటకలోని ఓ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అతడు చేసిన 20 హత్యల్లో 19వ హత్యకుగానూ ఈ శిక్షను మంగళవారం విధించింది. యావజ్జీవంతో పాటు రూ. 25వేల జరిమానా విధించింది. కేరళలోని కసరగడ్ జిల్లాకు చెందిన 23 ఏళ్ల యువతిని చంపినట్లు రుజువు కావడంతో ఈ శిక్షను జడ్జి ఖరారు చేశారు. అతడు గతంలోనూ పలు హత్యలు చేశాడు. 20 హత్యలు చేసినట్లు 2009లో అంగీకరించాడు. మోహన్ ఇప్పటికే అయిదు కేసుల్లో మరణ శిక్షను, మూడు కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తున్నాడు. అందులో రెండు మరణ శిక్షలను యావజ్జీవాలుగా మార్చారు.

## ట్రంప్‌కు జ్ఞాపికగా చర్ఖా!

**అహ్మదాబాద్:** భారత్ పర్యటనలో భాగంగా సబర్మతి ఆశ్రమానికి రానున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఒక చర్ఖాను, గాంధీజీ చిత్రపటాన్ని, మహాత్ముడి జీవన విధానాన్ని వివరించిన 'మై ఎక్స్‌పరిమెంట్స్ విత్ ట్రూత్', 'మై లైఫ్.. మై మెసేజ్' పుస్తకాలను బహూకరించనున్నారు. ట్రంప్, ఆయన భార్య మెలానియా ట్రంప్, భారత ప్రధాని మోదీ ఫిబ్రవరి 24న ఆశ్రమంలో కొద్దిసేపు గడుపుతారని సబర్మతి ఆశ్రమ ట్రస్టీలు కార్తికేయ సారాభాయి, అమృత్ మోదీ మంగళవారం వెల్లడించారు. చర్ఖాతో పాటు భారత స్వాతంత్ర్య సమరంలో చర్ఖా పోషించిన పాత్రకు సంబంధించిన వివరాలున్న చిన్న పుస్తకాన్ని ట్రంప్ దంపతులకు ఇస్తామని అమృత్ మోదీ వెల్లడించారు.

# కసబ్ కాదు.. దినేశ్ చౌధరి!



**ముంబై:** భారత్‌పై అనుక్షణం విషం చిమ్మే పాకిస్తాన్ ప్రేరేపిత ముంబై ఉగ్రదాడులు గుర్తున్నాయా? 2008లో నవంబర్ 26న 10 మంది లష్కరే తోయిబా ఉగ్రవాదులు ముంబైలోకి చొరబడి జరిపిన విచక్షణారహిత కాల్పుల్లో 166 మంది చనిపోయారు. ఆ టెర్రరిస్ట్‌ల్లో ప్రాణాలతో పట్టుబడింది అజ్మల్ కసబ్ మాత్రమే. కసబ్ ప్రాణాలతో పట్టుబడటం వల్ల ఈ దాడుల వెనుకనున్న పాక్ హస్తం బట్టబయలైంది. కసబ్‌ను హిందూత్వ ఉగ్రవాదిగా చిత్రీకరించి, ఆ దాడులు

- ముంబై ఉగ్రదాడులను హిందూ ఉగ్రదాడులుగా చిత్రించాలనుకున్నారు
- అందుకే కసబ్‌కు హిందూ పేరుతో నకిలీ ఐడీ కార్డ్ సృష్టించారు
- ముంబై మారణహోమంపై ఆసక్తికర అంశాలను వెల్లడించిన నాటి ముంబై సీపీ రాకేశ్ మారియా పుస్తకం



హిందూత్వ ఉగ్రదాడులుగా చిత్రించాలని కుట్ర పన్నడం, పోలీసులకు చిక్కిన కసబ్‌ను పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, లష్కరే సంస్థలు చంపాలనుకోవడం తదితర ఆసక్తికర అంశాలను ఆ కేసును విచారించిన ముంబై మాజీ సీనియర్ పోలీస్ అధికారి రాకేశ్ మారియా తన పుస్తకం 'లెట్ మి సే ఇట్ నౌ'లో కళ్లకు కట్టారు. కేసులో భాగంగా ఆనాడు కసబ్‌ను మారియా విచారించారు. సోమవారం మార్కెట్లోకి విడుదలైన ఆ పుస్తకంలోని పలు ఆసక్తికర అంశాలివి..

- నిజానికి ఐఎస్ఐ, లష్కరే ఆ దాడులను 2008లో నవంబర్ 26న కాకుండా, సెప్టెంబర్ 27వ తేదీన జరపాలనుకున్నాయి. ఆ తేదీ అప్పటి రంజాన్ ఉపవాస రోజుల్లో 27వది.
- కసబ్‌ను హిందూ ఉగ్రవాదిగా చిత్రించాలనుకున్నాయి. అందుకే, కసబ్ కుడి చేతికి ఎర్రని దారం కట్టింది. సమీర్ దినేశ్ చౌధరి అని, బెంగళూరు వాసి అని ఒక నకిలీ ఐడీ కార్డును సృష్టించాయి. భారత భద్రతాదళాల చేతిలో కసబ్ చనిపోతాడని, ఆ ఐడీ కార్డు ద్వారా అతడు హిందూ ఉగ్రవాదిగా ముద్రపడ్తాడని, మీడియా కూడా అదే విషయాన్ని ప్రచారం చేస్తుందని, మీడియా సంస్థలన్నీ బెంగళూరుకు వెళ్తాయని భావించాయి. కానీ, వారి ప్లాన్ ఫ్లాప్ అయింది. కసబ్ ప్రాణాలతో చిక్కాడు. ఆ విషయంలో కసబ్‌ను ప్రాణాలను పణంగా పెట్టి పట్టుకున్న కానిస్టేబుల్ తుకారాం ఓంబ్లే సాహసం అనన్యసామాన్యం. కసబ్ ఐడెంటిటీని వెంటనే బయటపెట్టకుండా పోలీసులు సంయమనం పాటించారు. దాంతో ఆయన అసలు ఐడెంటిటీ బయటపడింది. అతడు పాకిస్తాన్‌లోని ఫరీద్‌కోట్‌కు చెందిన అజ్మల్ అమిర్ కసబ్‌గా ప్రపంచానికి వెల్లడి చేయగలిగాం. హైదరాబాద్‌కు చెందిన అరుణోదయ కాలేజ్ నకిలీ ఐడీ కార్డులు ఇతర ఉగ్రవాదుల వద్ద లభించాయి.
- తమ ప్రమేయం బయటపడుతుందని ఐఎస్ఐ, లష్కరే భావించాయి. అందుకే భారత్‌లో జైళ్లో ఉన్న కసబ్‌ను హతమార్చాలని నిర్ణయించి ఆ బాధ్యతను మాఫియా డాన్ దావూద్ ఇబ్రహీం గ్యాంగ్‌కు అప్పగించాయి.
- నిజానికి దోపిడీలు చేసి డబ్బులు సంపాదించే ఉద్దేశంతో కసబ్ లష్కరే ఉగ్రసంస్థలో చేరాడు. అతడికి జిహాద్ అంటే ఏంటో కూడా తెలియదు. అయితే, కసబ్‌ను భారత్‌లో ఉగ్రదాడుల కోసం పంపాలని నిర్ణయించుకున్న తరువాత.. అతడికి భారత వ్యతిరేకత నూరిపోశారు. భారత్‌లో ముస్లింలను నమాజ్ చేయనివ్వరని అబద్ధాలు చెప్పారు. మేం ఒకసారి ముంబైలో అతడిని మసీదుకు తీసుకువెళ్లాం. అక్కడ జరుగుతున్న నమాజ్‌ను చూసి కసబ్ ఆశ్చర్యపోయాడు.
- భారత్ పంపేముందు కసబ్‌కు వారం పాటు సెలవు ఇచ్చి, రూ. 1.25 లక్షలు ఇచ్చి ఇంటికి పంపించారు. ఆ డబ్బును సోదరి వివాహానికి ఖర్చు చేయమని కుటుంబానికి ఇచ్చాడు.
- నవంబర్ 21, 2012న కసబ్‌ను పుణెలోని ఎరవాడ సెంట్రల్ జైళ్లో ఉరి తీశారు

# పెద్దల పోరులో పిల్లలే బాధితులు

- సుప్రీంకోర్టు వ్యాఖ్య



**న్యూఢిల్లీ:** తల్లిదండ్రులు విడిపోయే కేసుల్లో అంతిమంగా బాధితులయ్యేది వారి పిల్లలేనని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. తమ తప్పేమీ లేకుండానే వారు శిక్షను అనుభవిస్తారని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లిదండ్రుల్లో ఎవరి దగ్గర ఉండాలన్న న్యాయ పోరాటంలో చివరకు నష్టపోతోంది.. తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయతలను కోల్పోయి అందరికన్నా ఎక్కువ మూల్యం చెల్లిస్తోంది చిన్నారులేనని పేర్కొంది. కన్నవారి ప్రేమను పొందే హక్కు పిల్లలకు ఉంటుందని, ఆ హక్కును అంతా గౌరవించాలని, వివాహ బంధం విచ్ఛిన్నమైనంత మాత్రాన.. తల్లిదండ్రులుగా వారి బాధ్యత ముగిసిపోదని స్పష్టం చేసింది. పిల్లల భవిష్యత్తును, వారి ప్రయోజనాలను ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని వారిని తల్లిదండ్రుల్లో ఎవరి వద్ద ఉంచాలో నిర్ణయించాలని కోర్టులకు సూచించింది. దంపతులిద్దరూ కలిసి ఉండటం సాధ్యం కాదని తేలిన పక్షంలో.. చిన్నారుల కస్టడీ(తల్లిదండ్రుల్లో ఎవరి దగ్గర ఉండాలనే) విషయాన్ని అతి త్వరగా తేల్చాలని జస్టిస్ ఏఎం ఖన్వీల్కర్, జస్టిస్ అజయ్ రస్తోగిల ధర్మాసనం పేర్కొంది. 'కస్టడీ పోరులో తల్లిదండ్రుల్లో ఎవరు గెలిచినా.. చివరకు ఓడేది చిన్నారులే. ఈ పోరాటంలో అత్యధిక మూల్యం చెల్లిస్తోంది వారే' అని ధర్మాసనం ఆవేదన చెందింది. తల్లిదండ్రులు విడిపోవాలని నిర్ణయించుకున్న తరువాత వారిద్దరి పిల్లలు ఎవరి దగ్గర పెరగాలనే విషయంపై దాఖలైన ఒక వ్యాజ్యం విచారణ సందర్భంగా మంగళవారం సుప్రీంకోర్టు పై వ్యాఖ్యలు చేసింది. పిల్లలే కాదు.. వారి తాత, నానమ్మ/అమ్మమ్మలు కూడా మనవలు, మనవరాళ్ల ముద్దుముచ్చట్లను కోల్పోతున్నారని వ్యాఖ్యానించింది. ప్రస్తుత కేసులో దసరా, దీపావళి, వేసవి సెలవులను ఆ ఇద్దరు పిల్లలు తల్లిదండ్రుల్లో ఎవరి దగ్గర గడపాలో సూచిస్తూ 2017లో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొనసాగించాలని, వారి విడాకుల కేసును సంబంధిత కోర్టు ఈ సంవత్సరం డిసెంబర్ 31లోగా తేల్చాలని ఆదేశించింది. ఆ పిల్లలను బోర్డింగ్ స్కూళ్లో చేర్చాలని సుప్రీంకోర్టు 2017 నాటి ఆదేశాల్లో పేర్కొంది.

# గాంధీ వైపా? గాడ్సే వైపా?

- బిహార్ సీఎం నితీశ్‌కి ప్రశాంత్ కిశోర్ సూటి ప్రశ్న




**పట్నా:** ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గాంధీ భావజాలాన్ని సమర్థిస్తారో, గాంధీని చంపిన గాడ్సేని సమర్థిస్తున్నవారితో చేతులు కలుపుతారో తేల్చుకోవాలని స్పష్టం చేశారు. నితీశ్ ప్రభుత్వ అభివృద్ధి నమూనాపై ప్రశ్నల వర్షం కురిపించారు. తన భావజాలాన్ని పక్కనపెట్టి నితీశ్ ప్రభుత్వం బీజేపీతో చేతులుకలపడాన్ని దుయ్యబట్టారు. పౌరసత్వ సవరణ చట్టంపై తన వ్యతిరేకతను స్పష్టంచేసిన ప్రశాంత్ కిశోర్, గాంధీ, జయప్రకాష్ నారాయణ్, రామ్‌మనోహర్ లోహియాల సిద్ధాంతాలనూ, ఆదర్శాలనూ ఎన్నటికీ వీడబోనని ఎప్పుడూ చెపుతూ ఉండే నితీశ్ నాథూరాం గాడ్సేని సమర్థించే వారితో ఎలా ఉండగలుగుతారని ప్రశాంత్ కిశోర్ సూటిగా ప్రశ్నించారు. నితీశ్ బీజేపీ వైపు ఉండదల్చుకుంటే మాకేం అభ్యంతరం లేదనీ, అయితే ఇటు గాంధీ ఆదర్శాలను సమర్థిస్తూ, అటు గాడ్సే మద్దతుదారులతో చేతులుకలుపుతానంటే కుదరదన్నారు. ఉత్తమ టాప్ 10 రాష్ట్రాల్లో బిహార్‌ను ఒకటిగా చేసేందుకే 20వ తేదీన ''బాత్ బిహార్‌కీ'కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని ఆయన ప్రకటించారు. రాష్ట్రంలో యువనాయకులను తయారుచేసే దిశగా కృషిచేస్తానని తెలిపారు. వంద రోజుల్లో కోటిమంది యువతను కలుస్తానన్నారు. ప్రశాంత్ వ్యాఖ్యలపై జేడీ(యూ) స్పందించింది. నితీశ్‌ను విమర్శించే బదులు తన విలువైన సమయాన్ని 'వ్యాపారం' కోసం ప్రశాంత్ కేటాయిస్తే మంచిదని పార్టీ నేత కేసీ త్యాగి వ్యాఖ్యానించారు.

# సంస్కరణలపై స్పందించండి

**ఎన్నికల సంస్కరణల ప్రతిపాదనలను మరోసారి కేంద్రం దృష్టికి తీసుకువెళ్లిన ఈసీ**




**న్యూఢిల్లీ:** తప్పుడు అఫిడవిట్లు, చెల్లింపు వార్తలను ఎన్నికల నేరాలుగా పరిగణించడం సహా ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన పలు ప్రతిపాదనలను ఎన్నికల సంఘం కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది. ప్రధాన ఎన్నికల అధికారి సునీల్ అరోరా, కమిషనర్లు అశోక్ లావాసా, సుశీల్ చంద్ర మంగళవారం లెజిస్లేటివ్ సెక్రటరీ నారాయణ రాజుతో భేటీ అయ్యారు. ఓటరు జాబితాతో ఆధార్ నెంబర్‌ను అనుసంధానించే విషయం భేటీలో చర్చకొచ్చింది. ఓటర్లుగా నమోదు చేసుకోవాలనుకునే వారు, ఇప్పటికే ఓటర్లుగా నమోదైనవారు తమ ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని కోరేందుకు వీలుగా ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించాలని కోరుతూ ఇటీవల ఎన్నికల సంఘం కేంద్ర న్యాయ శాఖకు లేఖ రాసింది. అందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన న్యాయశాఖ.. ఆధార్ డేటా భద్రత విషయంలో తమకు హామీ ఇవ్వాలని కోరింది. దీనిపై డేటా భద్రతకు తీసుకోనున్న చర్యలను వివరిస్తూ ఎన్నికల సంఘం సమాధానమిచ్చింది. ఎన్నికల సంస్కరణలకు సంబంధించిన దాదాపు 40 ప్రతిపాదనలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న విషయాన్ని న్యాయశాఖ దృష్టికి తీసుకువెళ్లామని ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. కాగా, 20 మంది చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లు, పలువురు ఎన్నికల సంఘం అధికారులతో కూడిన 9 బృందాలు తాము రూపొందించిన సంస్కరణల ప్రతిపాదనలను మంగళవారం ఎన్నికల సంఘానికి సమర్పించాయి. ఇటీవలి లోక్‌సభ, ఇతర అసెంబ్లీ ఎన్నికల అనుభవాల ఆధారంగా ఈ సిఫారసులను రూపొందించారు.

# కోవిడ్‌కు వైద్యుడు బలి

**బీజింగ్/టోక్యో/న్యూఢిల్లీ:** కోవిడ్ తీవ్రత ఎక్కువగా ఉన్న వుహాన్ నగరంలో మరో వైద్యుడు చనిపోయారు. మంగళవారం నాటికి ఈ వైరస్‌తో మృతి చెందిన వారి సంఖ్య 1,868కు, బాధితుల సంఖ్య 72,436కు చేరిందని యంత్రాంగం తెలిపింది. కోవిడ్‌పై మొదటిసారిగా ప్రజలను అప్రమత్తం చేసేందుకు యత్నించిన వుహాన్ సెంట్రల్ ఆస్పత్రి ఆప్తల్మాలజిస్ట్ లి వెన్‌లియాంగ్ సహా ఆరుగురు వైద్య సిబ్బంది కోవిడ్‌తో చనిపోయినట్లు ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. మరో 1,700 మంది సిబ్బందికి వ్యాధి లక్షణాలు బయటపడినట్లు కూడా వెల్లడించింది. తాజాగా వుహాన్ వుచాంగ్ ఆస్పత్రి హెడ్, న్యూరో సర్జన్ డాక్టర్ లియు ఝిమింగ్ ఈ వైరస్ కారణంగానే మృతి చెందారని అధికార మీడియా ధ్రువీకరించింది. వుహాన్‌లో ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు అన్నారు. వ్యాధి బయటపడిన మొదట్లో అవగాహన లోపం కారణంగానే వైద్య సిబ్బందికి వైరస్ సోకిందని నిపుణులు అంటున్నారు. వ్యాధి తీవ్రతను బయటకు తెలియకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించడం కూడా ఇందుకు తోడైందని భావిస్తున్నారు. అయితే, చైనా కొత్త ఏడాది సెలవులను ముగించుకుని తిరిగి ఉద్యోగాల్లో చేరేందుకు నగరాలకు వచ్చే వారికి కోవిడ్ ముప్పు పొంచి ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

- చైనాలో 1,800 దాటిన మృతులు..
- మరో 72,436 మందికి వ్యాధి



**ఓడలో ఆరుగురు భారతీయులకు కోవిడ్**

కోవిడ్ భయంతో జపాన్ రాజధాని టోక్యో తీరంలో నిలిపేసిన డైమండ్ ప్రిన్సెస్ ఓడలో బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఓడలోని 3,711 మందిలో సోమవారం నాటికి 542 మందికి కోవిడ్ సోకినట్లు నిర్ధారణయిందని అధికారులు తెలిపారు. బాధితుల్లో ఆరుగురు భారతీయులు ఉన్నారని, వీరి పరిస్థితి మెరుగవుతోందని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారిపై పోరాటంలో చైనా విజయం సాధిస్తుందని భారత్‌లో ఆ దేశ రాయబారి సున్ వీన్‌డాంగ్ అన్నారు.

### వుహాన్‌కు ప్రత్యేక విమానం

వుహాన్‌కు 20వ తేదీన ప్రత్యేక విమానాన్ని పంపనున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. సీ–17 రకం భారీ సైనిక విమానంలో చైనాకు మందులు, ఇతర వైద్య సామగ్రిని తీసుకెళ్తామని, తిరుగు ప్రయాణంలో అక్కడ చిక్కుకుపోయిన భారతీయులను తీసుకువస్తామని సైనిక వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం వుహాన్ సహా హుబే ప్రావిన్స్ నుంచి 640 మంది భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చింది. హుబే ప్రావిన్స్‌లో ఇంకా 100 మంది వరకు భారతీయులున్నట్లు అధికారులు తెలిపారు.

### టాయిలెట్ పేపర్ల చోరీ

కోవిడ్ భయంతో జపాన్‌లో మాస్కులకు డిమాండ్ పెరిగిపోయింది. దుకాణాల్లో మాస్కుల కొరత ఏర్పడింది. దీంతో 65 మాస్కులుండే ఒక్కో బాక్స్ రూ.32 వేల వరకు ధర పలుకుతోంది. సోమవారం కోబె నగరంలోని రెడ్‌క్రాస్ ఆస్పత్రిలో 6 వేల మాస్కులున్న బాక్సులను దొంగలు మాయం చేశారు. హాంకాంగ్‌లోనూ మాస్కులు, టాయిలెట్ పేపర్ కొరత ఏర్పడింది. టాయిలెట్ పేపర్ లోడుతో వెళ్తున్న వాహనాన్ని కొందరు దుండగులు అడ్డగించి అందులోని సరుకునంతా లూటీ చేశారు.

## పాక్ గ్రే లిస్టులోనే..

**న్యూఢిల్లీ:** ఉగ్రసంస్థలకు నిధులు అందకుండా చేయడంలో విఫలమైన పాకిస్తాన్‌ను 'గ్రే లిస్ట్'లోనే కొనసాగించాలని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్) ఉపకమిటీ సిఫారసు చేసింది. ఫ్రాన్సు రాజధాని ప్యారిస్‌లో జరుగుతున్న ఎఫ్ఏటీఎఫ్‌కు చెందిన ఐసీఆర్‌జీ(ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ రివ్యూ గ్రూప్)ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీనిపై ఈ నెల 21వ తేదీన జరిగే ఎఫ్ఏటీఎఫ్ అత్యున్నత స్థాయి సమావేశం అంతిమ నిర్ణయం తీసుకోనుంది. 2008 ముంబై ఉగ్రదాడి సూత్రధారి హఫీజ్ సయీద్‌కు పాక్ న్యాయస్థానం 11 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ ఇటీవల తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఎఫ్ఏటీఎఫ్ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే పాక్ కోర్టు ఈ నిర్ణయం వెలువరించడాన్ని గ్రే జాబితా నుంచి బయటపడేందుకు పాక్ చేసిన ప్రయత్నంగా భావిస్తున్నారు.






సాక్షి బిజినెస్
బుధవారం 19-2-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 161 ▼ | 53 ▼ |
| 40,894 | 11,993 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,709 | ▼ 22 |
| డోజోన్స్ | 29,190 | ▼ 208 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,382 | ▼ 51 |
| డాక్స్ | 13,681 | ▼ 103 |
| షాంఘై | 2,985 | ▲ 1 |
| నికాయ్ | 23,193 | ▼ 329 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.65 | 72.29 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.32 | 94.56 |
| యూరో | ఎస్‌బీఐ | 75.98 | 78.87 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.97 | 66.38 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.81 | 48.94 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.50 | 52.25 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.30 | 19.91 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 19.02 | 20.23 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.60 | 10.86 |

# మళ్లీ పేలనున్న సెల్ బాంబ్!




**ఏడాదిలో మొబైల్ బిల్లు డబుల్!**
- రూ.300కు చేరనున్న ఏఆర్‌పీయూ
- అప్పుడే కంపెనీలకు దండిగా లాభాలు
- బకాయిలు కట్టేందుకు తప్పని చార్జీల పెంపు
- గత డిసెంబర్‌లో 42 శాతం వరకు పెంపు

**న్యూఢిల్లీ:** టెలికం సేవల మార్కెట్లోకి రిలయన్స్ జియో రాకతో ఎక్కువగా మురిసిపోయింది సగటు వినియోగదారుడేనని అనడంలో సందేహం లేదు. కానీ, మారిన పరిస్థితులతో ఇప్పుడు అదే వినియోగదారుడు ఆందోళన చెందాల్సిన పరిస్థితి...! కేంద్రానికి భారీ బకాయిలు కట్టాల్సి ఉన్న టెలికం కంపెనీలు ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలకు చార్జీలు పెంచడం ద్వారా నిధులు సమకూర్చుకోవడం మినహా ప్రత్యామ్నాయ మార్గాలు కనిపించడం లేదు. ఒకవైపు 4జీ నెట్‌వర్క్ విస్తరణపై భారీగా నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి.. మరోవైపు జియోకు వినియోగదారులు చేజారిపోకుండా కాపాడుకోవాల్సిన పరిస్థితి.. ఇంకోవైపు కేంద్రానికి భారీ బకాయిలు చెల్లించక తప్పని పరిస్థితి.. అందుకే గత డిసెంబర్‌లో ఏకంగా 42 శాతం వరకు చార్జీలను పెంచేసిన సంస్థలు.. తాజా పరిణామాల నేపథ్యంలో రానున్న ఏడాది కాలంలో మరింత పెంపునకు సిద్ధం అవుతున్నాయి. జియో రాక పూర్వం ఒక జీబీ డేటా వినియోగానికి రూ.200కుపైన ఖర్చు చేయాల్సిన పరిస్థితి. మొస్తరు కాల్స్ చేసుకునే వారు కూడా నెలకు రూ.200 వరకు వెచ్చించే వారు. కానీ, 2016లో జియో అడుగుపెట్టడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రయోగాత్మకంగా 4జీ సేవలను ఉచితంగా ఆరంభించిన జియో భారీగా వినియోగదారులను సొంతం చేసుకుంది. డేటా, కాల్స్‌ను పరిమితి లేకుండా ఉచితంగా అందించి వినియోగాన్ని కొత్త పుంతలు తొక్కించింది. జియో దెబ్బకు రిలయన్స్ కమ్యూనికేషన్స్, ఎయిర్‌సెల్, టాటా డొకొమో, టెలినార్ ఇలా అందరూ దుకాణాలను మూతేసుకోవాల్సి వచ్చింది. మూడేళ్లలోనే జియో చందాదారుల సంఖ్యా పరంగా నంబర్ 1 స్థానానికి చేరుకుంది. జియో విధ్వంసాన్ని తట్టుకోలేక ప్రధాన టెలికం ప్లేయర్లు వొడాఫోన్ ఇండియా, ఐడియా సెల్యులర్ విలీనమైన వొడాఫోన్ ఐడియాగా అవతరించాయి. చివరకు మూడు ప్రైవేటు సంస్థలు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా టెలికం మార్కెట్లో మిగిలాయి. ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు ప్రభావంతో గత 20 ఏళ్లకు సంబంధించి స్పెక్ట్రమ్, ఇతర బకాయిల రూపంలో టెల్కోలు ఇప్పుడు కేంద్రానికి రూ.1.47 లక్షల కోట్లను చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎయిర్‌టెల్ రూ.35వేల కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.53 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. ఈ ప్రభావాన్ని అధిగమించేందుకు వాటి ముందున్న మార్గం చార్జీల పెంపే. అదే జరిగితే డేటాను పొదుపుగా వాడుకోవాల్సిన రోజులు మళ్లీ వచ్చేలా ఉన్నాయి. లేదంటే జేబు నుంచి మరింత ఖర్చు చేయక తప్పదు. రానున్న ఏడాది కాలంలో సగటు వినియోగదారు నుంచి వచ్చే నెలవారీ ఆదాయం(ఏఆర్‌పీయూ) రెట్టింపు కావచ్చని టెలికం కంపెనీలు అంచనాలు వేసుకుంటున్నాయి.

**లాభాల్లోకి రావాలంటే పెంచాల్సిందే..**

''2020 చివరికి ఏఆర్‌పీయూ నెలకు కనీసం రూ.200 స్థాయికి, 2021 నాటికి కనీసం రూ.300కు చేరాల్సి ఉందన్న సంకేతాన్ని ఇచ్చాం. టారిఫ్‌ల పెంపు వినియోగాన్ని తగ్గించొచ్చేమో కానీ, సంఖ్యపై ప్రభావం చూపించదు'' అని సెల్యులర్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ రాజన్ ఎస్ మాథ్యూస్ తెలిపారు. 2019 మార్చి నాటికి ఏఆర్‌పీయూ రూ.113 స్థాయిలో ఉంది. దీనిపై కంపెనీలకు 18 శాతం నష్టాలు వచ్చాయి. ఏఆర్‌పీయూ 77 శాతం పెరిగి రూ.200కు చేరుకుంటే అప్పుడు కంపెనీలు లాభాల్లోకి ప్రవేశిస్తాయి. ఆదాయంలో లాభాలు 10 శాతానికి చేరుకుంటాయని కంపెనీల అంచనా. ఇక ఏఆర్‌పీయూ రూ.300కు చేరుకుంటే కంపెనీల ఆదాయంలో పన్ను అనంతరం లాభాలు 30–40 శాతానికి విస్తరిస్తాయి. అయితే టెలికం నెట్‌వర్క్‌పై పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాల్సి ఉన్నందున వాస్తవ లాభాలు తక్కువగానే ఉంటాయన్నది విశ్లేషణ. వచ్చే పలు త్రైమాసికాల్లో ఏఆర్‌పీయూ రూ.200కు, ఆ తర్వాత కొంత కాలానికి రూ.300కు చేరుకుంటుందని భారతీ ఎయిర్‌టెల్ విశ్లేషకులకు ఇప్పటికే తెలియజేయడం గమనార్హం. ముఖ్యంగా ఏజీఆర్ బకాయిల భారాన్ని వినియోగదారులకు బదిలీ చేసే పరిస్థితులు తేటతెల్లంగా కనిపిస్తున్నాయి. కానీ, మార్కెట్లోకి లేటుగా వచ్చిన జియోకు ఈ ఏజీఆర్ భారం ఏమీ లేకపోవడంతో.. టారిఫ్‌ల పెంపు రూపంలో ఆ సంస్థకు లాభాల వరద పారనుంది.

**కలవరపరిచే టెలికం గణాంకాలు**

| | 2019 మార్చికి | 2020 చివరికి (అంచనా) | 2021 నాటికి (అంచనా) |
|---|---|---|---|
| ఏఆర్‌పీయూ | రూ.113 | రూ.200 | రూ.300 |
| స్థూల ఆదాయం | 1,51,000 | 2,68,000 | 4,01,000 (రూ.కోట్లలో) |
| లాభం | -27,000 | 28,000 | 1,62,000 (రూ.కోట్లలో) |
| లాభాల మార్జిన్ | -17.7% | 10.4% | 40.3% |

**ఐడియా మూసేస్తే..**

వొడా–ఐడియా ఒక్కో త్రైమాసికంలో రూ.6వేల కోట్లకు పైగా నష్టాలను ఎదుర్కొంటోంది. గత చార్జీల పెంపు సంస్థకు కలసి రాలేదు. పైగా కేంద్రానికి రూ.53 వేల కోట్ల వరకు కట్టాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఉపశమనం రాకపోతే సంస్థను మూసేయక తప్పదని కుమారమంగళం బిర్లా బహిరంగంగానే సంకేతమిచ్చారు. ఒకవేళ వొడా–ఐడియా దుకాణం బంద్ అయితే, ఈ సంస్థ చందాదారుల్లో (సుమారు 30 కోట్లు) కనీసం సగం మందిని అయినా సొంతం చేసుకోవడం ద్వారా 50 కోట్ల మార్క్‌ను అధిగమించాలని, 64.6 కోట్ల చందాదారుల లక్ష్యాన్ని చేరుకోవాలన్న ప్రణాళికలతో జియో సిద్ధంగా ఉందని తెలుస్తోంది. వొడా–ఐడియా నిష్క్రమణ చందాదారుల పరంగా అటు ఎయిర్‌టెల్ కూడా కలసి రానుంది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ ఇప్పటికీ 4జీ సేవల్లో లేదు కనుక ఆ సంస్థకు వెళ్లే చందాదారులు తక్కువగానే ఉంటారని అంచనా.

## ఎల్ఐసీ ఐపీఓ మంచిదే: ఐఆర్‌డీఏఐ చైర్మన్

**ముంబై:** ఎల్ఐసీ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్)కు సంబంధించిన ప్రతిపాదన ఏదీ ప్రస్తుతానికైతే తమ వద్దకు రాలేదని బీమా నియంత్రణ సంస్థ, ఐఆర్‌డీఏఐ తెలిపింది. పారదర్శకత, ఇతర అంశాల దృష్ట్యా చూస్తే, ఎల్ఐసీ ఐపీఓకు రావడం మంచి ప్రయత్నమేనని ఐఆర్‌డీఏఐ చైర్మన్ ఎస్.సి. కుంతియా పేర్కొన్నారు. అసలు ప్రతీ బీమా కంపెనీ కూడా స్టాక్ మార్కెట్లో లిస్టయితే మంచిదని వివరించారు.



బీమా పాలసీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఆదాయపు పన్ను మినహాయింపులు వచ్చేవని, అయితే తాజా బడ్జెట్‌లో ఈ మినహాయింపులు తొలగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల బీమా సంస్థలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించారు. కొంత కాలం ఈ మినహాయింపులు లభిస్తాయని పేర్కొన్నారు. నష్టాలు వచ్చే పాలసీలను పక్కనబెట్టి, లాభాలు వచ్చే పాలసీలపై బీమా కంపెనీలు దృష్టి సారించాలని కుంతియా పిలుపునిచ్చారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ @ 25 ఏళ్లు




**ముంబై:** ప్రైవేటు రంగంలో అగ్రగామి అయిన 'హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు' మంగళవారం నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 25 లక్షల మొక్కలు నాటాలని, అలాగే, 2,500 తరగతి గదులను డిజిటల్‌గా మార్చాలని బ్యాంకు నిర్ణయించింది. సెంట్రల్ ముంబైలోని మున్సిపల్ పాఠశాలలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎండీ ఆదిత్య పురి జామ మొక్కను నాటారు. ''స్వచ్ఛమైన పర్యావరణానికి, స్మార్ట్ తరగతులకు ప్రత్యామ్నాయాలు ఏవీ లేవు. మన దేశం అంతర్జాతీయ శక్తిగా అవతరించేందుకు ఈ రెండు తప్పనిసరి'' అని ఆయన వ్యాఖ్యానించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మార్కెట్ విలువ రూ.6.64 లక్షల కోట్ల మార్క్ వద్ద ఉంది.

## కేసీపీ గ్రూపు అధినేత వీఎల్ దత్ కన్నుమూత




**కొరుక్కుపేట (చెన్నై, సాక్షి):** తెలుగు వ్యక్తి, ప్రముఖ పారిశ్రామికవేత్త, కేసీపీ గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ వీఎల్ దత్ (82) గుండెపోటు కారణంగా మంగళవారం చెన్నైలో కన్నుమూశారు. ఆయనకు సతీమణి డాక్టర్ వీఎల్ ఇందిరాదత్, కుమార్తె కవితా దత్ ఉన్నారు. 1937 డిసెంబర్ 27న జన్మించిన వెలగపూడి లక్ష్మణదత్ (వీఎల్‌దత్) లండన్‌లోని బిజినెస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఉన్నత విద్యనభ్యసించారు. కేసీపీ గ్రూపు సిమెంట్, చక్కెర తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ''డాక్టర్ వీఎల్ దత్ అకాల మరణానికి సంతాపం తెలియజేస్తున్నాము. పరిశ్రమలకు, దేశానికి ఆయన అందించిన సేవలను ఫిక్కీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుంది'' అని ఫిక్కీ ప్రెసిడెంట్ సంగీతా రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీఎల్ దత్ 1991–92 వరకు ఫిక్కీ ప్రెసిడెంట్‌గా పనిచేశారు.

**సీఎం జగన్ సంతాపం**

వీఎల్ దత్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా దత్ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు.

## ఏజీఆర్ 'పరిష్కారం'పై వొడా–ఐడియా కసరత్తు..

**టెలికం కార్యదర్శితో చైర్మన్ బిర్లా భేటీ**

**న్యూఢిల్లీ:** ఏజీఆర్ బాకీల కారణంగా దివాలా తీసే పరిస్థితుల్లో ఉన్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐఎల్) .. ఈ సమస్య నుంచి గట్టెక్కడంపై కసరత్తు చేస్తోంది. కంపెనీ చైర్మన్ కుమార మంగళం బిర్లా .. మంగళవారం కేంద్ర టెలికం శాఖ కార్యదర్శి అన్షు ప్రకాష్‌తో సమావేశమయ్యారు. దాదాపు గంటపాటు సాగిన చర్చల్లో వొడాఫోన్ ఐడియా ఎండీ, సీఈవో రవీందర్ టక్కర్ కూడా పాల్గొన్నారు. అయితే, చర్చల సారాంశాన్ని వెల్లడించేందుకు బిర్లా నిరాకరించారు. 'ఇప్పుడే ఏం చెప్పలేము' అంటూ భేటీ అనంతరం ఆయన వ్యాఖ్యానించారు. వీఐఎల్ సంస్థ ఏజీఆర్ బాకీలు కట్టగలదా, దివాలా ప్రకటించే అవకాశం ఉందా వంటి ప్రశ్నలకు ఆయన సమాధానమివ్వడానికి నిరాకరించారు. సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) లెక్కల ప్రకారం లైసెన్సు ఫీజులు, స్పెక్ట్రం



యూసేజీ చార్జీల కింద టెల్కోలు దాదాపు రూ. 1.47 లక్షల కోట్లు కట్టాలంటూ టెలికం శాఖ డిమాండ్ చేస్తోంది. వీఐఎల్ సుమారు రూ. 53,000 కోట్లు కట్టాల్సి ఉంది. బాకీల చెల్లింపుల్లో ఆదేశాల ఉల్లంఘనపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో మిగతా టెల్కోలతో పాటు వీఐఎల్ సోమవారం రూ. 2,500 కట్టింది. మరో వారం రోజుల్లోగా ఇంకో రూ. 1,000 కోట్లు కడతామని పేర్కొంది. మరోవైపు, బాకీలు కట్టని టెల్కోల బ్యాంకు గ్యారంటీలను స్వాధీనం చేసుకోవాలని టెలికం శాఖ భావిస్తోంది. అదే జరిగితే వీఐఎల్ వంటివి మూతబడే ప్రమాదముంది. బాకీలపై వెసులుబాటు లభించకపోతే మూసివేత తప్పదంటూ బిర్లా గతంలోనే వ్యాఖ్యానించడం గమనార్హం.

## బీఎస్ఎన్ఎల్ ఆఫీసుల్లో వాహనాల చార్జింగ్ స్టేషన్లు

**ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం**

**న్యూఢిల్లీ:** విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వ రంగ సంస్థలైన ఎనర్జీ ఎఫీషియన్సీ సర్వీసెస్ (ఈఈఎస్ఎల్), బీఎస్ఎన్ఎల్ చేతులు కలిపాయి. దశల వారీగా దేశ వ్యాప్తంగా 1,000 బీఎస్ఎన్ఎల్ సైట్లలో చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పేందుకు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. దీని ప్రకారం చార్జింగ్ సర్వీసులకు అవసరమైన ఇన్‌ఫ్రా ఏర్పాటు, నిర్వహణ మొదలైన వాటికి కావాల్సిన నిధులను ఈఈఎస్ఎల్ ఇన్వెస్ట్ చేయనుంది. స్థలం, విద్యుత్ కనెక్షన్లను.. బీఎస్ఎన్ఎల్ సమకూరుస్తుంది. జాతీయ విద్యుత్ వాహన పథకంలో భాగంగా ఈఈఎస్ఎల్ ఇప్పటిదాకా దేశవ్యాప్తంగా 300 ఏసీ, 170 డీసీ చార్జర్లను ఏర్పాటు చేసింది.



## హీరో మోటో భారీ విస్తరణ ప్రణాళికలు

**వచ్చే 5-7 ఏళ్లలో రూ. 10,000 కోట్ల పెట్టుబడి**

**న్యూఢిల్లీ:** హీరో మోటోకార్ప్.. భారీ విస్తరణ ప్రణాళికలను చేపట్టనుంది. ఇందు కోసం వచ్చే 5–7 ఏళ్లలో రూ. 10,000 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పవన్ ముంజాల్ ప్రకటించారు. ఈ ఏడాదిలో 10 కోట్ల వాహన విక్రయాల మైలురాయిని అధిగమించే అవకాశం ఉందని వెల్లడించారు.

**బీఎస్–6 గ్లామర్ విడుదల:** భారత్ స్టేజ్ (బీఎస్)–6 ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉన్న హీరో గ్లామర్ బైక్‌ను కంపెనీ మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దీని ధరల శ్రేణి రూ. 68,900– 72,000




కాగా, ప్యాషన్ ప్రో ధరల శ్రేణి రూ. 64,990–67,190గా నిర్ణయించింది. ఎక్స్‌ట్రీమ్ 160ఆర్ బైక్‌ను ఆవిష్కరించింది. ఇది ఈ ఏడాది మార్చి నుంచి అందుబాటులోకి వస్తుందని వెల్లడించింది.

## రూ.3,499కే అంతర్జాతీయ విమాన టికెట్




**న్యూఢిల్లీ:** చౌక ధరల విమానయాన సంస్థ ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో) రూ.3,499కే విదేశీ రూట్లలో విమాన టికెట్ అందిస్తోంది. నాలుగు రోజులపాటు కొనసాగే ఈ అంతర్జాతీయ చౌక చార్జీల ఆఫర్ మంగళవారం (18న) ప్రారంభమైంది. ఫిబ్రవరి 21తో ముగియనుంది. తాజా డిస్కౌంట్‌లో భాగంగా మొత్తం 2.5 లక్షల సీట్లు అందుబాటులో ఉన్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి సెప్టెంబర్ 30 వరకు జరిగే ప్రయాణాలపై డిస్కౌంట్ వర్తిస్తుంది.

**సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...**
- నాణ్యమైన కంపెనీలు ఖరీదైనా..!?
- నిఫ్టీలో లాంగ్ పొజిషన్స్ తీసుకోవచ్చు!
- ఎంఏసీడీ ప్రకారం ఈ షేర్లలో బుల్లిష్ సంకేతాలు!
- వీఐఎల్ నిష్క్రమిస్తే ఎయిర్‌టెల్, జియోలపై ఆర్థిక భారం?!

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
WWW.BUSINESS.SAKSHI.COM

# ఫార్మాకు 'కోవిడ్' ఫీవర్!!

- పెరగనున్న ముడి వస్తువుల రేట్లు
- ఆందోళనలో ఔషధ రంగం
- తోడ్పాటు చర్యలపై ఆర్థిక మంత్రి భరోసా



**న్యూఢిల్లీ:** చైనా సహా పలు దేశాలకు విస్తరించిన కరోనావైరస్ సెగ దేశీ ఫార్మా పరిశ్రమకు తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ చైనాలో పరిస్థితులు గానీ సత్వరం చక్కబడకపోతే ఔషధాల్లో ఉపయోగించే ముడి వస్తువుల రేట్లు గణనీయంగా పెరగవచ్చని ఫార్మా సంస్థలు ఆందోళన చెందుతున్నాయి. 'ఇదే పరిస్థితి కొనసాగితే యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) ధరలు పెరిగిపోతాయి' అని జైడస్ గ్రూప్ చైర్మన్ పంకజ్ పటేల్ వెల్లడించారు. 2018–19 గణాంకాల ప్రకారం.. భారత సంస్థలు దిగుమతి చేసుకునే బల్క్ డ్రగ్స్‌లో సింహభాగం 67.56 శాతం వాటా చైనాదే ఉంది. కరోనా వైరస్‌కు సంబంధించి తాజా పరిస్థితులపై ఫార్మాతో పాటు టెక్స్‌టైల్స్, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ హార్డ్‌వేర్, సోలార్, ఆటో, సర్జికల్ ఎక్విప్‌మెంట్స్, పెయింట్స్ తదితర రంగాల ప్రతినిధులు మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. దేశీ పరిశ్రమలపై కరోనావైరస్ ప్రతికూల ప్రభావాలు పడకుండా చూసేందుకు ప్రభుత్వం త్వరలో తగు చర్యలు ప్రకటిస్తుందని ఆమె భరోసా ఇచ్చారు.

**ఆందోళన వద్దు: నిర్మలా సీతారామన్**

కీలక ముడి వస్తువుల దిగుమతుల్లో జాప్యం వల్ల ఫార్మా, కెమికల్, సౌర విద్యుత్ పరికరాల రంగాలపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు కనిపిస్తున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. అయితే, కరోనావైరస్ కారణంగా ధరల పెరుగుదల గురించి ఆందోళన అక్కర్లేదని ఆమె చెప్పారు. ఔషధాలు, మెడికల్ పరికరాల కొరత లేదన్నారు. కొన్ని ఉత్పత్తుల ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయాలని ఫార్మా పరిశ్రమ కోరుతోందని నిర్మలా సీతారామన్ చెప్పారు. మరోవైపు, దేశీ ఫార్మా సంస్థలకు ఏపీఐల సరఫరాపై కరోనావైరస్ ప్రభావాల మీద ఫార్మా విభాగం (డీవోపీ) అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. చైనాలో నూతన సంవత్సర సెలవుల కారణంగా గత 20–25 రోజులుగా సరఫరా ఆగిపోయిందని పేర్కొన్నాయి. బల్క్ డ్రగ్స్ కోసం భారత ఫార్మా సంస్థలు ఎక్కువగా చైనా మీదే ఆధారపడుతున్నాయి.

### రెండు, మూడు నెలల స్టాక్ మాత్రమే ఉంది: ఐపీఏ

**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** భారత ఔషధ పరిశ్రమ వద్ద రెండు, మూడు నెలలకు సరిపడ మాత్రమే యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ నిల్వలు ఉన్నాయని ఇండియా ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ) వెల్లడించింది. చైనా నుంచి ఏటా రూ.17,000 కోట్ల విలువైన ముడి సరుకు (ఏపీఐ) భారత్ దిగుమతి చేసుకుంటోంది. ఆ దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితిని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లినట్టు ఐపీఏ సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. బయో ఆసియాలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మంగళవారం మాట్లాడారు. 'క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నాం. ఏం జరుగుతుందో ఊహించే పరిస్థితి లేదు. రెండు, మూడు నెలలకు సరిపడ మాత్రమే నిల్వలున్నాయి. మార్చి మొదటి వారం నుంచి సాధారణ స్థితి నెలకొంటుందని భావిస్తున్నాం' అన్నారు.

## యాపిల్‌కూ 'వైరస్'

**శాన్‌ఫ్రాన్సిస్కో/క్యూపర్టినో:** కోవిడ్–19(కరోనా) వైరస్ ప్రభావం ఆపిల్ కంపెనీపై పడింది. ఈ మార్చి క్వార్టర్‌లో ఆదాయ అంచనాలను అందుకోలేమని ఐఫోన్స్ తయారు చేసే యాపిల్ కంపెనీ సోమవారం వెల్లడించింది. ఈ వైరస్ వ్యాప్తి కారణంగా చైనాలో ఐఫోన్‌ల తయారీ దెబ్బతిన్నదని, ఫలితంగా తగిన స్థాయిలో ప్రపంచవ్యాప్తంగా ఐఫోన్‌లను సరఫరా చేయలేమని తెలిపింది. అంతేకాకుండా చైనాలో యాపిల్ స్టోర్స్‌ను కొన్ని రోజులు మూసేశామని, అమ్మకాలు, డిమాండ్ కూడా తగ్గాయని వివరించింది. స్టోర్స్ కొన్నింటిని తెరచినప్పటికీ, కొనుగోళ్లు అంతంతమాత్రంగానే ఉన్నాయని తెలిపింది. ఈ అంశాలన్నీ ఆదాయంపై ప్రభావం చూపగలవని పేర్కొంది. ఆదాయ అంచనాలను అందుకోలేమని స్పష్టం చేసింది.



ఈ మార్చి క్వార్టర్‌లో ఆదాయం 6,300 కోట్ల డాలర్ల నుంచి 6,700 కోట్ల డాలర్ల మేర (రూ.4.5–4.7 లక్షల కోట్లు)ఆదాయం రాగలదని యాపిల్ అంచనా వేసింది. ఐఫోన్‌లు అత్యధికంగా అమ్ముడయ్యే అతి పెద్ద మూడో మార్కెట్ చైనాయే. చైనా కాకుండా ఇతర మార్కెట్లలో అమ్మకాలు పటిష్టంగా ఉన్నాయని యాపిల్ పేర్కొంది. కరోనా వైరస్ ప్రభావం తగ్గి సాధారణ పరిస్థితులు త్వరలోనే నెలకొనగలవని అంచనా వేశామని, ఈ అంచనాలు తప్పాయని పేర్కొంది. కాగా కరోనా కాటు యాపిల్‌పైనే కాకుండా ఇతర దిగ్గజ కంపెనీలపై కూడా పడింది. యాపిల్ సరఫరాదారు ఫాక్స్‌కాన్, వాహన దిగ్గజం టయోటా, స్పోర్ట్స్‌వేర్ కంపెనీలు నైకీ, ఆడిడాస్‌లు కూడా తమ ఆదాయంపై కరోనా ప్రభావం ఉండగలవని పేర్కొన్నాయి.



# గజ్వేల్..'పట్టణ ప్రగతి'కి మోడల్

**సీఎం ఆలోచనా విధానం మంత్ర ముగ్ధులను చేసింది**
- మంత్రులు, ఎమ్మెల్యేలు, చైర్మన్‌ల బృందం ప్రశంసలు
- గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో పర్యటన
- ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వైకుంఠధామం, అర్బన్ పార్కుల సందర్శన
- బృందానికి దిశానిర్దేశం చేసిన మంత్రి హరీశ్‌రావు

**గజ్వేల్:** 'ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మెరుగైన పట్టణ జీవన వ్యవస్థను తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నం ప్రశంసనీయం.. ఇక్కడ నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్, వైకుంఠధామం, అర్బన్ పార్కులాంటి నిర్మాణాలు తలమానికంగా నిలుస్తున్నాయి'అని పలువురు మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్ల బృందం కొనియాడింది. 'పట్టణ ప్రగతి'పై హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌తో సమీక్షలో పాల్గొన్న వీరంతా అక్కడి నుంచి బస్సుల్లో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని సందర్శించారు. హరీశ్‌రావు నేతృత్వంలో మంత్రులు ఈటల రాజేందర్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్ తదితరులతో పాటు కలెక్టర్లు, పలువురు ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్ కమిషనర్లు ఇక్కడ పర్యటించారు. ముందుగా మున్సిపాలిటీకి సరిహద్దులో ఉన్న వర్గల్ మండలం సింగాయపల్లి అటవీ ప్రాంతాన్ని ఈ బృందం సందర్శించింది. తర్వాత బృందం గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా మార్కెట్లో కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం విక్రయాలను, మార్కెట్లోని ఇతర దుకాణ సముదాయాలను పరిశీలించి ముగ్ధులయ్యారు. మంత్రులు సబిత, సత్యవతితో పాటు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పలువురు మహిళా మున్సిపల్ చైర్మన్లు కూరగాయల వ్యాపారులతో ముచ్చటించారు. తమ దుకాణానికి వచ్చి కూరగాయలు కొనుగోలు చేసిన మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డిలను ఓ మహిళా కూరగాయల వ్యాపారి ఆనందంతో పూలదండలు వేసి సన్మానించారు. ఇది పూర్తయ్యాక వారంతా తిరిగి బస్సుల్లో పట్టణంలోని వైకుంఠధామంను సందర్శించి పరిసరాలను ఆసక్తిగా పరిశీలన జరిపారు. ఆ తర్వాత అర్బన్ పార్కును సందర్శించారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఓపెన్‌జిమ్‌లో కొద్దిసేపు గడిపారు.అర్బన్ పార్కు నిర్మాణం జరిగిన విధానం కూడా తమను ఆకట్టుకుందని.. ఇలాంటి నిర్మాణాలు తమ జిల్లాల్లో కూడా జరిగేలా చొరవ చూపుతామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు పార్కులో కలియదిరిగి తమ జిల్లాలో ఎక్కడెక్కడ ఇలాంటివి నిర్మించుకోవాలనే అంశంపై చర్చించుకున్నారు. వారి వెంట వంటేరు ప్రతాప్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ భూపతిరెడ్డి తదితరులు ఉన్నారు.


మంగళవారం గజ్వేల్ మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తున్న మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు


మంత్రులు, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న హరీశ్‌రావు

### మెరుగైన వసతులే సీఎం లక్ష్యం : హరీశ్

రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మెరుగైన వసతులే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పనిచేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు కొనియాడారు. గజ్వేల్‌లో జరిగిన అభివృద్ధిని మోడల్‌గా చూపుతూ ఇదే తరహాలో ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని సీఎం సూచించారని తెలిపారు. మెరుగైన నగర, పట్టణ జీవన వ్యవస్థను తీసుకురావడానికి ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, వైకుంఠధామాల నిర్మాణంతో పాటు పట్టణాలకు అనుకొని ఉండే విధంగా అర్బన్ పార్కులను నిర్మించి స్వచ్ఛమైన గాలి అందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడానికి కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


లక్ష్మీ పంపు హౌస్‌లోని డెలివరీ సిస్టం వద్ద రాజేందర్‌సింగ్, తదితరులు

## నీళ్లకు 'బడ్జెట్' రూపొందించాలి

### ఇండియన్ వాటర్‌మ్యాన్ రాజేందర్‌సింగ్

**కాళేశ్వరం:** రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తరలిపోతున్న నీటి వినియోగానికి సంబంధించి ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలని గుజరాత్‌కు చెందిన 'ఇండియన్ వాటర్ మ్యాన్'బిరుదు గ్రహీత రాజేందర్‌సింగ్ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా తరలిపోతున్న నీటిని రైతులు, పరిశ్రమలు, తాగునీటి అవసరాలకు ఎంతెంత వినియోగిస్తున్నారో లెక్కలు తీసి ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలని పేర్కొన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని లక్ష్మీ బ్యారేజీ, లక్ష్మీ పంపు హౌస్‌ను ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లతో కలసి ఆయన సందర్శించారు. ప్రాజెక్టు స్వరూపం నీటి లభ్యతను ఈఎన్‌సీ వివరించారు. రాజేందర్‌సింగ్ మాట్లాడుతూ.. రెండేళ్ల కిందట తాను ఇక్కడకు వచ్చినప్పుడు గోదావరి ఎండిపోయిందని, ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రకృతి సిద్ధంగా నీరు తరలిపోతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నీటి కేటాయింపులను దృష్టిలో పెట్టుకుని నిధులను కేటాయించాలన్నారు.

## కాటన్ మిల్లులో అగ్నిప్రమాదం

### రూ.కోటి విలువ చేసే పత్తి దగ్ధం

**జనగామ:** జనగామ జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న శివ ఇండస్ట్రీస్ కాటన్ జిన్నింగ్ (పత్తి) మిల్‌లో మంగళవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి పత్తి కుప్పలకు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.కోటికి పైగా ఆస్తి నష్టం వాటిళ్లినట్లు భావిస్తున్నారు. జనగామకు చెందిన వ్యాపారి బుస్సా లింగమూర్తికి చెందిన శివ ఇండస్ట్రీస్‌లో ప్రభుత్వం ఇటీవల సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దీంతోపాటు లింగమూర్తి ప్రైవేటుగా పత్తిని కొనుగోలు చేస్తున్నారు. మిల్లు ఆవరణలో సుమారు 2 వేల క్వింటాళ్ల పత్తిని నిల్వ చేశారు. ఈ క్రమంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు ఒక్కసారిగా పత్తి కుప్పలకు అంటుకున్నాయి.

## రియల్టర్ హత్య

### భూతగాదాలే కారణమా ?


రాజిరెడ్డి

**కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్లలో మంగళవారం పట్టపగలు రియల్టర్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి (55) హత్యకు గురవడం కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడిపల్లి మండలం మన్నెగూడెంకు చెందిన చిట్టిరెడ్డి రాజిరెడ్డి కోరుట్లలోని బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్నాడు. పదేళ్లుగా కోరుట్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న రాజిరెడ్డి కొంతకాలంగా భూ వివాదాలతో బెదిరింపులకు గురవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం బస్టాండ్ సమీపంలోని తన సొంతింట్లో రాజిరెడ్డి ఒక్కడే ఉన్న సమయంలో ఐదుగురు దుండగులు ఇంట్లోకి చొరబడినట్లు సమాచారం. ముగ్గురు ఇంటి బయట ఉండగా.. మరో ఇద్దరు లోపలికి వెళ్లి గొడవ పడినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే బెడ్‌రూంలో ఉన్న దిండును రాజిరెడ్డి ముఖంపై ఉంచి నొక్కిపెట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాజిరెడ్డి ముక్కు, నోటి నుంచి రక్తం కారిన ఆనవాళ్లు అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. దుండగులు రాజిరెడ్డి వద్ద ఉన్న సమయంలో అతని స్నేహితుడు రత్నాకర్ ఫోన్ చేయగా దుండగుల్లో ఒకరు మాట్లాడి ఫోన్ కట్ చేసినట్లు సమాచారం. ఆ తరువాత ఫోన్ ఎత్తుకెళ్లినట్లు తెలిసింది.

### ఏడో రోజు ఆదాయం 48.05 లక్షలు

**హన్మకొండ కల్చరల్ :** మేడారంలో సమ్మక్క – సారలమ్మ జాతర సందర్భంగా భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల లెక్కింపు కొనసాగుతోంది. హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏడో రోజైన మంగళవారం రూ.48,05,912 ఆదాయం లభించిందని ఈఓ రాజేందర్ తెలిపారు. 17 హుండీలను లెక్కించగా.. ఇప్పటి వరకు 436 ఐరన్ హుండీల లెక్కింపు పూర్తయింది. ఏడు రోజుల ఆదాయాన్ని కలిపితే ఇప్పటి వరకు మొత్తం రూ.10.29 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు.

## అవి మా గన్నులే...

**ఆ రెండు తుపాకులు హుస్నాబాద్ పీఎస్‌లోనివే..**
- ఎత్తుకెళ్లింది దేవుని సదానందమే
- కుటుంబ సమస్యల పరిష్కారం కోసం ఆయుధాల దొంగతనం
- ఇన్‌చార్జి సీపీ శ్వేత వెల్లడి

**సిద్దిపేట కమాన్:** సిద్దిపేట జిల్లా అక్కనపేట మండల కేంద్రంలో ఈ నెల 6వ తేదీన చోటుచేసుకున్న కాల్పుల సంఘటన, హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో తుపాకుల మిస్సింగ్‌పై 2018లో నమోదైన కేసును జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ రెండు కేసులకు సంబంధించిన వివరాలను సిద్దిపేటలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి పోలీసు కమిషనర్ శ్వేత కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. అక్కనపేటకు చెందిన దేవుని సదానందం తమ ఇంటి వద్ద జరిగిన గొడవలో గుంటి గంగరాజుపై 6వ తేదీ రాత్రి ఏకే 47తో కాల్పులు జరిపి పారిపోయాడు. దీంతో అక్కన పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి మూడు ప్రత్యేక బృందాలతో పోలీసులు విచారణ చేపట్టారు. మరుసటి రోజు కోహెడ మండల కేంద్రంలో సదానందాన్ని హుస్నాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న గన్‌ను స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అనంతరం సదానందాన్ని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేయగా 12వ తేదీ నుంచి 18 వరకు కస్టడీకి కోర్టు అనుమతి ఇచ్చింది.

**కుటుంబ గొడవల నేపథ్యంలో..**

తన భార్యతో కుటుంబ గొడవలు, సమీప బంధువులతో ఉన్న ఆర్థికపరమైన గొడవల కారణంగానే ఆయుధాలను దొంగలించినట్లు సదానం దం విచారణలో ఒప్పుకున్నాడని ఇన్‌చార్జి సీపీ శ్వేత తెలిపారు. ఆ సమస్యల పరిష్కారం కోసమే 2017లో హోళీ పండుగ నాడు హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏకే 47 గన్, కార్బైన్ తుపాకీ, 30 తూటాలను దొంగిలించినట్లు చెప్పాడని పేర్కొన్నారు. ఈ ఆయుధాలతో ప్రత్యర్థులను భయపెట్టి తన కుటుంబ, ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించుకోవాలని చూశాడు. కానీ 2017 నుంచి తన భార్య, బంధువులతో సమస్యలు ఒక్కొక్కటి పరిష్కారమయ్యాయి. దీంతో తాను దొంగిలించిన ఆయుధాలను ఎప్పుడూ వినియోగించలేదు. కానీ ఈ నెల 6న అక్కన్నపేట మండల కేంద్రంలోని గుంటి గంగరాజు, అశోక్‌లతో గొడవ జరగ్గా సదానందం తాను దొంగలించిన గన్‌తో గంగరాజు ఇంటిపై కాల్పులు జరిపి పారిపోయాడు. ఘటనకు సంబంధించి సదానందాన్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతని వద్ద ఉన్న ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

**విధుల్లో నిర్లక్ష్యమే కారణమా?**

తుపాకులు దొంగిలించిన సమయంలో విధుల్లో ఎవరు ఉన్నారు? అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారా? అనే విషయాలు సిద్దిపేట ఏసీపీ రామేశ్వర్ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతిలో విచారణ జరిపి నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామని ఇన్‌చార్జి సీపీ శ్వేత వెల్లడించారు. అధికారులు ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిద్దిపేట ఏసీపీ రామేశ్వర్, హుస్నాబాద్ ఏసీపీ మహేందర్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ శ్వేత


స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

## విషాదం నింపిన ఈత సరదా

**చెరువులో పడి ముగ్గురు విద్యార్థులు మృతి**
- ఒకరిని కాపాడబోయి మరో ఇద్దరు మృత్యువాత
- సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో ఘటన

**జిన్నారం:** ఈత సరదా విషాదం నింపింది. చెరువులో పడి ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అన్నారం గ్రామానికి చెందిన సందీప్, మహిపాల్, సూరారం గ్రామానికి చెందిన పల్లవ్‌కుమార్ ముగ్గురు విద్యార్థులు అన్నారంలోని ఎయిర్‌ఫోర్స్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్నారు. పాఠశాలకు సెలవు కావడంతో ఈతకు వెళ్దామని నిర్ణయించుకున్నారు. సందీప్, మహిపాల్, పల్లవ్‌కుమార్‌తో పాటు మరో ముగ్గురు స్నేహితులు గ్రామ శివారులోని కొత్తకుంట చెరువుకు వెళ్లారు. ముందుగా ఈత వచ్చిన సందీప్ చెరువులోకి దిగగా.. అతను అదుపు తప్పి చెరువులో మునిగిపోయాడు. తనను కాపాడమని సందీప్ గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్న మహిపాల్, పల్లవ్‌లు సందీప్‌ను కాపాడేందుకు విఫల యత్నం చేశారు. కాపాడబోయి వారిద్దరూ నీటిలో మునిగిపోయారు. చూస్తుండగానే ముగ్గురు సహచరులు నీటిలో మునిగిపోవడంతో గట్టుమీద ఉన్న మరో ముగ్గురు విద్యార్థులు అరుపులు పెట్టడంతో పక్కనే ఉన్న ఇటుక బట్టీల్లో పనిచేసే వ్యక్తులు చెరువులోకి దిగి ముగ్గురిని బయటకు తీయగా.. అప్పటికే వారు ముగ్గురు మృతి చెంది ఉన్నారు. మృతదేహాలను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు.


సందీప్, మహిపాల్, పల్లవ్‌కుమార్ మృతదేహాలు

## నల్లగొండలో అరుదైన చికిత్స

**విద్యార్థికి చెమటలా కారుతున్న రక్తం**
- ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాని వ్యాధి
- చివరకు హెమటైడ్రోసిస్ వ్యాధిగా గుర్తించిన నల్లగొండ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వైద్యులు
- ఆస్పత్రిలో చికిత్స.. పూర్తిగా కోలుకున్న బాధితుడు


శంకర్ రెడ్డి

**నల్లగొండ టౌన్:** అరుదైన వ్యాధికి నల్లగొండ జిల్లా మెడికల్ కళాశాల జనరల్ ఆస్పత్రి వైద్యులు చికిత్స చేసి నయం చేశారు. కోట్ల మందిలో ఒకరికి యుక్త వయస్సులో వచ్చే జబ్బు (హెమటైడ్రోసిస్)గా చెబుతున్న ఈ వ్యాధిని నయం చేసిన ఘనత జిల్లా జనరల్ ఆస్పత్రికి దక్కింది. మాడుగులపల్లి మండలం పోరెడ్డిగూడేనికి చెందిన వి.వెంకట్‌రెడ్డి కుమారుడు శంకర్‌రెడ్డి (11)కి చెమటకారిన విధంగా శరీర భాగాల నుంచి రక్తం కారేది. 2017 ఆగస్టు నుంచి ఆ విద్యార్థి శరీరంలోని ముఖం, చెంపలు, చేతులు, కాళ్ల మీద నుంచి రక్తం కారడం మొదలైంది. దీంతో వెంకట్ రెడ్డి తన కుమారుడిని నల్లగొండ, హైదరాబాద్‌లోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్ప త్రులకు రెండేళ్ల పాటు తిప్పారు. రూ. లక్షలు ఖర్చు చేసినా.. వ్యాధిని గుర్తించలేకపోయిన వైద్యులు 'రక్తం ఎలా కారుతుంది'అని ఎదురు ప్రశ్న వేసి పంపించేవారు.

**వ్యాధి నిర్ధారణ ఇలా..**

2018 డిసెంబర్‌లో తన గ్రామానికే చెందిన జిల్లా జనరల్ ఆస్పత్రిలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ సురేష్‌రెడ్డికి తన కుమారుడి వ్యాధిని గురించి వెంకట్‌రెడ్డి వివరించారు. శంకర్‌రెడ్డికి ఆస్పత్రిలో పలురకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు గత రిపోర్టులను పరిశీలించారు. చివరకు ఇంటర్నెట్‌లో వైద్యరంగానికి చెందిన లిటరసీలో సెర్చ్ చేయడంతో వ్యాధి గురించి తెలిసింది. వ్యాధి లక్షణాలను పోల్చి చూసి పరీక్షలను చేయడంతో ఆ విద్యార్థి హెమటైడ్రోసిస్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారణకు వచ్చారు. కేవలం టీనేజీ వయస్సులోని వారికి కోట్ల మందిలో ఒకరికి మాత్రమే ఈ వ్యాధి వస్తుందని డాక్టర్ సురేష్‌రెడ్డి తెలిపారు. వ్యాధిని గుర్తించి జనరల్ ఆస్పత్రిలో ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని చికిత్స ప్రారంభించారు. వ్యాధి నుంచి వారం రోజుల్లో విద్యార్థి కోలుకుంటున్నట్లు గుర్తించి అవుట్ పేషంట్‌గా చికిత్స అందించారు. నాలుగు నెలల తర్వాత శంకర్‌రెడ్డి పూర్తిగా కోలుకున్నాడు. దీంతో అతని తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

**అత్యంత అరుదైన వ్యాధి**



మెడిసిన్ రంగంలో హెమటైడ్రోసిస్ వ్యాధి అత్యంత అరుదైనది. ఇప్పటి వరకు ఆ వ్యాధి గురించి నేను వినలేదు. వ్యాధి లక్షణాల గురించి పరిశీలించి వైద్యరంగానికి చెందిన లిటరసీలో ఆన్‌లైన్‌లో తెలుసుకున్నాను. హెమటైడ్రోసిస్ వ్యాధి లక్షణాలు పోలిఉండటంతో ఇన్‌పేషంట్‌గా జాయిన్ చేసుకుని చికిత్స అందించాం. వ్యాధి నయమైంది. అయితే టీనేజీ వయస్సు దాటే వరకు మందులు వాడాల్సి ఉంటుంది. టీనేజీ తర్వాత వ్యాధి పూర్తిగా నయమయ్యే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ యెన్న సురేష్‌రెడ్డి


**నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
CIN No. U40109TG2000SGC034119
టెండరు ప్రకటన
TSNPDCL వారు తయారీదార్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ద్వారా మెటీరియల్స్ కొనుగోలు చేయుటకు ఉద్దేశిస్తున్నారు. స్పెసిఫికేషన్ నం.:CGM/P&MM/OT-42 to OT-47/2019-20 & STN-24 to STN-25/2019-20
మెటీరియల్ పేరు: వివిధ రకాల మెటీరియల్స్
బిడ్ సెక్యూరిటీ @2% ఆన్ ఎక్స్-వర్క్స్. ఆన్‌లైన్ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల డౌన్‌లోడింగ్ ప్రారంభం: 20.02.2020న ఉ.11.00 గం. నుండి. తదుపరి వివరాల కోసం దర్శించండి: www.tender.telangana.gov.in మరియు www.tsnpdcl.in. డిజిటల్ కీ పొందుటకు దర్శించండి: www.tsts.gov.in
ఫోన్ నం.0870-2461507
మెయిల్ ఐడి: cgmpmm@tsnpdcl.in సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (P&MM)

తెలంగాణ ప్రభుత్వం
**ప్రాంతీయ అధికారి కార్యాలయం, పంచాయతీరాజ్ రీజియన్, నిజామాబాద్**
NIT No.571 to 581/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 17.02.2020
పనుల సంఖ్య: (11), పనుల పేర్లు: Rurban (CGF) – వ్యవసాయ గిడ్డంగి (500MT) నిర్మాణం, Rurban (CGF) – మెట్ల నిర్మాణం, Rurban (CGF) – భక్తుల కోసం షెడ్ నిర్మాణం, SCDD - కమ్యూనిటీ హాల్ నిర్మాణం మరియు ఇతర అన్ని సివిల్ పనులు దిగువ సంతకందారు పరిధిలో ఉన్నాయి. మొత్తం ECV: రూ.2.79 కోట్లు. టెండరు షెడ్యూళ్లను 19.02.2020 ఉ.10.30 గం. నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ సైట్‌లో అప్‌లోడ్ చేయవచ్చును. టెండర్ల ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది 26.02.2020 మ.3.00 గం. వరకు. ఇతర వివరాలు మరియు తదుపరి సవరణలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in నుండి పొందవచ్చును. ఫోన్ నం.08462-239502
సం/- ప్రాంతీయ అధికారి, PR రీజియన్, నిజామాబాద్
DIPR RO.No.2468-DP/CL/Advt/1/2019-20, Dt: 18.02.2020

తెలంగాణ ప్రభుత్వం
**పంచాయతీరాజ్ శాఖ**
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, PR రీజియన్, వరంగల్
NIT No. 111 to 145/BTR/19-20 సంక్షిప్త టెండరు ప్రకటన తేది: 17-02-2020
పనుల సంఖ్య (35), పనుల పేరు : ప్యాకేజి నం. JNG/BTR/01 (6 పనులు) పాలకుర్తి (M), ప్యాకేజి నం. JNG/BTR/02 (11 పనులు) పాలకుర్తి (M), ప్యాకేజి నం. JNG/BTR/03 (7 పనులు) దేవరుప్పుల (M), ప్యాకేజి నం.JNG/BTR/03 (7 పనులు) బచ్చన్నపేట & జనగామ (M) మొ॥ వాటి కోసం దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 77.16 కోట్లు. బిడ్ దాఖలు ప్రారంభ తేది, సమయం : 22-2-2020 రా. 9.00 గం. బిడ్ దాఖలు ముగింపు తేది, సమయం: 29-2-2020 మ. 3.00 గం. తదుపరి వివరాలకు దర్శించండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in. ఫోన్ నం. 0870-2578114.
DIPR RO.No.2465-DP/CL/Advt/1/2019-20, Dt: 18/02/2020 సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, PR రీజియన్, వరంగల్

**Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.**
NOTIFICATION FOR ADMISSION INTO PH.D., COURSE FOR THE YEAR 2019-20
In continuation to the earlier notification dt.27.01.2020, this is hereby notified that, the last date for submission of Ph.D filled in applications for admission at Dr. NTR University of Health Sciences, Vijayawada is extended up to 29.02.2020. For detailed information please visit University Website at http://ntruhs.ap.nic.in
VIJAYAWADA-520 008, Dated: 18-02-2020 Sd/- REGISTRAR

**ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్**
ప్లాట్ నం.9, సర్వే నం.49, IT పార్క్, మంగళగిరి-522503, గుంటూరు జిల్లా. అమరావతి రీజియన్, ఆంధ్రప్రదేశ్, ఇ-మెయిల్:ce.aphmhidc@gmail.com
టెండరు ప్రకటన నం.12/APMSIDC/2019-20, తేది: 18-02-2020
ఆంధ్రప్రదేశ్‌లోని దిగువ తెలిపిన జిల్లాలలోని వివిధ ప్రదేశాల వద్ద హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల కోసం కొత్త భవనాల నిర్మాణం కొరకు రివర్స్ టెండరింగ్ విధానం ద్వారా ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. 1) శ్రీకాకుళం జిల్లా (10 ప్యాకేజీలలో 365 నం.లు) పనుల విలువ: రూ.6697 లక్షలు. 2) విజయనగరం జిల్లా (9 ప్యాకేజీలలో 254 నం.లు) పనుల విలువ: రూ.4649 లక్షలు. 3) విశాఖపట్నం జిల్లా (13 ప్యాకేజీలలో 399 నం.లు) పనుల విలువ: రూ.7389 లక్షలు. 4) తూర్పు గోదావరి జిల్లా (17 ప్యాకేజీలలో 425 నం.లు) పనుల విలువ: రూ.7978 లక్షలు. 5) పశ్చిమ గోదావరి జిల్లా (15 ప్యాకేజీలలో 425 నం.లు) పనుల విలువ: రూ.7982 లక్షలు. 6) కృష్ణా జిల్లా (13 ప్యాకేజీలలో 411 నం.లు) పనుల విలువ: రూ.7770 లక్షలు. 7) గుంటూరు జిల్లా (15 ప్యాకేజీలలో 414 నం.లు) పనుల విలువ: రూ.7821 లక్షలు. 8) ప్రకాశం జిల్లా (12 ప్యాకేజీలలో 423 నం.లు) పనుల విలువ: రూ.7930 లక్షలు. 9) నెల్లూరు జిల్లా (9 ప్యాకేజీలలో 345 నం.లు) పనుల విలువ: రూ.6432 లక్షలు. 10) చిత్తూరు జిల్లా (14 ప్యాకేజీలలో 408 నం.లు) పనుల విలువ: రూ.7513 లక్షలు. 11) కడప జిల్లా (10 ప్యాకేజీలలో 317 నం.లు) పనుల విలువ: రూ.5833 లక్షలు. 12) అనంతపురం జిల్లా (14 ప్యాకేజీలలో 279 నం.లు) పనుల విలువ: రూ.5142 లక్షలు. 13) కర్నూలు జిల్లా (13 ప్యాకేజీలలో 402 నం.లు) పనుల విలువ: రూ.7521 లక్షలు. ఇతర వివరాలను వెబ్‌సైట్ http://msidc.ap.nic.in లో చూడవచ్చును.
DIPR Ro No.401 PP/CL/Advt/1/1/2019-20, Dt: 18-02-2020 సం/- మేనేజింగ్ డైరెక్టర్

**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD**
KUKATPALLY, HYDERABAD - 500085, TELANGANA, INDIA.
**TS EAMCET-2020 NOTIFICATION**
Telangana State Engineering, Agriculture and Medical Common Entrance Test being conducted on behalf of TSCHE
A Computer Based Common Entrance Test, designated as Telangana State Engineering, Agriculture and Medical Common Entrance Test-2020 (TS EAMCET-2020) of Telangana State will be conducted by JNTUH for entry into the professional courses offered for the academic year 2020-21 in the State of Telangana. The TS EAMCET-2020 test will be conducted in ONLINE mode only. Eligible candidates who wish to apply for TS EAMCET-2020 have to submit their applications through ONLINE mode ONLY from 21-02-2020 to 30-03-2020 (without late fee). Detailed information regarding Syllabi, List of courses, Procedure for Online Application with/without late fee and Computer Based Test etc., is given in the Detailed Notification & Instruction Booklet that is available in the website https://eamcet.tsche.ac.in

Date, Time and Registration Fee of the Test:

| Stream | Date | Time | Registration Fee |
|---|---|---|---|
| Engineering (E) | 04-05-2020<br>05-05-2020<br>07-05-2020 | 10 AM to 1 PM<br>&<br>3 PM to 6 PM | Rs. 400/- (for SC/ST & PH candidates for E or AM)<br>Rs. 800/- (for Others for E or AM) |
| Agriculture & Medical (AM) | 09-05-2020<br>11-05-2020 | 10 AM to 1 PM<br>&<br>3 PM to 6 PM | Rs. 800/- (for SC/ST & PH candidates for both E & AM)<br>Rs. 1600/- (for Others for both E & AM) |

The Registration fee has to be paid at TSOnline Centers in T.S., APOnline Centers in A.P. or through online using Credit card / Debit card / Net banking.
Note:This is only a Notification for Computer based entrance test. Candidate has to fulfill the eligibility criteria laid down in the relevant G.O.s at the time of admission.
Hyderabad Date : 19.02.2020 Sd/- CONVENER, TS EAMCET-2020





epaper.sakshi.com

# విజయ పాలు లీటర్ రూ.47

## రెండు నెలల వ్యవధిలో రూ.5 పెంపు



**హైదరాబాద్:** విజయ డెయిరీ లీటర్ పాల ధర రూ.47కి చేరింది. తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డెయిరీ) ఈ రెండు నెలల కాలంలో లీటరు పాలపై రూ.5 పెంచింది. గత రెండు నెలల క్రితమే రూ.2 పెంచింది. తాజాగా మళ్లీ మరోసారి రూ.3 పెంచడంతో విజయ పాల వినియోగదారులు ఈ పెంపును భారంగా భావిస్తున్నారు. గతేడాది డిసెంబర్‌లో లీటరు రూ.42కు లభించగా విజయ డెయిరి నష్టాల నుంచి గట్టెక్కించాలనే ఉద్దేశంతో రూ.2 పెంచి రూ.44కు లీటర్ పాలు విక్రయించారు. తాజాగా రూ.3 పెంపుతో విజయ టోన్డ్ మిల్క్ లీటరు రూ.47కు చేరింది. దీనిపై విజయ డెయిరీ మార్కెటింగ్ అధికారులను వివరణ కోరగా.. జనవరి 26న పాడి రైతులకు ప్రొక్యూర్‌మెంట్ కోసం రూ.2 పెంచామన్నారు. ఆ పెంపును భర్తీ చేయడానికే తాజాగా లీటరు పాల ధరను పెంచాల్సి వచ్చిందన్నారు. ఈ పెంపు ఈ నెల 16 నుంచే వర్తిస్తుందని తెలిపారు.

# పలుచోట్ల పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. గత 24 గంటల్లో కొమురంభీం జిల్లా జిన్నెదారి, ఆసిఫాబాద్, సిర్పూరుల్లో 8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా బేలా, అర్లిలలో 9 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అదే జిల్లా లోకారిలో 9 డిగ్రీలు, థాంసి, మాన్‌గ్రుడ్‌లలో 10 డిగ్రీల చొప్పున రాత్రి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. హన్మకొండలో సాధారణం కంటే 6 డిగ్రీలు తక్కువగా 14 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే రామగుండంలో సాధారణం కంటే 5 డిగ్రీలు తక్కువగా 14 డిగ్రీల రాత్రి ఉష్ణోగ్రత నమోదైంది.

# ఆ ఎక్స్‌ప్రెస్‌లు భువనగిరిలో ఆపాలి

## రైల్వే మంత్రి గోయల్‌కు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వినతి



**సాక్షి, హైదరాబాద్:** శాతవాహన, పద్మావతి, కోణార్క్, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికుల కోసం భువనగిరి రైల్వే స్టేషన్‌లో ఆపాలని భువనగిరి లోక్‌సభ సభ్యుడు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. చర్లపల్లి శాటిలైట్ రైల్వే స్టేషన్ శంకుస్థాపనకు మంగళవారం వచ్చిన రైల్వే మంత్రి పియూష్ గోయల్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయా రైళ్లకు భువనగిరిలో స్టాప్ ఏర్పాటు చేస్తే యాదాద్రికి వచ్చే భక్తులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. రామన్నపేట స్టేషన్‌లో చెన్నై, శబరి, కాకినాడ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు డెల్టా ఫాస్ట్ ప్యాసింజర్‌ను నిలపాలని, ఆలేరులో కోణార్క్, కాకినాడ–షిరిడి, నాగవల్లి, నాందేడ్, ఫలక్‌నుమా, పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాప్ ఏర్పాటు చేయాలని, జనగామలో నాందేడ్, చార్మినార్, నర్సాపూర్, నాగర్‌సోల్, ఫలక్‌నుమా, విశాఖపట్నం రైళ్లను ఆపాలని కోరారు.

# వరద జలాలపై కమిటీ ఏర్పాటు చేయండి

## కృష్ణా బోర్డుకు తెలంగాణ వినతి

**సాక్షి, హైదరాబాద్:** కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు వరద కొనసాగిన సమయంలో తెలంగాణ, ఏపీలు వినియోగించుకున్న నీటిపై కమిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ కృష్ణాబోర్డును కోరింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ ఈఎన్సీ మురళీధర్ మంగళవారం బోర్డుకు లేఖ రాశారు. కృష్ణా బేసిన్‌లోని అన్ని ప్రాజెక్టులు పూర్తిగా నిండి గేట్లు ఎత్తి వరద సముద్రంలోకి వెళ్తున్న సమయంలో రెండు రాష్ట్రాలు ఉపయోగించుకున్న నీటిని ఆయా రాష్ట్రాల వినియోగం కింద లెక్కించొద్దని ఏపీ ఇదివరకే బోర్డును కోరిన విషయాన్ని దృష్టికి తెచ్చారు.



# పిట్ట 'కొం'చెమే'!

## 80 శాతం పక్షి జాతుల తగ్గుదల

- గత 25 ఏళ్లలో క్రమంగా తగ్గిపోతున్న జాతులు
- స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్–2020 నివేదికలో వెల్లడి
- పెస్టిసైడ్స్ వినియోగం, రేడియేషన్‌లే ప్రధాన కారణాలు

**సాక్షి, హైదరాబాద్:** ఏడాదికి వివిధ రకాల సాధారణ పక్షుల్లో 80 శాతం వరకు తగ్గిపోతున్నాయి. గత 25 ఏళ్ల కాలంలో దేశంలోని ఐదోవంతుకు పైగా వివిధ పక్షి జాతుల (షార్ట్ టోడ్‌స్నేక్ ఈగిల్ (గద్ద) మొదలుకుని సర్కిర్ మల్కోటాగా పిలిచే చిన్నపక్షి వరకు) సంఖ్య తగ్గిపోయింది. ఊర పిచ్చుక, పిట్ట వంటి సాధారణంగా కనిపించే పక్షిజాతి క్షీణత నుంచి కొంత మెరుగు పడినా... హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా వంటి ప్రధాన నగరాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఈ పిచ్చుకలు చాలా అరుదుగా కనిపిస్తున్నట్లు వెల్లడైంది. దేశంలోనే తొలిసారిగా వివిధ రకాల పక్షి జాతులపై స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్–2020 (ఎస్‌వోఐబీ) పేరిట డబ్ల్యూడబ్ల్యూఎఫ్, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ, వైల్డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా, వెట్‌ల్యాండ్ ఇంటర్నేషనల్, నేచర్ కన్జర్వేషన్ ఫౌండేషన్, ఏ ట్రీ, బీఎన్‌హెచ్‌ఎస్ ఇండియా, ఎఫ్ఈఎస్, ఎన్‌సీబీఎస్, సాకాన్ సంస్థలు సంయుక్తంగా రూపొందించిన సమగ్ర నివేదికలో పలు అంశాలు వెల్లడయ్యాయి. ఈ–బర్డ్ ప్లాట్‌ఫామ్‌పై 867 భారత పక్షుల రకాలకు సంబంధించి 15,500 మందికి పైగా పక్షి వీక్షకులు తమ పరిశీలనాంశాల ఆధారంగా ఒక కోటికి పైగా అప్‌లోడ్ చేసిన వివరాలు, సమాచారం ప్రాతిపదికన ఈ నివేదికను తయారు చేశారు. పక్షుల సంఖ్య తగ్గిపోవడానికి స్పష్టమైన కారణాలు కనుక్కోవాల్సిన అవసరముందని సోమవారం గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నివేదిక విడుదల సందర్భంగా ఎస్‌వోఐబీ సభ్యుడు సోహెల్ ఖాదర్ పేర్కొన్నారు.

### రామ చిలుకల నుంచి కాకుల దాకా...

రాష్ట్రంలో రామ చిలుకలు, పాలపిట్ట, పిచ్చుకలు, గద్దలు చివరకు కాకుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోతోంది. అదే సమయంలో మనుషులకు ఆరోగ్యపరంగా నష్టం చేకూర్చే పావురాల సంఖ్య మాత్రం విపరీతంగా పెరుగుతోంది. పావురాల విసర్జనలు ఎండిపోయాక పొడిగా మారి గాలిలో కలిసి మనుషుల ఊపిరితిత్తుల్లోకి చేరుతోంది. దీంతో శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్న కేసులు పెరుగుతున్నాయి. పక్షుల్లో మొండి జీవిగా, ఎక్కడైనా బతకగలిగే ఓర్పు, నేర్పు ఉన్న జీవిగా గుర్తింపు పొందిన కాకులు కూడా క్రమంగా తగ్గిపోతున్నాయి. గతంలో ఎక్కడ చూసినా కాకుల గుంపులు కనిపించేవి.. ఇప్పుడు ఇక్కడొకటి అక్కడొకటి మాత్రమే కనిపిస్తున్నాయని ఆయా రకాల పక్షుల సంఖ్య తగ్గిపోతుందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. పక్షుల సంఖ్య ప్రమాదకరంగా తగ్గిపోవడానికి... నగరీకరణ పెరిగి చెట్లు, పచ్చదనం తగ్గిపోవడం ఒక కారణం కాగా.. కాలుష్యం, వివిధ రూపాల్లోని రేడియేషన్ మరో కారణం. అదేవిధంగా పంటలు పండించడంలో, పండ్ల చెట్ల పెంపకంలో పురుగు మందులు, రసాయనాల వినియోగం విపరీతంగా పెరిగిపోవడం ముఖ్య కారణం.

### కాలుష్యం, రేడియేషన్ ప్రభావం



'పక్షులు స్వేచ్ఛగా పెరిగే వాతావరణం తగ్గిపోవడం, కాలుష్యం పెరగడంతో పాటు వివిధ రూపాల రేడియేషన్‌తో పక్షుల సంఖ్య తగ్గిపోతోంది. గత 15 ఏళ్లుగా ఆయా అంశాలను దగ్గర నుంచి గమనిస్తున్న నాకు పక్షుల సంఖ్యలో తగ్గుదల స్పష్టంగా గోచరిస్తోంది. పక్షులను కాపాడుకోవడంలో ప్రజల జీవన విధానం, అనుసరిస్తున్న పద్ధతుల్లో కచ్చితమైన మార్పు రావాల్సిన అవసరముంది. కాలుష్యం, రేడియేషన్ పెరగడంతో పక్షులు గుడ్లు పెట్టినా వాటిని పొదగడం లేదు. ఆధునిక వసతులతో కూడిన వ్యవస్థ, దానితో పాటు ప్రకృతి, పర్యావరణం రెండూ అవసరం. ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటేనే ప్రాణకోటికి మనుగడ. పక్షులను కాపాడుకుని, అవి సహజ సిద్ధంగా ఉండేలా చేసినపుడే మానవాళికి కూడా వివిధ సమస్యల నుంచి రక్షణ లభిస్తుంది'.

– జి.సాయిలు, ఫారెస్ట్ ప్లస్ 2.0 రీజినల్ డైరెక్టర్, బయో డైవర్సిటీ కన్జర్వేషనలిస్ట్,

### భారీగా పెస్టిసైడ్స్ వినియోగంతో తీవ్ర నష్టం



'పంటల దిగుబడి పెంచేందుకు విచక్షణారహితంగా పురుగు మందులు, రసాయనాల వినియోగం పక్షులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పాలపిట్ట వంటి పక్షి పంట పొలాలపై క్రిములను తిని జీవనం సాగిస్తుంది. ప్రస్తుతం పెస్టిసైడ్స్‌ను అడ్డూఅదుపు లేకుండా ఉపయోగిస్తుండటంతో క్రిమి, కీటకాలు లేక పాలపిట్టల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. రామ చిలుకలు, ఊర పిచ్చుకలదీ ఇదే పరిస్థితి. పండ్ల చెట్లు ఎక్కువ ఫలాలు ఇచ్చేందుకు పురుగు మందులు వినియోగిస్తుండటంతో వాటిని తిని రామచిలుకలు చచ్చిపోవడమో లేక వాటి పునరుత్పత్తి గణనీయంగా తగ్గిపోవడమో జరుగుతోంది'.

– శంకరన్, వరల్డ్‌లైఫ్ విభాగం ఓఎస్డీ

# ఆరోగ్య రంగంలో అగ్రగామిగా భారత్

- నోవార్టిస్ సీఈవో వాస్ నరసింహన్
- జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డు సంతోషాన్నిచ్చింది

**సాక్షి, హైదరాబాద్:** ఆరోగ్య రంగంలో ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచే సత్తా భారత్‌కు ఉందని, 50 కోట్ల మంది ప్రజలకు మెరుగైన ఆరోగ్యం కల్పించేందుకు చేపట్టిన ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు ఇందుకు నిదర్శనమని అంతర్జాతీయ ఫార్మా కంపెనీ నోవార్టిస్ సీఈవో వాస్ (వసంత్) నరసింహన్ స్పష్టం చేశారు. దేశంలోని మేధో సంపత్తిని దృష్టిలో ఉంచుకున్నా, బయో టెక్నాలజీ, ఆరోగ్య రంగాల్లో మన శక్తి సామర్థ్యాలను పరిగణనలోకి తీసుకున్నా భారత్ ప్రపంచంపై తనదైన ముద్ర వేసేందుకు ఇది మంచి తరుణమని అభిప్రాయపడ్డారు. జీవశాస్త్ర పరిశ్రమల రంగంలో విశేష కృషి జరిపేందుకు బయో ఆసియా ఏటా అందించే జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్సీ అవార్డును వాస్ నరసింహన్ మంగళవారం అందుకున్నారు. మంత్రి కె.తారక రామారావు, కేంద్ర మంత్రి పియూష్ గోయల్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం వైద్య రంగంలో వస్తున్న మార్పులపై వాస్ ప్రసంగించారు. మానవ చరిత్రలో మందులనేవి వచ్చి కేవలం రెండు మూడు వందల సంవత్సరాలు మాత్రమే అయిందని, మందులతో చేసే వైద్యం కూడా ఇప్పుడు మారిపోయి.. కణ ఆధారిత, జన్యు ఆధారిత వైద్యంగా పరిణమిస్తోందని అన్నారు. కేన్సర్‌తోపాటు గుండె జబ్బులకు, మలేరియా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కూడా కణ ఆధారిత చికిత్సలు అందుబాటులోకి వచ్చే రోజు ఎంతో దూరంలో లేదని అభిప్రాయపడ్డారు. తొలినాటి వైద్య విధానాల పుణ్యమా అని మానవ ఆయుః ప్రమాణం 40 ఏళ్ల నుంచి 80–90 ఏళ్లకు పెరిగిందని ఆయన గుర్తు చేశారు. కణ, జన్యు ఆధారిత చికిత్సలు కూడా ఆయుః ప్రమాణాలను మరింత పెంచడంతోపాటు వృద్ధాప్య సమస్యలను తగ్గించేవిగా ఉంటాయని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాల సాయంతో ఈ అద్భుతాలను సాధించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని చెప్పారు. అయితే ఈ రకమైన అత్యాధునిక వైద్య విధానాలు సామాన్యుడికి సైతం అందుబాటులోకి వచ్చినప్పుడు మాత్రమే పరిశోధనలకు సార్థకత అని పేర్కొన్నారు.

**హైదరాబాద్ కేంద్రంగా బయోమ్..**

నోవార్టిస్‌కు ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద కేంద్రం ఉందని, దీనికి అదనంగా బయోమ్ పేరుతో ఇంకో వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని వాస్ నరసింహన్ ప్రకటించారు. బయోమ్ కేంద్రాలు ఇప్పటి వరకూ కేవలం శాన్‌ఫ్రాన్సిస్కో, ప్యారిస్, లండన్‌లలో మాత్రమే ఉన్నాయని.. తాజాగా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన తన తాత.. బాసిల్ యూనివర్సిటీలో ఇంటర్న్‌గా చేరి అప్పట్లో ఉద్యోగం చేసిన కంపెనీనే కాలక్రమంలో నోవార్టిస్‌గా మారడం తాను దానికి సీఈవోగా బాధ్యతలు చేపట్టడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు.

# మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం

## 35 మందికి పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలకు నూతన కమిషనర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లుగా పనిచేస్తున్న పలువురికి స్థాన చలనం కలిగిస్తూ, గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్లుగా డైరెక్ట్ నియామకం పొందిన వారికి మున్సిపల్ కమిషనర్లుగా పోస్టింగులు ఇచ్చింది. కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు తర్వాత పూర్తి స్థాయి కమిషనర్లను నియమించకపోవడంతో రెవెన్యూ, పంచాయతీరాజ్ విభాగాలకు చెందిన పలువురు అధికారులు మున్సిపల్ కమిషనర్లుగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇతర విభాగాల అధికారులను మున్సిపల్ కమిషనర్ బాధ్యతల నుంచి తప్పిస్తూ పూర్తి స్థాయి కమిషనర్లను నియమించారు. వీరిలో ఎక్కువ మంది గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్లుగా ఎన్నికై పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్నారు. పట్టణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని సీఎం కేసీఆర్ భావిస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీలకు పూర్తి స్థాయి కమిషనర్లను నియమించడం ప్రాధాన్యత సంతరించుకుంది.






Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.